నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
వరంగల్
శుక్రవారం నవంబర్ 15, 2024
www.navatelangana.com

త్వరలోనే జనరల్ ఆస్పత్రికి ఆధునిక పరికరాలు

ఫ్యాకల్టీ సమావేశంలో కలెక్టర్ సత్యశారద



నవతెలంగాణ-నర్సంపేట

నర్సంపేటలోని వైద్య కళాశాల, జనరల్ ఆస్పత్రిలో త్వరలోనే ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చుతామని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద అన్నారు. గురువారం కళాశాల, ఆసుపత్రిని సందర్శించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మోహన్‌దాస్ అధ్యక్షతన నిర్వహించిన ఫ్యాకల్టీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వైద్య కళాశాల, ఆస్పత్రి స్థాయిలో రోగులకు తగు వైద్యం అందించడానికి కావాల్సిన ఆపరేషన్ థియేటర్, ల్యాబ్ తదితర పరికరాలను కొనుగోలు చేయడానికి డిటేయిల్ రిపోర్ట్సను అందజేయాలన్నారు. ప్రభుత్వంచే తొందరలోనే సమకూర్చుతామన్నారు. వైద్యులు క్రమం తప్పకుండా విధులకు హాజరై వైద్య సేవలను, విద్యార్థులకు బోధనలు అందించాలని సూచించారు. ఈసమావేశంలో వివిధ విభాగాల హెచ్ఒడీలు, ప్రొఫెసర్‌లు, ఆర్డీవో ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే సమగ్రంగా ఉండాలి

కలెక్టర్ సత్య శారద



నవతెలంగాణ-నర్సంపేట

ఇంటింటి సర్వేలో ఆర్థిక, సామాజిక, ఉపాధి కుల సమగ్రంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సత్య శారద అన్నారు. గురువారం పట్టణంలోని 18వ వార్డులో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ధేశం మేరకు ఎన్యుమరేటర్‌లు ఇచ్చిన ఫారాలలో కుటుంబ సమగ్ర సమాచారం పేర్కొనాలన్నారు. సర్వేను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ సంధ్యరాణి, జెడ్పీ సీఈవో రాంరెడ్డి, ఆర్డీవో ఉమారాణి, తహసిల్దార్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పులో వెండర్ జోన్స్ ఏర్పాటు చేయాలి

వినతి పత్రం అందజేత



నవతెలంగాణ-వరంగల్

వరంగల్ తూర్పు నియోజకవర్గం లో చిరు వ్యాపా రాలు చేసే వారికీ వెండర్స్ జోన్స్ ఏర్పాటు చేసి మడిగెలు కట్టించాలని చిరు వ్యాపారాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గజ్జెల లింగ మూర్తి, గడ్డం సుధాకర్‌లు అన్నారు. వరంగల్ కార్పొరేషన్ కార్యాలయంలో టౌన్ ప్లాన్ అధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు. చిరు వ్యాపారాలు సంఘం అధ్యక్ష కార్యదర్శులు గజ్జెల లింగమూర్తి గడ్డం సుధాకర్‌లు మాట్లాడుతూ వరంగల్ తూర్పు నియో జకవర్గ పరిధిలో వీధి వ్యాపారాలు చేసే వారికీ భద్రత కరువైందని, అనునిత్యం భయందోళనలో చిరు వ్యాపారాలు బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో వీధి వ్యాపారులకు అని రకాల వసతులు కల్పించి జోన్‌లు ఏర్పాటు చేసి చిన్న చిన్న మడిగెలు నిర్మాణం చేసి వీధి వ్యాపారులకు అండగా నిలి చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వలు ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందించి బడ్జెట్ కేటాయిస్తే ఒక్క వరంగల్ తూర్పు లో ఎందుకు జోన్ల ఏర్పాటు, మడిగేలా నిర్మాణం జరగలేదో తెలియడం లేదన్నారు. కార్పొరేషన్ నిర్లక్ష్యమా లేక ప్రజాప్రతినిధులు పట్టించుకోక పోవడమో అర్థం కావడం లేదన్నారు. ఏది ఏమైనా వీధి వ్యాపారాలు చేసుకొనే వారికీ ఏ దిక్కు లేకుండా అయిపోయిందన్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు మంత్రి ప్రత్యేక శ్రద్ధ వహించి యుద్ధ ప్రాతిపదికన జోన్ల ఏర్పాటు, మడిగెల నిర్మాణాలు చేపట్టాలన్నారు. ప్రతి రోజు చిరు వ్యాపారస్తుల సంఘం ఆధ్వర్యంలో తూర్పులో ఉన్న జిల్లా అధికారులను , ప్రజా ప్రతినిధులను కలిసి వినతి పత్రాలు అందిస్తామన్నారు. జోన్స్ మడిగెల నిర్మాణం వచ్చేవరకు నిరంతరం పోరాటం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో వీధి వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన మార్కెట్ చైర్మన్ వెంకటయ్యకు సన్మానం



నవతెలంగాణ-వర్ధన్నపేట

వర్ధన్నపేట నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్యను మాస్ ప్రజాసంఘాలు, ప్రతినిధులు సన్మానించారు. గురువారం వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన నరకుడు వెంకటయ్యని మాదిగల ఐక్య సంక్షేమ సంఘం (మాస్) నాయకులు మిద్దెపాక రవీందర్, జన్ను రాములు మారపల్లి ఎల్లయ్య, వల్లందాస్ కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి స్వీట్లు తినిపించారు. మండల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మాదిగ జాతికి మొట్టమొదటిసారి అవకాశం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మండలంలోని మాదిగల జాతి పక్షాన పెద్ద ఎత్తున సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించుకుంటామని వారు తెలిపారు.

కమ్యూనిస్టుల ద్వారానే సమాజంలో మార్పు

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు రత్నమాల



నవతెలంగాణ-కాశిబుగ్గ

దేశంలో ప్రజలు కోరుకుంటున్న మార్పు కమ్యూనిస్టుల ద్వారానే సాధ్య మవుతుందని సీపీఐ(ఎం) వరంగల్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు నలిగంటి రత్నమాల అన్నారు. గురువారం నగరంలోని ఉర్సు సమీపంలో గల ఎబాంబే కాలనీలో ఆవుల మంజుల అధ్యక్షతన బాంబే కాలనీ సీపీఐ(ఎం) శాఖ మహాసభ నిర్వహించగా రత్నమాల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా రత్నమాల మాట్లాడుతూ దేశంలో నేడు ప్రజలు పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యతో కొట్టుమిట్టాడుతున్నారని, ఉపాధి అవకాశాల కోసం గ్రామీణ ప్రాంతాల నుండి లక్షలాదిమంది పట్టణాలకు వలసలు వస్తున్నారని, అయినప్పటికీ పట్టణ ప్రాంతాలలో వారికి సరైన ఉపాధి అవకాశాలు లభించక చాలామంది ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు గ్యారెంటీలను మాత్రమే అమలు చేసిందన్నారు. నిరుద్యోగ సమస్యపై దృష్టి కేంద్రీకరించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రత్నమాల డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక..

మహాసభ అనంతరం బాంబే కాలనీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. వాంబేకాలనీ శాఖ నూతన కార్యదర్శిగా చెడుపెల్లి శైలజ, సహాయ కార్యదర్శిగా ఆవుల మంజుల కమిటీ, సభ్యులుగా గన్నారపు లచ్చవ్వ, శోభా, సుజాత, లావణ్య, జయ, సునీతలతో పాటు 14 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

సొసైటీ చైర్మన్ వైస్ చైర్మన్‌ల అవిశ్వాస తీర్మానంపై ఫిర్యాదు



నవతెలంగాణ- పర్వతగిరి

మండలంలోని చౌటపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సొసైటీలో సుమారు రూ.50 నుంచి 60 లక్షల వరకు అక్రమాలు జరిగాయని ఈనెల 20న చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానం కోసం అధికారులకు ఫిర్యాదు చేశామని డైరెక్టర్లు గురువారం మీడియాకు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సంబంధిత చైర్మన్, వైస్ ఛైర్మన్‌లను లెక్కలు చూపెట్టమని కోరగా పొంతనలేని సమాధానాలు చెబుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్లు సూరినేని సుధీర్‌రావు ,శ్రీనివాస్, అమృతరావు, పుల్లూరి భిక్షపతి, వల్లందాసు రంగయ్య, ఆగయ్య, చాంప్ల తదితరులు పాల్గొన్నారు.

సర్వేను సమర్ధవంతంగా నిర్వహించాలి

ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్



నవతెలంగాణ-పర్వతగిరి

కుల గణన సర్వేను సమర్ధవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ శంకర్ నాయక్ సూచించారు. మండలంలోని అనంతారం, ఏనుగల్లు, చింతనెక్కొండ, భట్టు తండా, తూర్పు తండా, గుగులోతు తండా, మాల్య తండా, హాట్యాతండా, చౌటపల్లి గ్రామాల్లో జరుగుతున్న కుటుంబ సమగ్ర సర్వే ను గురువారం ఆయన పరిశీలించారు. ఈక్రమంలో ఎన్యుమరేటర్లకు తగు సూచనలు జారీ చేసి, ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా సకాలంలో సర్వే పూర్తి చేయవలసిందిగా ఆదేశించారు. సర్వే ఫామ్‌లో ఉన్న అన్ని కాలాలను నింపాలని సూచించారు. ఎన్యూమరేటర్లు అందరూ నిర్దేశించిన సమయంలో వారికి కేటాయించిన ఇళ్లను ప్రతి రోజూ 12 నుండి 15 ఇళ్లను సర్వే చేయవలసిందిగా ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఏపీఓ సుశీల్‌కుమార్, ఆయా గ్రామాల ఎన్యూమరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వరంగల్ జిల్లాలో.. మందకోడిగా ధాన్యం కొనుగోళ్లు..!





మూడు రోజులుగా 21 కేంద్రాల్లోనే.. లక్ష్యానికి దూరంలో కొనుగోళ్లు

నవతెలంగాణ-వరంగల్‌ప్రాంతీయ ప్రతినిధి:

వరంగల్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు మందకోడిగా సాగుతున్నాయి. జిల్లాలో 184 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని భావించగా, ఇప్పటి వరకు 123 కేంద్రాలను ప్రారంభించినా, కేవలం 21 కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు 101 మంది రైతుల నుండి 690 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. సన్నాలకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్‌గా చెల్లించనున్నట్లు ప్రకటించింది. మూడు రోజులుగా కొనుగోళ్లు ప్రారంభమైనా, రైతులకు చెల్లింపుల ప్రక్రియ ప్రారంభం కాలేదు. జిల్లాలో ఐకెపికి సంబంధించి 54 కేంద్రాలకుగాను 41 కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఇందులో 16 కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేయడం ప్రారంభమైంది. పీఏసీఎస్‌లు 124 కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి వుండగా, ఇందులో 82 కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఇందులో 5 కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది వానాకాలం సీజన్‌లోనూ 203 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని నిర్ణయించినా డిసెంబర్ రెండో వారంనాటికి కేవలం 143 కేంద్రాలను మాత్రమే ప్రారంభించగలిగారు. డిసెంబర్ రెండో వారానికి కేవలం 10 వేల 49 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. 2022 వానాకాలంలో ధాన్యం కొనుగోళ్లు పెద్ద ఎత్తున జరిగిన గత ఏడాది నుండి కొనుగోళ్లలో మందకోడి కనిపిస్తుంది. గత ఏడాది కేవలం 56 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయడం ఇందుకు నిదర్శనం.

21 కేంద్రాల్లోనే కొనుగోళ్లు..

జిల్లాలో 184 కొనుగోలు కేంద్రాలకుగాను 123 కేంద్రాలను ప్రారంభించినా, కేవలం 21 కేంద్రాల్లో మాత్రమే ధాన్యాన్ని కొనుగోలు చేయడం గమనార్హం. ఐకెపికి చెందిన 16 కొనుగోలు కేంద్రాల్లో 587.880 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, పీఏసీఎస్‌లకు చెందిన 5 కేంద్రాల్లో కేవలం 102.440 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

తేమ శాతంతో పరేషాన్..

చలి తీవ్రత పెరగడంతో ధాన్యంలో తేమ శాతం అధికంగా వుంటుంది. వరి కోతలు ముగియగానే కొనుగోలు కేంద్రాల్లో రైతులు పెద్ద ఎత్తున ధాన్యాన్ని ఎండపెడుతున్నారు. సాయంత్రం నుండే చలి, మంచు కురుస్తుండడంతో దినమంతా ఎండకు ఎండిన ధాన్యం మంచుతో మళ్లీ తేమ శాతం పెరుగుతుండడంతో కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం అధికంగా వుంటే కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం రైతులకు ఇబ్బందికరంగా మారింది. అన్నింటి కంటే ముఖ్యంగా తేమ శాతాన్ని మేయింటెన్ చేయడం సమస్యగా పరిణమించింది.

లక్ష్యం ఘనం.. కొనుగోళ్లు అల్పం..

వరంగల్ జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2024-25లో 2 లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటి వరకు కేవలం 691 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయడం గమనార్హం. గత ఏడాది వానాకాలంలో 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా కేవలం 56 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు.

మూడు, నాలుగురోజుల్లో చెల్లింపులు

డీఎం, సంధ్యారాణి సివిల్ సప్లైస్, వరంగల్

గత మూడు రోజులుగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. మూడు, నాలుగురోజుల్లో రైతులకు చెల్లింపులు కూడా ప్రారంభమవుతాయి. వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. రైతులు నాణ్యతా ప్రమాణాలు, ముఖ్యంగా తేమ శాతం తగ్గించుకొని తీసుకువస్తే త్వరితగతిన ధాన్యాన్ని కొనుగోలు చేసే అవకాశముంటుంది.

గ్రూప్-3 పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

పరీక్షకు హాజరు కానున్న 10919 అభ్యర్థులు

28 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ

వివరాలు వెల్లడించిన జిల్లా కలెక్టర్



నవతెలంగాణ-వరంగల్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్‌సీ) ఆధ్వర్యంలో నవంబర్ 17, 18 తేదీలలో నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులకు సూచించారు. గురువారం వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వరంగల్ పరిధిలో గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు రీజినల్ కో-ఆర్డినేటర్ చంద్రమౌళి ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, అబ్జర్వర్లుకు పిపిటి ద్వారా శిక్షణ నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శారద మాట్లా డుతూ గ్రూప్-3 పరీక్షను ప్రశాంతంగా, సమర్థవం తంగా నిర్వహించుటకు అందరూ కో-ఆర్డినేషన్‌తో పని చేయాలని, పరీక్ష నిర్వహణ కు సంబంధిత శాఖ అధికారులకు టీజీపీఎస్‌సీ నిబంధనల మేరకు ఏర్పాట్లు చేయవలసిందిగా ఆదేశించారు.ప్రతి పరీక్ష కేంద్రంలో నిరంతరం కరెంట్, నీటి వసతి, అందేలా చూడాలని, విద్యార్థులు సెల్ ఫోన్లు, బ్యాగులు పెట్టుకోవడానికి ఒక ప్రత్యేకమైన కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. నవంబర్ 17 ,18 తేదీలలో పరీక్షను ఉదయం 10:00 నుండి మధ్యహ్నం 12:30 వరకు, మధ్యాహ్నం 3.00 గంటల నుండి 5. 30 వరకు పరీక్ష నిర్వహించబడుతుందని మధ్యా హ్నం నిర్వహించే పరీక్ష సాయంత్రం 5:30 వరకు ఉంటుందని,అందుకు ప్రతి పరీక్ష కేంద్రాలలో లైటింగ్ ఉండే విధంగా ఏర్పాటు చేయాలని కావలసిన ఏర్పాట్లను చీఫ్ సూపరింటెండెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా నుండి గ్రూప్-3 పరీక్ష రాసేందుకు10919 మంది అభ్యర్థులు హాజరుకా నున్నారని, అందుకుగాను 28 సెంటర్లలో ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. 28 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 32 మంది పరిశీలకులు, 82 మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, ఐదుగురు రూట్ ఆఫీసర్లు, 28 మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులను నియమించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో టీజీపీఎస్‌సీ రీజినల్ కో-ఆర్డినేటర్ బత్తిని చంద్రమౌళి మాట్లాడుతూ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్ల పూర్తి చేయడం జరిగిందని అన్నారు. ఈకార్యక్రమంలో డీసీపీ రవీందర్, అదనపు కలెక్టర్ ఇంచార్జ్ విజయలక్ష్మి డీసీపీ (అడ్మిన్) రవి, ఏసీపీ వరంగల్ నందిరామ్‌నాయక్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీకాంత్, సూపరిం టెండెంట్ కె.విశ్వ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కుడా చైర్మన్‌ను కలిసిన మండల నాయకులు



నవతెలంగాణ-సంగెం

కెనడా పర్యటన ముగించుకుని స్వదేశానికి విచ్చేసిన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డిని హనుమకొండలోని కుడా ఆఫీసులో మండల ఎస్సీసెల్ అధ్యక్షులు గుండేటి రాజు, మండల యువజన కాంగ్రెస్ నాయకులు గుండేటి శ్రీకర్‌లు మర్యాదపూర్వకంగా కలసి స్వదేశాగమన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కుడా పరిధిలోని మండల అభివృద్ధి పనుల గూర్చి చర్చించారు.

వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే దొంతి



నవతెలంగాణ-నెక్కొండ

మండలంలోని ముదిగొండకు చెందిన కాంగ్రెస్ నాయకుడు దూదిపాల రామచందర్ కుమార్తె శిరీష-తిరుపతేష్‌ల వివాహానికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బక్కి అశోక్, చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి, నాయకులు ఈదునూరి సాయికృష్ణ, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్‌రెడ్డి, ముదిగొండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనుముల శ్రీధర్ రెడ్డి వధూవరులను ఆశీర్వదించారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు

దేశాయిపేట పట్టణ ఆరోగ్య కేంద్రం తనిఖీ..



నవతెలంగాణ-వరంగల్/కాశిబుగ్గ

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సాంబశివరావు అన్నారు. దేశాయిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు గురువారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించాలని, సమాజ ఆరోగ్య నిర్మాణానికి పాటుపడాలని తెలిపారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది అటెండెన్స్ రిజిష్టర్‌లను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మోహన్‌సింగ్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.భరత్ కుమార్, సూపర్‌వైజర్ జన్ను కోర్నేల్, ఫార్మసిస్ట్ ఎస్.అనిల్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ రజియా, అకౌంటెంట్ స్వర్ణలత, కుమారస్వామి, బుచ్చయ్య జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ముగిసిన జోనల్ క్రీడలు

విజేతలకు బహుమతుల ప్రధానం

నవతెలంగాణ-రాయపర్తి



విజయం ఉత్సాహాన్ని ఇస్తే అపజయం వెలకట్టలేని అనుభవాన్ని ఇస్తుందని వరంగల్, హన్మకొండ డిసిఓలు అపర్ణ, ఉమా మహేశ్వరిలు అన్నారు. మండల కేంద్రం శివారు తెలంగాణ సాంఘిక సం క్షేమ బాలికల గురుకుల పాఠశాల కళా శాలలో బుధవారం 10వ జోనల్ క్రీడలు అట్టహాసంగా ముగిశాయి. నాలుగు రోజులపాటు కొనసాగిన క్రీడల్లో వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన రాయపర్తితో పాటు దుగ్గొండి, పర్వతగిరి, మడికొండ, పరకాల, ఎల్కతుర్తి, హసన్‌పర్తి, ధర్మసాగర్, వరంగల్ వెస్ట్ ఆత్మకూర్, మహబూబాబాద్, ఇనుగుర్తి, తొర్రూర్, నరసింహులపేట గురుకుల హాస్టళ్లకు చెందిన 1190 విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. అండర్ 14, 17, 19 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హ్యాండ్ బాల్, చదరంగం, క్యారం, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ క్రీడల్లో హోరాహోరీగా తలబడ్డారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈసందర్భంగా డీసీఓలు మాట్లాడుతూ ఆటలో గెలుపోటములు సర్వసాధారణమైనప్పటికీ ఓటమి జీవితంలో పొందే విజయాలకు పూల పాన్పు అవుతుందన్నారు. విద్యార్థినులు ప్రతి ఆటలో తమ ప్రతిభను కనబరిచారని ఉపోద్ఘాటించారు. గురుకుల హాస్టల్ నుండి అనేకమంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణిస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో గురుకులాలు ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ హబ్ గా మారుతాయని వ్యాఖ్యానించారు. విద్యార్థినిలు చేసిన నృత్యాలు కనువిందు చేశాయి. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరిత, ఇన్‌ఛార్జ్ సమ్మయ్య, గేమ్స్ కో-ఆర్డినేటర్ కళమ్మ, పీడీ ప్రభావతి, ఉపాధ్యాయులు సృజన, రమ్య సుధ, కల్పన, వేణు, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత

అడిషనల్ డీసీపీ రవి

పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి :

బాలల హక్కులను పరిరక్షించడం మనందరి బాధ్యత అని వరంగల్ అడిషనల్ డీసీపీ రవి అన్నారు. గురువారం హన్మకొండలోని పోలీస్ కమిషనరేట్‌లో ఈనెల 14-20 వరకు చైల్డ్ రైట్స్ అడ్వొకసీ ఫోరం ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలను అడిషనల్ డీసీపీ రవి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల స్నేహ జిల్లాగా హన్మకొండను మార్చేందుకు స్వచ్ఛంద సంస్థలు, విద్యావంతులందరూ ఐక్యంగా కృషి చేయాలన్నారు. పాన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పోలీసు శాఖ కూడా బాలల హక్కులను కాపాడేందుకు కృషి చేస్తుందన్నారు. సీసీఆర్‌బీ ఏసీపీ డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ సంస్థలతోపాటు స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. బాలల హక్కుల రక్షణలో భాగంగా వారిపట్ల సమాజం స్నేహంగా వ్యవహరించాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలన, లైంగిక దాడుల నుండి బాలలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై వుందన్నారు. ఈకార్యక్రమంలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ, ప్రాజెక్టు ఆఫీసర్ ఎర్ర శ్రీకాంత్, డాన్‌బాస్కో నవజీవన్ డైరెక్టర్ ఫాదర్ కోసి,



అసిస్టెంట్ డైరెక్టర్ పి. సంతోష్‌కుమార్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ ఛైర్‌పర్సన్ మండల పరశురాములు, కె.అనితారెడ్డి, పాలడుగుల సురేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారం రోజులు జరిగే వివిధ కార్యక్రమాల పోస్టర్‌ను అడిషనల్ డీసీపీ రవి ఆవిష్కరించారు.

మధ్యాహ్న భోజన పథకం నిధులను పెంచాలి



ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా అధ్యక్షులు చుక్క ప్రశాంత్

వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-పర్వతగిరి

మధ్యాహ్న భోజన పథకం నిధులను పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చుక్క ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పర్వతగిరి మండలంలోని ఎంఈఓ ఆఫీస్ ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదివేటటువంటి విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం నిధులను పెంచాలని వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం కావస్తున్నా ఇంతవరకు విద్యాశాఖామంత్రి లేకపోవడం జిల్లా, మండల స్థాయిలో విద్యాశాఖ అధికారుల పనితీరు మందగించి ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ముగాస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని, ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పట్టించుకోకుండా గాలికి వదిలేశారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే విద్యాశాఖామంత్రిని నియమించాలని అలాగే తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు మధ్యాహ్నం భోజనం పాఠశాలలోనే చేస్తున్నారని, వారికి మాత్రం మధ్యాహ్నం భోజనం నిధులను పెంచలేదన్నారు. తక్షణమే నిధులను పెంచి ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ గా డిమాండ్ చేస్తున్నామన్నారు. వసతి గృహాలకు మెస్ ఛార్జీలు పెంచిన విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునేటువంటి విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకానికి కూడా పెరిగిన ధరలకు అనుగుణంగా నిధులను పెంచి నాణ్యమైన భోజనాన్ని, అలాగే వసతులను కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో అశోక్, సురేష్, రత్నాకర్, దివాకర్, సాయి, మధు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని హరిప్రియకు రాష్ట్ర స్థాయి ద్వితీయ బహుమతి

హరిప్రియను అభినందించిన ప్రముఖ కవి అందెశ్రీ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య



నవతెలంగాణ- చెన్నారావుపేట

తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వచన కవితల పోటీలలో మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థి కల్లెపు హరిప్రియ ద్వితీయ బహుమతి సాధించింది. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కవి అందెశ్రీ, తెలంగాణ సాహిత్య నాటక అకాడమీ చైర్మన్ డాక్టర్ అలేఖ్య నగదు బహుమతి, సర్టిఫికెట్, జ్ఞాపికతో సత్కరించారు.అలాగే ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి వచన కవితల పోటీల్లో ద్వితీయ బహుమతి పొందిన కల్లెపు హరిప్రియను, గైడ్ టీచర్ కొండి మాధవిలను ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం తేజావత్ జయ, ఉపాధ్యాయులు సునీత, రాగి శశిధర్, సంతోష్ కుమార్, పిన్నింటి బాలాజీరావు, ఉదయ్ కుమార్, సీహెచ్.మాధవి, మొగిలి, సుందర్, పర్దెల్లి సతీష్‌కుమార్, రమాదేవి, వ్యాయామ ఉపాధ్యాయురాలు వీరగోని స్వప్నలు అభినందించారు.

బీసీ సమాజం పట్ల బీజేపీకి చిత్తశుద్ధి లేదు

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన కులగణనకు వ్యతిరేకంగా బీజేపీ కుట్రలు చేస్తుందని బీసీసంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. తాను చేపట్టిన కులగణన చైతన్య యాత్రలో భాగంగా గురువారం కాజీపేట ఫాతిమా జంక్షన్ లోని ఫంక్షన్ హాల్ లో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మీడియా తో మాట్లా కులగణన వ్యతిరేకిస్తున్న పార్టీలకు పుట్టగతులుండవని హెచ్చరించారు. బీజేపీకి బీసీ సమాజంపట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. సంక్షేమ పథకాలకు, సమగ్ర కులగణనకు ఎలాంటి సంబంధం లేదని ప్రజలు భయందోళనలు వీడాలన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుకే రాష్ట్రంలో సమగ్ర కులగణన జరుగుతుందని దీనివల్ల ఎవరికి నష్టం వాటిల్లబోదని తెలిపారు. కులగనన సేకరణకు వచ్చే ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తున్న వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

జాతీయ అధికార ప్రతినిధి తీగల ప్రదీప్ గౌడ్, ప్రొఫెసర్ కూరపాటి మాట్లాడుతూ ప్రభుత్వం కుల గణన పైన ఇంకా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుల్కచర్ల శ్రీనివాస్, దాడి మల్లయ్య యాదవ్, బచ్చు ఆనందం, బొనగాని యాదగిరిగౌడ్, ఏడునూరి రాజమౌళి, అసిస్టెంట్ ప్రొఫెసర్ చిర్రరాజు, అరేగంటి నాగరాజు, డాక్టర్ కూరపాటి రమేష్, సాయిని నరేందర్, తాడిశెట్టి క్రాంతికుమార్, చిప్ప వెంకటేశ్వర్లు, జనగాం శ్రీనివాస్, కాసగాని అశోక్, మడిశెట్టి నాగరాజు పటేల్, తుపాకుల రవి, బీసీ సంఘం మహిళ నాయకులు మాధం పద్మజ దేవి, సులోచన పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన కలిగి ఉండాలి

- డాక్టర్ సాయిని వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



మధుమేహ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి అని డాక్టర్ సాయిని వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సంవత్సరం కి ప్రపంచ మధుమేహ దినోత్సవం ఒక నినాదం 'డైబెట్స్ వెల్ బీయింగ్' దీనిపైనా ప్రజలను అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రజలకి స్క్రీనింగ్, కిడ్నీ పరీక్షలు, కంటి పరీక్షలు , దంత పరీక్షలు, వాక్సినేషన్‌పై అవగాహన డయాబెటిస్ డైట్ గురించి ప్రత్యేక కార్యక్రమం గురువారం కేర్ డయాబెటిస్ సెంటర్ లో నిర్వహించారు. ఈశిబిరంలో డాక్టర్ సాయినివెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజలందరూ మధుమేహ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని, వ్యాధిగ్రస్తులు కొన్ని జాగ్రత్తలతో సామాన్య జీవితాన్ని గడపవచ్చు అన్నారు. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన మెగా డయాబెటిస్ స్క్రీనింగ్, అవగాహనా శిబిరం ద్వారా సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 20 మందికి కొత్తగా మధుమేహం ఉన్నట్టు గుర్తించి 110 మంది మధుమేహం ఉన్నవారికి పరీక్షలు చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కేర్ డయాబెటిస్ సిబ్బంది ఫార్మా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు

మార్చిలోపు ఆర్‌ఓబీ పనులు పూర్తి : నాయిని

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ



అసంపూర్తిగా ఉన్న కాజీపేట రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులను మార్చి నెలలోపు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయినిరాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కాజీపేట ఆర్‌ఓబీ వద్ద నిర్మాణ పనులకు సంబంధించి వచ్చిన గడ్డర్లను హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఇతర అధికారులతో కలిసి ఎంపీ కావ్య, ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి పరిశీలించారు. ఆర్వోబి నిర్మాణానికి సంబంధించిన మ్యాపును ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ పరిశీలించి వాటి కి సంబంధించిన వివరాలను ఆర్ అండ్ బి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్వోబి నిర్మాణానికి సంబంధించిన వివరాలను సంబంధిత గుత్తేదారుతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ , ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఆగిపోయిన కాజీపేట ఆర్వోబి పనులకు జీవం పోశామని, మార్చినాటికి నిర్మాణ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఇందుకు సంబంధించిన నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క, జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల దృష్టికి తీసుకువెళ్లి నిధులు తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి ఈఈ సురేష్‌బాబు, తహసీల్దార్ భావ్‌సింగ్, స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు మున్సిపల్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-పరకాలటౌన్



పరకాల పట్టణంలోని శారదా విద్యాలయంలో గురు వారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారత దేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలను పురస్కరించుకొని పాఠశాలలోని విద్యార్థులే ఉపాధ్యాయులై స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించడం జరిగిందని పాఠశాల పాఠశాల ప్రిన్సిపాల్ మార్క సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులై ఆయా తరగతి గదులకు వెళ్లి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించడం జరిగింది. అనంతరం విద్యార్థులు మన సంస్కృతి, సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలు తెలియజేసేలా నృత్యాలు, వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు నైతిక విలువలు, ఉన్నత ప్రమాణాలతో అభ్యసించాలని, సమాజం పట్ల గౌరవం కలిగి ఉండాలని, విద్య ఒక్కటే సమాజంలో మనిషిని ఉన్నత స్థానంలో నిలబెడుతుందని ఆ దిశగా విద్యార్థులందరూ చదువుకోవాలని ప్రిన్సిపాల్ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజని,రజిని, నిరోషా, రజిత, నాగరాజు, తాజోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

షైన్ స్కూల్లో బాలల దినోత్సవం

నవతెలంగాణ-నయీంనగర్



షైన్ ప్రైమరీ స్కూల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ నుండి 5వ తరగతి పిల్లలు అటవీ, రవాణాపద్ధతులు, వైద్యులు,దుస్తులు, సంస్కృతి సాంప్రదాయాలు, పప్పెట్ షో, అధునాతన ఆంగ్లం, రోజువారీ జీవితంలో గణితం, గ్రామాలు వాటి ప్రాముఖ్యత , అంతరిక్ష కేంద్రం, మహిళా శక్తి, కాలుష్యం, హిమాలయాలు, గ్లోబల్ వార్మింగ్, మొదలైన విషయాల పైన వివరణ ఇచ్చారు, వారి వాక్చాతుర్యంతో వీక్షకులను అబ్బుర పరిచారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా పాల్గొన్న షైన్ పాఠశాల చైర్మన్ మూగల కుమార్‌యాదవ్ మాట్లాడుతూ పిల్లలతో ఇలాంటి కార్యక్రమాలు చేయించడం వల్లవారిలోని ఆలోచనశక్తి మెరుగవుతుందని, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు .దీనికి తోడ్పడిన విద్యార్థుల తల్లిదండ్రులను వారి సహాయ సహకారాలను కొనియాడారు. విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రాజేందర్, ప్రైమరీ స్కూల్ కరస్పాండెంట్ రమ, ప్రిన్సిపల్ సబిత మొదలగు వారు పాల్గొన్నారు.

గుడిలో హుండీ చోరీ

నవతెలంగాణ-ఆత్మకూరు

మండల కేంద్రంలోని పంచకూటశివాలయం లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై పరమేశ్వర్ కథనం ప్రకారం మండలం కేంద్రంలోని పంచకూట శివాలయంలో ఈనెల6,7,8 తేదీల్లో పునప్రతిష్ఠకార్యక్రమం నిర్వహించారు. ఆలయ పూజా అర్చకులు శివునికి నిత్యం పూజలు చేస్తున్నారు కార్యక్రమంలో ఉదయం పూజలు నిర్వహించినందుకు అర్చకులు గుడి తెరువుగా గుడిలో కానుకలు వేసిన హుండీ కనిపించలేదు. ఈ విషయాన్ని గుర్తించిన అర్చకులు ఆలయ కమిటీ చైర్మన్ వంగాల బుచ్చిరెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులంతా గుడిని పరిశీలించగా గుడిపక్కన నిర్మాణంలో ఉన్న బాత్ రూములో హుండి పగలగొట్టి కనిపించింది.అందులో సుమారు రూ.1లక్ష వరకు డబ్బులు ఉంటాయని తెలిపారు. గురువారం ఆలయ కమిటీ చైర్మన్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరమేశ్వర్ తెలిపారు.

బాలికలు సమాజంలో అఘాయిత్యాలను ఎదిరించాలి

జిల్లా సెషన్స్ జడ్జ్ సిహెచ్.రమేష్ బాబు

నవతెలంగాణ-సుబేదారి



బాలికలు నేటి సమాజం లో జరుగుతున్నఅఘాయిత్యాలను ఎదిరించాలని హన్మకొండ జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ,జిల్లా సెషన్స్ జడ్జ్ సిహెచ్.రమేష్‌బాబు అన్నారు. తెలంగాణ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం బాలలదినోత్సవం సందర్భంగా పాన్ ఇండియారెస్క్యూ, పునరావాస ప్రచారకార్యక్రమం 'బాలకార్మికుల నిర్మూలనకు ఒక అడుగు' అనే అంశంపై పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.నీరజరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమములో జిల్లా సెషన్స్ జడ్జ్ పిల్లలకు అవగాహన కల్పించారు. నేటి సమాజం లో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఏరకంగా ఎదిరించాలో విద్యార్థినులకు అర్థమయ్యేలా వివరించారు. పాఠశాలకు 10 కంప్యూటర్లు, 2 ప్రొజెక్టర్లు అంద చేస్తామని హామీ ఇచ్చారు. సెషన్స్ న్యాయమూర్తి క్షమదేశ్‌పాండే మాట్లాడుతూ విద్యార్థినులు జీవిత నిర్దేశాన్ని ఏర్పరచుకొని, దాని కొరకు కష్టపడి చదుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పబ్లిక్ ప్రా ప్రాసిక్యూటరు శ్రీకాంత్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి దాసరి మురళిధర్‌రెడ్డి, ఆర్‌ఎల్‌సి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు చైతన్యవంతం చేయాలి : కలెక్టర్ ప్రావీణ్య



నవతెలంగాణ-సుబేదారి

అర్హతకలిగిన వారిని ఓటర్లుగా నమోదు చేసుకునేలా చైతన్యవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో స్వీప్ ఆధ్వర్యంలో ఓటర్లను చైత న్యపర్చడం, భాగస్వా మ్యం చేయడంపై ముగ్గుల పోటీ లను నిర్వహించారు. ఈ పోటీలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, కళాశాలల విద్యార్థినీలు ఉత్సాహంగా పాల్గొని ఆకట్టుకునేలా ఓటు చైతన్యంపై ముగ్గులు వేశారు. విద్యార్థినులు ఓటరు చైతన్యంపై వేసిన ముగ్గులను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ముగ్గులతోపాటు వాటిచుట్టూ ఓటుహక్కు,దాని ప్రాముఖ్యతపై రాసినవివరాలను విద్యార్థినులను కలెక్టర్ అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినులు ఓటరు చైతన్యంపై ఆకట్టుకునేలా ముగ్గులను వేశారని అన్నారు. అందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు ఓటు ప్రాముఖ్యతను తల్లిదండ్రులు, బంధువులు, చుట్టుపక్కలవారికి తెలియజేయాలన్నారు.

ఓ టు హక్కు కలిగిన ఓటర్లు ఎన్నికలలో ఓటు వేసేవిధంగా చైతన్యం తీసుకురావాల న్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థినులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఓటరు చైతన్యంపై ఆకట్టుకునేలా ముగ్గులు వేసిన విద్యార్థినులకు కలెక్టర్ చే బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాస్ కుమార్, జడ్పీ సీఈవో విద్యాలత, ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, డిప్యూటీ తహసీల్దార్లు విఠలేశ్వర్, శ్యామ్ కుమార్, ఇతర అధికారులు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి : జీఎస్ఆర్

నవతెలంగాణ-శాయంపేట



విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని లక్ష్య సాధన కోసం కష్టపడి చదువుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృ హంలో గురువారం బాలల దినోత్సవం పురస్కరించు కొని స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు నిర్వ హించగా, ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జిఎస్ఆర్ పాల్గొ న్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి నెహ్రూ చి త్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ రజని అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అబ్దుల్ కలాం, జవహర్ లాల్ నెహ్రూ, మహాత్మాగాంధీ వంటి నేతలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు పట్టుదలతో చదివి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. ప్రతి విద్యార్థి ఐఏఎస్, ఐపీఎస్, శాస్త్రవేత్తలు, డాక్టర్లు, ఇంజనీర్ కావాలనే లక్ష్యాలను ఎంచుకొని ఇష్టపడి చదువుకొని లక్ష్యాలనుసాధించాలన్నారు. విద్యాసంస్థల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యా, వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. పాఠశాల ప్రహరీ నిర్మాణం ఎత్తు పెంచడానికి సహకరించాలని ప్రిన్సిపాల్ రజని ఎమ్మెల్యేకు విన్నవిం చుకోగా దానిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఆర్ అధినేత సంపత్‌రావు, ఎంఈఓ బిక్షపతి, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, పరకాల ఏఎంసి వైస్ చైర్మన్ మారపల్లి రవీందర్, మాజీ సర్పంచ్ అబ్బు ప్రకాష్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి చల్లా చక్రపాణి, నాయకులు చిందం రవి, నిమ్మల రమేష్, మారపల్లి కట్టయ్య, దుబాసి కష్ణమూర్తి, వైనాల కుమారస్వామి, ప్రపంచ రెడ్డి, మార్కండేయ, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఎమ్మెల్యే జిఎస్ఆర్ పాల్గొని ప్రారంభించారు. గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు మూడునెలలు గడుస్తున్నా వేతనాలు చెల్లించడం లేదని, తమను పర్మినెంట్ చేయాలని, ఎం జె పి పి, మైనార్టీ గురుకుల పాఠశాల తరహాలో కాంట్రాక్టు ఉపాధ్యాయులకు వేతనాలను పెంచాలని ఎమ్మెల్యేకు మెమోరాండం అందజేశారు.

అధికారులపై దాడులను పార్టీలకతీతంగా ఖండించాలి : ఎమ్మెల్యే నాయిని

నవతెలంగాణ-సుబేదారి



అధికారులపై దాడులను పార్టీలకతీతంగా ఖండించాలని వరంగల్ పశ్చి మ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌పై కొంతమంది రైతులపేరుతో జరిపిన దాడి, కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డిపై జరిగిన దాడిని హనుమకొండ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ పక్షాన తీవ్రంగా ఖండిస్తు కలెక్టరేట్ ఆవరణలో భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ దాడి ఘటనను సీఎం తీవ్రంగా పరిగణిస్తున్నారని ఘటనలో భాగస్వాములైన, ప్రోత్సహించిన వారిపై తప్పక కఠినచర్యలు ఉంటాయన్నారు. జరిగిన సంఘటనలను పార్టీలకు అతీతంగా ఖండించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ ప్రజా సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తున్న అధికారులను దూషించడం,బెదిరించడం సరియైందికాదన్నారు. ఉద్యోగులకు అనునిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు సంపూర్ణ స హాయ సహకారాలు అందిస్తూ భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతంకాకుండా చూస్తుందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్ మాట్లాడుతూ దోషులు ఎంతటి వారైనప్పటికీ చట్ట పరిధిలో శిక్ష విధించాలని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నమనేని జగన్మోహన్‌రావు మాట్లాడుతూ తెలంగాణలోని యావత్ ఉద్యోగలోకంపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు.

ఈ ధర్నాలో జిల్లా అధికారుల సంఘం అధ్యక్షులు ఆకవరం శ్రీనివాస్‌కుమార్, ట్రెస్సా అధ్యక్షులుభాస్కర్, తిరుపతిరెడ్డి, బైరీ సోమయ్య, పుల్లూరు వేణుగోపాల్, పనికెల రాజేష్,శ్యామ్ సుందర్,కత్తి రమేష్, రామునాయక్, సారంగపాణి, మోయిజ్, లక్ష్మీ ప్రసాద్, గెజిటెడ్ అధికారుల సంఘం నేతలు మురళీధర్ రెడ్డి, డాక్టర్ ప్రవీణ్ కుమార్,అన్వర్, చంద్ర శేఖర్ ,శ్రీనివాస్‌రెడ్డి, పాక శ్రీనివాస్, మాధవ రెడ్డి,గోపు రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూములను కబ్జా చేస్తే సహించేది లేదు : మాజీ ఎమ్మెల్యే రాజయ్య

నవతెలంగాణ-ధర్మసాగర్



అటవీశాఖ భూములను కబ్జాచేస్తే ఊరుకునేది లేదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. గురువారం మండలంలోని ముప్పారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో ధర్మసాగర్, వేలేరు, భీమదేవరపల్లి, ఎలుకతుర్తి మధ్య ఉన్న ఇనుపరాతిగుట్ట ఫారెస్ట్ భూమి దాదాపు 3950 ఎకరాల భూమి ఫారెస్ట్ ఆధీనంలో ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ నాయకులతో తన ముఖ్య అనుచరుడు నజీర్ సహకారంతో అధికారులు బెదిరించి, ఫారెస్ట్ భూములను కాజేస్తున్నారని దీనిని బీఆర్ఎస్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ అభివృద్ధి కార్యక్రమాలు కాదని అక్రమంగా ప్రభుత్వ భూములను ఆక్రమించే కార్యక్రమాలు చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే అధికారం పార్టీలో ఉండి అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రజల ఖనిజ సంపాదన దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ భూములను కాపాడమే తప్ప అక్రమాలకు పాల్పడలేదని గుర్తుచేశారు. 3950 ఎకరాల భూమిని ఫారెస్ట్ అధికారులు, కలెక్టర్‌లు రీసర్వే చేసి హద్దులు నాటించాలని, ప్రభుత్వ భూమిని కాపాడే బాధ్యత అధికారుల పై ఉందని స్పష్టం చేశారు. ఫారెస్ట్ భూములను భూబకాసురుల ఆక్రమణలకు గురైనట్లు తెలిస్తే బీఆర్ఎస్ ఊర్కోదని హెచ్చరించారు.

ఈ సమావేశంలో మాజీ సర్పంచుల పోరం అధ్యక్షులు కర్ర సోమిరెడ్డి,నాయకుడు లాల్ మహమ్మద్, మాజీ ఎంపీటీసీలు లక్క శ్రీనివాసు, విజయకుమార్, వేలేరు మండల కన్వీనర్ భూపతి రాజు, మాజీ సర్పంచ్‌లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-సుబేదారి



హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో హంటర్ రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. వైద్య శిబిరాన్నిజిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ ఉద్యోగుల కోసం మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమని, ఆసుపత్రి యాజమాన్యం వైద్య సేవలను అందించేందుకు ముందుకు రావడం పట్ల అభినందనలు తెలిపారు. వైద్య శిబిరాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ వివిధ కారణాల వల్ల ప్రపంచ వ్యాప్తంగా మధుమేహ బాధితుల సంఖ్య పెరుగుతూ ఉందని అన్నారు. మధుమేహానికి సంబంధించి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో లభించే మందులను మధుమేహ బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మెడికవర్ ఆసుపత్రి మెడికల్ విభాగం సూపరింటెండెంట్ నవీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉచిత వైద్య శిబిరాన్ని కలెక్టరేట్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి సంబంధించిన వైద్యులు వైద్య శిబిరానికి వచ్చిన ఉద్యోగులను పరీక్షించి మందులను అందజేశారు.ప్రత్యేక వైద్యుల ఆధ్వర్యంలో ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించి వైద్య సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవీ.గణేష్, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ గిరీష్‌లోయ, డాక్టర్ పూర్ణచంద్, డాక్టర్ శ్రవణ్ కుమార్, డాక్టర్ రత్న కార్తిక్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి వ్యాయామం తప్పనిసరి : రేవూరి

నవతెలంగాణ-పరకాల టౌన్



మనిషికి సంపాదన కంటే ఆరోగ్యం ముఖ్యమని, ప్రతి ఒక్కరికి వ్యాయామం తప్పనిసరి అని, ఆరోగ్యమే మహాబలం అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాకర్స్‌తో కలిసి ఎమ్మెల్యే మార్నింగ్ వాక్‌చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ ఒత్తిడికి గురవుతూ, మానసికంగా కుంగిపోవడం జరుగుతుందని దీనికి ప్రతి ఒక్కరూ యోగ, వ్యాయమాలు తప్పనిసరిగా చేయాలని దీనితో మానసిక ఉల్లాసం కలిగి మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. పలు సమస్యలను ఎమ్మెల్యే దష్టికి తీసుకురాగా వీలైనంత తొందరగా వాటిని పరిష్కరిష్కరిస్తామని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాభివద్ధి ధ్యేయంగా పనిచేయడం జరుగుతుందన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో కలెక్టర్, అధికారులపై జరిగిన దాడిని ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. దాడి వెనుక సూత్రధారులను, కుట్ర దారులను ఎంతటి వారినైనా ప్రభుత్వం వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నెహ్రూ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మోలుగూరి బిక్షపతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, పరకాల ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు ఎర్రబెల్లి భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు మడికొండ సంపత్, మార్క ఉమాదేవి రఘుపతి, ఒంటేరు సారయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల నాయకులు చందుపట్ల రఘుపతి రెడ్డి, ఈర్ల చిన్ని, ధూబాసి వెంకటస్వామి ,మంద నాగరాజు, లక్కం శంకర్ వసంత, బొమ్మకంటి చంద్రమౌళి, బొచ్చు భాస్కర్, బొచ్చు రవి, తిరుపతిరావు, కోమల, రజిని రవి, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

నవతెలంగాణ-ఎల్కతుర్తి



పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోబోయిన యువకుడిని పోలీసులు రక్షించాడు. గురువారం సాయంత్రం గుర్తు తెలియని యువకుడు ఇందిరానగర్ శివారులో పురుగుల మందు తాగబోతుండగా పక్కన గమనించిన వారు ఎస్సై కి సమాచారం అందజేశారు. వెంటనే స్పందించిన ఎస్సై గోదరి రాజకుమార్ సిబ్బంది బక్కయ్య, రాజులతో కలిసి వెళ్లి యువకుడిని కాపాడారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు ములుగు జిల్లా మల్లంపల్లి మండలం శాంతినగర్‌కు చెందిన గంట కిరణ్ (35) ఇంట్లో వ్యక్తిగత సమస్యలతో మనస్థాపంచెంది ఆత్మహత్య చేసుకోబోతుండగా కాపాడారు. స్థానిక ప్రజలు పోలీసులను అభినందించారు. ఎస్సై గోదరి రాజకుమార్, కానిస్టేబుల్ బక్కయ్య, రాజును సీఐ పులి రమేష్ ప్రత్యేకంగా అభినందించారు.

వయోవృద్ధుల కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



నవతెలంగాణ-సుబేదారి

వయో వృద్ధులకు సంబంధించిన కేసుల పరిష్కారానికి నిర్ణీత గడువు లోగా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో వయోవృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం పరిధిలో వచ్చిన కేసుల పరిష్కారం కోసం అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ వయోవృద్ధులకు సంబంధించిన కేసులను అధికారులు పరిష్కరించాలన్నారు. ట్రిబ్యునల్‌లో నమోదైన కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. కేసుల పరిష్కారంలో భాగంగా ఇరువురికి కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. వయోవృద్ధులకు సంబంధించిన కేసులను జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించి వాటి పరిష్కారానికి కషి చేయాలన్నారు. ఆర్డీవోల పరిధిలో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కె.నారాయణ, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, సూపరింటెండెంట్ లక్ష్మీకాంత్ రెడ్డి, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ రవికష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఝాన్సీ రాణి

నవతెలంగాణ-కమలాపూర్



కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా తౌటం ఝాన్సీరాణి బాధ్యతలు స్వీకరించారు. గురువారం మండలంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితురాలైన తౌటం ఝాన్సీ రాణి, పాలకవర్గం వ్యవ సాయ మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ కార్యదర్శి రాజు చేతుల మీదుగా బాధ్యతలు స్వీకరించారు. చైర్‌పర్సన్ తౌటం ఝాన్సీరాణితో పాటు వైస్‌చైర్మన్‌గా దేశిని ఐలయ్యగౌడ్, డైరెక్టర్లుగా గట్టు శ్రీధర్‌గౌడ్, సముద్రాల కృష్ణ, అక్కినపల్లి బిక్షపతి, వంటకాల అనిల్‌రెడ్డి, కిన్నెర కృష్ణమూర్తి, మిల్కూరి శ్రీనివాస్, ఎండి యాకోబ్ అలీ, కెత్తే విజయేందర్, నిగ్గుల లింగయ్య తదితరులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాణి మాట్లాడుతూ రైతులకు సేవ చేసే అవకాశాన్ని కల్పించిన నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ బాబు కు రాష్ట్ర రవాణా శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్‌గౌడ్ రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు , కాంగ్రెస్ శ్రేణులకు పాలకవర్గం తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. కమలాపూర్ మండలంలోని రైతులు పండించిన పంటలను విక్రయించడానికి దూరప్రాంతాలైన వరంగల్ జమ్మికుంట మార్కెట్లోకి వెళ్లకుండా ఇక్కడే అన్ని సౌకర్యాలు కల్పించుటకు కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు గుండపు చరన్ పటేల్ తౌటం రవీందర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆన్ కార్ అశోక్ జీ డాక్టర్ మౌటం కుమారస్వామి కంభంపాటి ప్రసాద్ వైనాల సాంబయ్య మసన చంద్రశేఖర్ గంధసిరి బిక్షపతి పుల్ల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీమంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు శోచనీయం

నవతెలంగాణ-సుబేదారి

ఐఎఎస్, ఐపిఎస్. అధికారులు తస్మాత్ జాగ్రత్త అని మాజీమంత్రి కేటిఆర్ వ్యాఖ్యలు చేయడం శోచనీయమని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ (ట్రెంగ)రాష్ట్ర అధ్యక్షులు కొండమల్ల రవి అన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జయశంకర్
ములుగు - భూపాలపల్లి
శుక్రవారం నవంబర్ 15, 2024

అభయ ఆంజనేయస్వామి విగ్రహానికి శంకుస్థాపన



నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

మండల కేంద్రంలోని క్రాస్ రోడ్ ప్రాంతంలో పోలీస్ స్టేషన్ సమీపాన గురువారం 45 ఫీట్ల భారీ ఆంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు కానుంది. మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు తన సొంత నిధులతో విగ్రహ నిర్మాణానికి పూను కున్నారు. కాగా ఆయన చేతుల మీదుగా పం డితులు భూమి పూజ చేసి శంకుస్థాపన గావిం చారు. విగ్రహం ఏర్పాటుతో గ్రామం సుభిక్షంగా ఉంటుందని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంతటి విజయ, గ్రామ పెద్దలు గడదాసు సు నీల్‌కుమార్, ఇరుస వడ్ల వెంకన్న, తాడూరి రఘు, కాకులమర్రి ప్రదీప్‌రావు, పెండ్యాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి



నవతెలంగాణ-గోవిందరావుపేట

మండల రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ దాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని పస్రా ఎస్ఐ అచ్చ కమలాకర్ అ న్నారు. గురువారం మండలంలోని పలు ధా న్యం కొనుగోలు కేంద్రాలను ఎస్ఐ కమలాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ కమ లాకర్ రైతులతో మాట్లాడుతూ ప్రస్తుత తరు ణంలో ఖరీఫ్ పంటలలో భాగంగా వరి కోతలు ప్రారంభమయ్యాయని అన్నారు. వడ్లను ధాన్యం కొ నుగోలు సెంటర్ లోనే అమ్మాలని, దళరులకు అమ్మి మొసపోవద్దని తెలిపారు. మండలం లోని కో టగడ్డ, గాంధీనగర్, గోవిందరావుపేట గ్రామాలకు వెళ్లి ప్రజలకు పలు సూచనలు చేశారు. మండలంలోని రైతులకు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు.

విద్యనభ్యసించి ఉన్నతంగా ఎదగాలి

- జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర

నవతెలంగాణ - ములుగు

గ్రంథాలయం చదువుల నిలయం అని, పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని, ప్రతి ఒక్కరు చదువుకొని ఉన్నతంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని లైబ్రరీ కార్యాలయంలో 57వ జాతీయ గ్రంథాలయం దినోత్సవం సందర్భంగా వారం రోజులపాటు జరిగే వివిధ కార్యక్రమాలను జిల్లా గ్రంథాలయ అధ్యక్షులు బానోతు రవిచంద్రతో కలిసి జ్యోతి ప్రజలను చేసి ప్రారంభించారు. జవహర్‌లాల్‌నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అవకాశాలను వృధా చేసుకోకుండా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. తాను కూడా చిన్న పల్లెటూరు గ్రామంలో పేదకుటుంబంలో జన్మించి పుస్తకపఠనం ద్వారా నేడు ఈ స్థాయికి చేరుకున్నానని గుర్తు చేశారు. తాను చదువుకుంటున్న సమయంలో విద్యా బోధన చేయడానికి ఇలాంటి అవకాశాలు లభించకపోయేదని, నేడు ఉన్నత చదువులు చదువుకోవడానికి అనేక



అవకాశాలు మెరుగుపడ్డాయని అన్నారు. జిల్లా కేంద్రంలో నూతన గ్రంథాలయ భవనం నూతన హంగులతో నిర్మించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అలివేలు, ప్రజా ప్రతినిధులు, గ్రంథాలయ సిబ్బంది, యువత తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో గొప్పగా ఎదగాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో గొప్పగా ఎదగాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సరస్వతీ, భారత ప్రథమ ప్రధానమంత్రి నెహ్రూ, గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలవేసి గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించి ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధపడే యువత ప్రతిరోజు గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తకపఠనం ద్వారా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. నూతన గ్రంథాలయ భవన నిర్మాణంను 60రోజులలో పూర్తి చేసి పాఠకులకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. భవనంలో కావల్సిన ఫర్నిచర్, పుస్తకాలు, పుస్తక ర్యాకులు సమకూరుస్తానని హామీ ఇచ్చారు.



విద్యార్థులు తరగతి పుస్తకాలనే కాకుండా జాతీయ నాయకుల పుస్తకాలు వ్యక్తిత్వ వికాసం పుస్తకాలు తదితరవి చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవలని అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి, గ్రంథాలయ కార్యదర్శి శ్రీలత, జిల్లా పరీక్షల విభాగపు అసిస్టెంట్ కార్యదర్శి శనిగిరపు భద్రయ్య, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, గ్రంథాలయ సిబ్బంది చంద్ర మౌళి, శారద, రవీందర్, రాకేష్, మంజుల, ఉపాధ్యాయులు కల్పన, సర్వోత్తమ్ రెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె జయరాంరెడ్డి

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

విద్యార్థులు చదువే ఆయుధంగా సమయపాలన పాటిస్తూ ఉన్నతంగా ఎదగాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయరాం రెడ్డి అన్నారు. గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో బాలల దినోత్సవం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్జి హాజరై మాట్లాడుతూ కష్టపడి జీవించడం అలవాటు చేసుకున్న వారు జీవితంలో ఎన్నటికీ ఓడిపోరని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య, డీపీఆర్ఓ శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ రాజారత్నం, పాఠశాల ఉపాధ్యాయురాలు లత, జిల్లా అడ్వొకేట్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కూనూరి సురేష్ కుమార్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ మెరుగు రవీందర్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ప్రియాంక, న్యాయవాదులు మంగళంపల్లి రాజ్‌కుమార్, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.



'ప్రోబెల్ 'లో స్వయం పరిపాలన దినోత్సవం

నవతెలంగాణ-గణపురం

గణపురం మండల కేంద్రంలోని ప్రోబెల్ మోడల్ హైస్కూల్లో బుధవారం జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వ్యక్తిత్వ, క్విజ్ కాంపిటీషన్ పాటలు, డ్యాన్స్ లాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి ఉపాధ్యాయ బాధ్యతలు తెలుసుకున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పి శివశంకర్ డైరెక్టర్ ఎల్ యాదగిరి, జగన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



'ఎంజీఎం'లో ఘనంగా బాలల దినోత్సవం

నవతెలంగాణ-గణపురం

మండలంలోని చెల్పూర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధి ఎంజీఎం హైస్కూల్లో జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవంను గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు క్రీడా పోటీలతో పాటు నృత్యాలు, నాటికలు, పాటలు, వ్యక్తిత్వ వికాసం, వ్యాసరచన పోటీలు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ గ్యాదంగి సతీష్ మాట్లాడుతూ... సరైన విద్యతో మాత్రమే మెరుగైన సమాజాన్ని నిర్మించవచ్చు అన్నారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు గ్యాదంగి తిరుపతి, గ్యాదంగి రమాదేవి, సిలువేరు శ్రీనివాస్, ప్రిన్సిపల్ మధుకర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



'శ్రీ నారాయణ'లో బాలల దినోత్సవం

నవతెలంగాణ-గణపురం

గణపురం మండల కేంద్రంలోని శ్రీ నారాయణ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు. గురువారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులుగా చేసి స్వపరిపాలన దినోత్సవం వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులుగా చేసి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ భానుచందర్, ప్రిన్సిపాల్ స్రవంతి, డైరెక్టర్ రవి పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ

నవతెలంగాణ-గణపురం

ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం గణపురం మండలం చెల్పూర్‌లో రూ.1.56 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య భవనాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు వైద్య సేవలకు వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లకుండా నాణ్యమైన, మెరుగైన కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చిన్నట్లు తెలిపారు. ప్రమాదాలకు గురైన వ్యక్తులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు ట్రామా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన



ఆస్పత్రికి మూడో అంతస్తు నిర్మాణానికి రూ.7 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఆస్పత్రికి ప్రహరీ, వైద్యులు స్థానికంగా నివాసం ఉండేందుకు నివాస గృహం నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఆసుపత్రి రహదారి కంటే ఎత్తు తక్కువ వుండటం వల్ల వర్షాకాలంలో నీళ్ళు నిలుస్తున్నాయని మేరువు చేయనున్నట్లు తెలిపారు. మరుగుదొడ్లు, తదితర మౌలిక సౌకర్యాలు కల్పనకు రూ.1.50 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. ప్రధాన ఆస్పత్రిలో సిటీ స్కానింగ్, ఎంఆర్ఐ సేవలు అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. 203 అదనపు వైద్య పోస్టులు జిలాకు మంజూరు చేపించినట్లు తెలిపారు. నర్సింగ్ భవనం, ఆయుర్వేద వైద్య సేవలకు వైద్యుల పోస్టు కూడా మంజూరు చేసి ఆయుర్వేద వైద్య సేవలను కూడా అందుబాటులోకి తీసుకురానుట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న ఆస్పత్రి భవనాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రధాన ఆసుపత్రిలో డ్రగ్ స్టోర్ నిర్మించామని అన్నారు. ఇమ్యూనైజేషన్ కార్యక్రమాలను నూరు శాతం పూర్తి చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఆశాల సేవలు ముఖ్యమైనవి అన్నారు. ఏఎన్సీ రిజిస్ట్రేషన్స్ సకాలంలో చేస్తూ గర్భిణులకు వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మధుసూదన్, ఆస్పత్రి వైద్యురాలు స్వాతి, సింగిల్ విండో చైర్మన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పాల్గొన్నారు.

'ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక కౌంటర్లు పెట్టాలి'

నవతెలంగాణ-గణపురం

కొనుగోలు కేంద్రాల్లో సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక కౌంటర్లు పెట్టాలని కొనుగోలు చేసిన ధాన్యపు బస్తాలకు గుర్తింపునకు అనువుగా రంగుతో గుర్తులు పెట్టాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి గణపురం మండలం జంగుపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి తూకపు పరికరాన్ని పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. తాలు లేకుండా తేమశాతం 17 ఉంటే తక్షణమే కొనుగోలు చేసి ట్రక్ షీట్ జారీ చేయాలని ఇన్‌చార్జీలను ఆదేశించారు. కొనుగోలు జరిగిన ధాన్యం మిల్లులకు రవాణా చేయాల్సిన బాధ్యత సెంటర్ ఇన్‌చార్జిలదేనని అన్నారు. తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు చేసిన తర్వాత ధాన్యం తడిచినా, మిల్లర్లు మోసం చేసిన అందుకు బాధ్యత కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలే అ



వుతారని పేర్కొన్నారు. రవాణాలో జాప్యం చేస్తే ట్రాన్స్‌పోర్ట్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నిసంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. సహకార అధికారి వాలియానాయక్, ఎంపీడీవో భాస్కర్, డైరెక్టర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకత, బాధ్యత పాటించాలి

జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

మల్హర్‌రావు : ధాన్యం కొనుగోలులో కేంద్రాల ఇన్‌ఛార్జులు పారదర్శకత, బాధ్యత పాటించాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. గు



రువారం ఆయన మండలంలోని కొండంపేట, కాటారం మండలంలోని శంకరంపల్లి గ్రామాలల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలకు, రైతులకు విక్రయాల్లో పాటించాల్సి జాగ్రత్తలు, పలు సూచనలు చేశారు. రైతులు ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎదుర్కొనే సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. కొలతలు, నాణ్యత ప్రమాణాలను పాటించడం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పంట ఉత్పత్తులు సురక్షితంగా విక్రయించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలను అధికారుల సందర్శన



నవతెలంగాణ-మహాదేవపూర్

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ సూచనలతో హైదరాబాద్ క్షేత్ర ఆర్కిటెక్ట్ కన్సల్టెంట్ వారు గురువారం మం డలంలో పర్యటించారు. ముందుగా స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశమయ్యారు. పాఠశాలల అభివృద్ధికి మౌలిక వసతుల ఏర్పాట్లు, అదనపు తరగతి గదుల నిర్మాణం, మరమ్మతులు, తాగునీరు, మూత్రశాలల ఏర్పాటు చేసేందుకు, మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దేందుకు మండల జిల్లా పరిషత్ హైస్కూల్ కాంప్లెక్స్ పరిధి 6పాఠశాలల వారీగా ప్రధానోపా ధ్యాయులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల ఆవరణను కన్సల్టెంట్ బృందం సందర్శించింది. కావాలసిన సదుపాయాలపై నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని తెలిపారు. వారివెంట మహాదేవపూర్ మండల పంచాయతీరాజ్ ఈఈ ఏవెంక టేశ్వర్లు, డీఈ సాయిలు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మహాదేవపూర్ జీపీ కార్యదర్శి కల్పన తదితరులు ఉన్నారు.

నష్టపరిహారం ఇచ్చి ఉపాధి కల్పించాలి

- మంత్రికి తాడిచెర్ల భూ నిర్వాసితుల వినతి



నవతెలంగాణ-మల్హర్‌రావు

తాడిచర్ల బ్లాక్-1 ఓసీపీ డేంజర్ జోన్‌లో ఉన్న భూములకు,ఇండ్లకు నష్టప రిహారం ఇచ్చి ఉపాధి కల్పించాలని భూ నిర్వాసితులు కోరారు. గురువారం రెవె న్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి భూనిర్వాసితుల హక్కుల సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేసి వారు మాట్లాడారు. టీఎస్ జెన్కో సంస్థ బొగ్గు తవ్వకాల కోసం భూమిని సేకరిస్తున్న సమయంలో తాడిచర్ల కాపురం గ్రామాల్లోని కొంతమంది రైతులకు నష్టపరిహారం అందించడం లేదని ఆరోపించారు. కాపురం శివారులోని 488, 489, 574, 586 సర్వేనెంబర్‌లో భూనష్టపరిహారం అందక ఎస్సీ,ఎస్టీ,బీసీ రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. బొగ్గు తవ్వకాల కోసం భూసేకరణ చేస్తున్న సమయంలో నాటి జెన్కో అధికారులు తాడిచర్ల గ్రామంలోని నిరుద్యోగులకు జెన్కోలో మూడు వేల ఉద్యో గాలు కల్పిస్తామని హామీ ఇచ్చి నేటి వరకు అమలు చేయలేదన్నారు. ఇండ్లను తీ సుకుంటామని ఆర్థిక, సామా జిక సర్వే నిర్వహించి ఇండ్లకు నెంబర్లు వేసి ఏడు సంవత్సరాలు గడుస్తున్నా తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓసిపి బ్లా స్టింగ్ దెబ్బలతో ఇండ్లు, ఇంటి గోడలు బీటలుగా మారుతున్నాయన్నారు. డేం జర్ జోన్లో ఉన్న ఇండ్లను, భూములను సేకరించి పరిహారం, ప్యాకేజీ ఇచ్చి సురక్షిత ప్రాంతానికి తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితుల పోరాట సాధన కమిటీ అధ్యక్షుడు కేశారపు రవి, సభ్యులు తాండ్ర సంతోష్, ఇందరపు ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్ష నిర్వహణలో అధికారుల పాత్ర అత్యంత కీలకం

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

నవతెలంగాణ-భూపాలపల్లి

గ్రూప్-3 పరీక్ష నిర్వహణలో రూట్ అధికారులు చీఫ్ సూపరింటెండెంట్‌ల విధులు అత్యంత కీలకమని, పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. గురువారం స్థానిక ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాలులో డిపార్ట్మెంటల్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, రూటు అధికారులు, ఐడెంటిఫికేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి కలెక్టర్ మాట్లాడారు. విధులు కేటాయించిన సిబ్బంది ఉదయం 7 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. జిల్లాలో 17 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, 3707మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. 17మంది పరిశీలకులు, 34 మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, ఒక బయోమెట్రిక్ సూపర్ వైజర్ ను నియమించినట్లు తెలిపారు. కాన్ఫిడెన్షియల్ మెటీరియల్ పోలీస్ ఎస్కార్ట్ భద్రతతో తరలించడానికి క్లోస్డ్ వాహనాలు ఏర్పాటుతోపాటు ఐదుగురు రూటు అధికారులను నియమించామని తెలిపారు. 14మంది దివ్యాంగ అభ్యర్థులు పరీక్ష కు హాజరవుతున్నారని, వారికి స్క్రైబ్స్‌ను నియమించనున్నట్లు తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో జరుగనున్న ఈ పరీక్ష 17న ఉదయం, మధ్యాహ్నం ఉంటుందని, ఉదయం 8.30 గంటల నుండి, మధ్యాహ్నం 2 గంటల నుండి అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. ఉదయం 9.30, మధ్యాహ్నం 2.30 గంటల సమయం తదుపరి అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరని తెలిపారు. 18వ తేదీ పరీక్షకు 8.30 నుండి పరీక్షా కేంద్రాలకు అనుమతి ఉంటుందని, 9.30 తదుపరి గేట్లు మూసివేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాలకు నిరంతర విద్యుత్, మంచినీరు అత్యవసర వైద్య కేంద్రం, తదితర ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎ పరీక్షా కేంద్రం ముందర, చీఫ్ సూపరింటెండెంట్ హాలు, పరీక్షా కేంద్రంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఏర్పాట్లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో పరీక్ష జిల్లా నోడల్ అధికారి విజయలక్ష్మి, పోలీస్ నోడల్ అధికారి కిషన్, కో ఆర్డినేటర్ వెంకన్న, ఆర్టిఓ సంధాని, విద్యుత్తు శాఖ ఎస్ ఈ మల్చూర్, ఆర్డీఓ మంగిలాల్, కలెక్టరేట్ ఏఓ ఖాజా మోహినుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.





18న సీపీఐ(ఎం) మండల మహాసభ

- పలు ప్రజాపోరాటాలకు రూపకల్పన

మండల కార్యదర్శి కుమ్మరి శ్రీను

నవతెలంగాణ-వెంకటాపురం

ఈ నెల 18న సీపీఐ(ఎం) మండల మహాసభ నిర్వహిస్తున్నట్టు సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కుమ్మరి శ్రీను తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కుమ్మరి శ్రీను మాట్లాడారు. ఈ మహాసభలో మండలంలోని ప్రధాన సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. పంచాయితీల్లో సమస్యలు గుర్తించి ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు రూపకల్పన రచించనున్నట్లు తెలిపారు. మహాసభకు మండలంలోని సీపీఐ(ఎం) కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గ్యానం వాసు, మండల నాయకులు చారి, రాంబాబు, తోట నాగేశ్వరరావు, ప్రసాద్, రాములు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

నవతెలంగాణ -తాడ్వాయి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (సమ్మక్క- సారక్క తాడ్వాయి)లో ప్రిన్సిపాల్ రాంపాక అవిలయ్య అధ్యక్షతన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగతోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ రాంపాక అవిలయ్య మాట్లాడుతూ అన్ని సమస్యలకు చదువే పరిష్కారం అన్నారు. ప్రపంచంలో చదువుకంటే విలువైన సంపద ఏది లేదని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నతస్థితికి చేరుకోవాలని అన్నారు. రాబోయే వార్షిక పరీక్షల కొరకు ఇప్పటినుండే ప్రణాళిక సిద్ధం చేసుకొని చదవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కొమ్మాల సంధ్య, లైబ్రేరియన్ కమలాదేవి, కిషన్, బిక్షం, రాజ్ కుమార్, రాజు, అశోక్, శ్రీలత, నాగరాజు, హరికృష్ణ, దివ్య, తదితరులు పాల్గొన్నారు.



డీఎన్ఆర్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

- మండల విద్యాధికారి గొంది దివాకర్

నవతెలంగాణ-గోవిందరావుపేట

డీఎస్ఆర్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి గొంది దివాకర్ అన్నారు. గురువారం ప్రాజెక్టునగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో డీఎస్ఆర్ ట్రస్ట్ సహకారంతో అందించిన నోటు పుస్తకాలను సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు అర్షం రాజు, గుల్లపెల్లి సాంబయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆయన అందజేసి మాట్లాడారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకావాలని, ట్రస్ట్ నోటు పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మరియు పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాల అందజేసిన డీఎస్ఆర్ ట్రస్ట్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జెజ్జరి అరుణ్ కుమార్, యాసం విక్రమ్ రాజ్, రజియా భాయ్ పాల్గొన్నారు.

జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ స్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవం

భారత మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ గొంది దివాకర్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గోవిందరావుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొనగా ప్రత్యేక ఆహ్వానితులుగా సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు అర్షం రాజు, గుల్లపెల్లి సాంబయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ దివాకర్ మాట్లాడుతూ భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సేవలు కొనియాడారు. అనంతరం కమ్యూనిటీ మొబిలైజింగ్ కోఆర్డినేటర్ సాంబయ్య మాట్లాడుతూ ప్రతినెల 3వవ శనివారం నిర్వహించాల్సిన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం బాలల దినోత్సవం సందర్భంగా ఈరోజుకు మార్చడం జరిగిందని అన్నారు. అనంతరం సమగ్ర శిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ అర్షం రాజు మాట్లాడుతూ అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల వివరాలను అప్డేట్ చేయాలని అన్నారు. ప్రతి విద్యార్థికి అపార్ ఐడి అనేది ఆవశ్యకం అన్నారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘురాం, ఇరు పాఠశాలల ఉపాధ్యాయులు, కంప్యూటర్ ఆపరేటర్ విష్ణు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ భరత్, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల ఉపాధ్యాయులు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
4
జనగామ
శుక్రవారం | నవంబర్ 16, 2024 | www.navatelangana.com

ప్రత్యేక ఓటరు నమోదు, సవరణల ప్రచారం

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా గురువారం ప్రత్యేక సారాంశ పునశ్చరణ-2025కి సంబంధించిన కీలక నవీకరణలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024 ఫిబ్రవరిలో 7,48,570 మంది ఓటర్లతో పోలిస్తే ప్రస్తుతం జిల్లాలో7,57,982 ఓటర్లు ఉన్నారని, ఇటీవల 9, 10వ తేదీల్లో నిర్వహించిన ఓటరు నమోదు క్యాంపెయిన్ లో జిల్లాలోని పోలింగ్ కేంద్రాలకు 505 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. ఈ నెల 23, 24వ తేదీల్లోనూ ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపెయిన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు, సవరణలు చేసుకోవచ్చని, బీఎల్ఓలు ఆయా పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని, జిల్లా ప్రజలందరూ ఈ క్యాంపెయిన్‌ను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బి.భాస్కర్, సీపీఐ(ఎం) ప్రతినిధి జోగుప్రకాష్, బీఆర్ఎస్ ప్రతినిధి రావెల రవి, టీడీపీ ప్రతినిధి అజయ్ కుమార్, బీజేపీ ప్రతినిధి ఏ.విజయ్ భాస్కర్, బీఎస్పీ ప్రతినిధి ఎం.చంద్రశేఖర్, ఎన్నికల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తీగారంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-జఫర్‌గఢ్



మండలంలోని తీగారం గ్రామంలో ఎస్‌డిఎఫ్ నిధులతో మంజూరైన రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను గురువారం కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు జిట్టబోయిన గోపాల్, మాజీ ఉపసర్పంచ్ కలకోట అనిల్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. మా గ్రామ అంతర్గత రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి,ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కాంగ్రెస్ నాయకురాలు సింగపురం ఇందిరాలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొచ్చి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివద్ధి పరుస్తామని అన్నారు. అందరి సహకారంతో గ్రామాన్ని మరింత అభివద్ధి పరుస్తాను అని భీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో పిఆర్ఏఈ రామకృష్ణ , వర్క్ఇన్‌స్పెక్టర్, నాగరాజు, నాయకులు గోనె యాదగిరి, అనుముల సంపత్, కడారి బిక్షపతి, కలకోట స్వామి, సముద్రాల కుమారస్వామి, సింగపురం అశోక్, నర్సింగోజు రాఘవులు, ఎన్నకూస గట్టుమల్లు, తౌటి శంకరయ్య, తౌటి హరి, అన్నారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధుల ఉచిత చికిత్స శిబిరం

నవతెలంగాణ-నర్మెట్ట

ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని రైతులు ఉపయోగించుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.నేహ అన్నారు. గురువారం నర్మెట్ట మండలం కన్నెబోయినగూడెంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించి పాడి పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి రైతులకు ఉచితంగా మందులు పంపిణీచేశారు. ఈ శిబిరంలో జనగామ ఏరియా గోపాలమిత్ర సూపర్‌వైజర్ జైపాల్‌రెడ్డి, సుభద్ర గోపాల మిత్రులు శ్రీనివాస్ ,నగేష్, పశుమిత్ర శ్రీలత, స్థానిక విజయ డైరీ అధ్యక్షులు నాగభూషణం, పాడి రైతులు పాల్గొన్నారు.

ఆలయంలో ఎంపిడిఓ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-లింగాలఘణపురం



మండలంలోని జీడికల్ శ్రీరామ చంద్రస్వామి దేవాలయంలో ఎంపీడీవో జలంధర్‌రెడ్డి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 14 నుండి 27 వరకు జరగబోయే బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించి బ్రహ్మోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించడానికి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో చిందం వంశీ, మార్కెట్ కమిటీ చైర్మన్ నీల మోహన్, సూపరింటెండెంట్ సీతారాం నాయుడు, పంచాయతీ కార్యదర్శి వి.మల్లేష్‌లు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలి

నవతెలంగాణ-పాలకుర్తి



ప్రమాదాలను నివారించేందుకు రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే ఆరబెట్టుకోవాలని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్ రెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీనారాయణపురం తొర్రూరు పాలకుర్తి గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఎస్సై దూలం పవన్‌కుమార్‌తో కలిసి సందర్శించి తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రోడ్లపై రైతులు ధాన్యాన్ని ఆరబెట్టడంతో నిత్యం ప్రమాదాలు జరిగి వాహనదారులకు గాయాలు అవుతున్నాయని తెలిపారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టుకోవాలని సూచించారు. ధాన్యాన్ని మధ్య దళారులకు విక్రయించరాదని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లోని మద్దతు ధర ఉంటుందని తెలిపారు. సన్న రకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు 500 బోనస్‌ను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ

నవతెలంగాణ-బచ్చన్నపేట

వాస్విక్ ఫౌండేషన్ ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఆరవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో బచ్చన్నపేట మండలం లోని గవర్నమెంట్ ఆసుపత్రిలో పండ్లు, బ్రేడ్లు,పండ్ల రసాలు పంపిణీ చేయడం జరిగింది. బండ నాగారం, రామచంద్రపురం ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకి స్వీట్స్, ఫ్రూట్ జ్యూసెస్, కేక్ కట్ చేశారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి



నవతెలంగాణ-పాలకుర్తి

విద్యార్థిని విద్యార్థులు విద్యలో రాణించి నెహ్రూ స్ఫూర్తితో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎస్సై దూలం పవన్ కుమార్ ఆకాంక్షించారు. భారత తొలి ప్రధాని చాచా నెహ్రూ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు, మండలంలోని ప్రగతి విద్యాలయం, సిద్ధార్థ విద్యాలయం, సుధా టెక్నో స్కూల్, కార్మెల్ కాన్వెంట్ స్కూల్, చెన్నూరు లో గల మహర్షి విద్యాలయంలో విద్యార్థిని, విద్యార్థులు సాస్కృతిక ప్రదర్శనలను ప్రదర్శించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని చెన్నూరు ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్సై విద్యార్థిని, విద్యార్థులకు ప్లేట్లను పంపిణీ చేశారు. వావిలాలలో జరిగిన బాలల దినోత్సవం లో ఎంఈఓ పోతుగంటి నర్సయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పుస్కూరి రమేష్ రావు, ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాల్ వీరమనేని వెంకటేశ్వరరావు, జక్కుల రవీందర్, రాపాక విజయ్, లిజ్ బెత్, లయన్స్ క్లబ్ చైర్మన్ కారుపోతుల వేణు, కారుపోతుల వెంకటయ్యగౌడ్, విఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మొలుగురి యాకన్న గౌడ్, మాజీ ఎంపీపీ కారుపోతుల శీనువాస్‌గౌడ్,జంపాల అంజయ్య, పుష్కూర్ కళింగరావు, పుస్కూరు రాజు, మాదాస్ హరీష్, నారగోని ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి గూడెంలో వ్యక్తి దారుణ హత్య


నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్



రఘునాథపల్లి మండలం ఎల్లారెడ్డి గూడెంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి గూడెం గ్రామానికి చెందిన గంపల పర్శరాములు(36) అనే వ్యక్తి, అదే గ్రామానికి చెందిన పర్వత మహేందర్ చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. మతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదులో తనభర్త మేస్త్రీ పని చేసేవాడని, కుటుంబ అవసరాల కోసం మహేందర్ ఇల్లు నిర్మిస్తున్న సమయంలో డబ్బులు అప్పుగా తీసుకున్నాడని, ఇరువురికి ఆర్థిక లావాదేవీల కారణమేనని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

అఖండ జ్యోతికి ముస్తాబైన సోమేశ్వరాలయం

నవతెలంగాణ-పాలకుర్తి



దక్షిణ భారతదేశంలో అఖండ జ్యోతిని నిర్వహిస్తున్న మూడవ దేవస్థానంపాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీన ర్సింహస్వామి ఆలయం. శుక్రవారం నిర్వహించే అఖండ జ్యోతికి హరిహరుల క్షేత్రం శ్రీ సోమేశ్వర ఆలయం ముస్తాబైంది. అఖండజ్యోతిగిరి ప్రదక్షిణకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. తిరువన్నామలై అరుణాచలం స్ఫూర్తితో పాలకుర్తి ఆలయగుట్టపై 8అడుగుల వెడల్పు, 4 అడుగుల ఎత్తులో ప్రత్యేంగా రూపొందిచిన భారీప్రమిదలో ఒక టున్ను నువ్వుల నూనె, ఆవు నెయ్యి, 2 క్వింటాళ్ల ముద్ద కర్పూరంతో అఖండజ్యోతిని వెలిగిస్తారు. వేలాదిగా తరలివచ్చే భక్తుల సమక్షంలో లక్ష దీపోత్సవం, గిరి ప్రదక్షిణ, అఖండ జ్యోతిని 5 గంటలకు ప్రారంభం అవుతుంది. అఖండజ్యోతిని ప్రారంభించడానికి ముఖ్యఅతిథిగా ఉత్తరకాశి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామి స్థితప్రజ్ఞానంద సరస్వతి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి హాజరు కానున్నారు. ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసు బందో బస్తు, అవసరమైన ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ సల్వాది మోహన్ బాబు గురువారం తెలిపారు.

గ్రూప్-3 పరీక్షలు సమన్వయంతో నిర్వహించాలి : కలెక్టర్



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జిల్లాలో గ్రూప్-3 పరీక్ష నిర్వహణకు అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కాన్ఫరెన్స్‌హాల్లో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ తో కలిసి గ్రూప్-3 పరీక్ష నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్‌లు, పరిశీలకులు, రూట్ అధికారులు, సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17, 18వ తేదీల్లో గ్రూప్-3 పరీక్ష జరగనున్నందున జిల్లాలో మొత్తం 5446 మంది అభ్యర్థులు 16 పరీక్ష కేంద్రాల్లో హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్‌లను అనుమతించరాదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు.

పరీక్ష సమయానికి 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పరీక్ష కేంద్రాలను సంబంధిత అధికారులు సందర్శించి, మౌలిక వసతులను కల్పించాలని, నిరంతర విద్యుత్ సరఫరా జరగాలని, వంద శాతం బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని, ఆర్టీసీబస్సులు సరిపడా అందుబాటులో ఉంచాలని, పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ కిట్, సిబ్బంది అందుబాటులో ఉండాలని, పరీక్ష హాల్లో పరీక్ష ప్రారంభానికి ముందే ఓఎంఆర్ షీట్ పై ఇన్విజిలేటర్ లు పరీక్షార్థులకు అవగాహన కల్పించాలన్నారు.

పరీక్షపేపర్లు, ఓఎంఆర్ షీట్ లను పకడ్బందీగా, తగిన జాగ్రత్తచర్యల నడుమ తప్పనిసరిగా ఎస్కార్ట్‌తో ప్రభుత్వ వాహనాల్లో పరీక్ష కేంద్రాలకు తరలించాలని, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా సమయానుకూలంగా వ్యవహరించాలని, ఇన్విజిలేటర్‌లతో సమావేశాలను ఏర్పాటు చేయాలని, సెంటర్‌లలో సీసీకెమెరాల పని తీరును సరిచూసుకోవాలని, అభ్యర్థుల హాల్‌టికెట్, గుర్తింపు పొందిన ప్రభుత్వ ఐడీకార్డును సరిగా చూడాలని, నిర్దేశించిన రూట్‌లలో మాత్రమే ప్రశ్న పత్రాలను, ఓఎంఆర్ పత్రాలను తీసుకొని వెళ్ళాలని, పోలీసు బందోబస్తు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు జిల్లాకు వచ్చిన గ్రూప్-3 పరీక్ష ఓఎంఆర్ పత్రాలను కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో సీల్ వేసి పకడ్బందీగా పోలీసు బందోబస్తుతో, సీసీ కెమెరాల పర్యవేక్షణలో అత్యంత జాగ్రత్తగా భద్రపరిచారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీఓలు గోపిరాం, వెంకన్న, ఏసీపీ పార్థసారథి, డిపార్ట్మెంటల్ అధికారులు, డీఈఓ రాము, విద్యుత్ ఎస్ఈ వేణుమాధవ్, పోలీసు శాఖ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, అధికారులపై దాడిచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-జనగామ



లికలెక్టర్, అధికారులమీద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం అని నిందితులను కఠినంగా శిక్షించాలి అని టీజీఈజెఏసి జనగామ జిల్లా చైర్మెన్ ఖాజా షరీఫ్ డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లాలో జరిగిన సంఘటనకు నిరసనగా తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్రశాఖ పిలుపుమేరకు గురువారం జనగామ జిల్లా కలెక్టర్ సముదాయం ఎదుట భోజనవిరామంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం టీజీఈజెఏసి ఆధ్వర్యంలో ఆయా ఉద్యోగ సంఘాల నాయకులు నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఏవో కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖాజా షరీఫ్ తో పాటు ఆయా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ విధినిర్వహణలో భాగంగా గ్రామ సభకు హాజరైన కలెక్టర్ ,రెవెన్యూ అధికారులపై భౌతికదాడులకు పాల్పడడం హేయమైన చర్య అని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి చర్య ప్రజాస్వామ్యంలో వాటికి స్థానం లేదన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే అవకాశాన్ని అయినా ఉపయోగించుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆదేశాలను అమలు చేసేవారిపైన ఈ రకమైన దాడులు చేయడం సరైంది కాదన్నారు. అధికారులను భయభ్రాం తులకు గురిచేయడాన్ని తీవ్రంగా పరిగణించాలని, నిందితులపైన కఠినమైన చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో పునరావృత్తం కాకుండా కఠిన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణలో ఉన్న ఉద్యోగుల పట్ల కొన్ని చోట్ల దూషించడం ,అమర్యాద గా ప్రవర్తించడం జరుగుతున్నాయని ,సర్వేకు సహకరించేలా ప్రభుత్వం విస్తత ప్రచారం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ఆయా ఉద్యోగసంఘాల నాయకులు సెక్రటరీ జనరల్ కొర్నేలియస్, కో చైర్మెన్ చంద్రశేఖర్ రావు, అదనపు సెక్రెటరీ జనరల్ మహిపాల్ రెడ్డి, ఆర్టీఓ వెంకన్న, టీఎన్జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెల శ్రీనివాస్, రెవెన్యూ సర్వీసెస్ జిల్లా కోశాధికారి శ్రీనివాస్, నాయకులు రాజా నర్సయ్య, సంపత్, హఫీజ్, చందర్, నాగార్జున, విష్ణు, స్టెల్లా, అరుణ, పవన్, శ్రీధర్, నూరుద్దీన్ , మధు, శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు పరుశురాము, శ్రీకాంత్, జయాలు తదితర పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక బీజేపీ పాలనలో దేశం వినాశనం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి
- రఘునాథపల్లి మండల కార్యదర్శిగా మహేందర్



నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

ప్రజావ్యతిరేక బీజేపీ పాలనలో దేశం వినాశనమైందని, పదేండ్లుగా అభివృద్ధికి నిరోధకంగా మారిందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి విమర్శించారు. సీపీఐ(ఎం) రఘునాథపల్లి మండల 8వ మహాసభ గురువారం మండల కేంద్రంలో సీతారాంఏచూరినగర్‌లో జరిగింది. ఈ మహాసభకు అధ్యక్షవర్గంగా మైలారపు వెంకటేశ్వర్లు వ్యవహరించారు. తొలుత మహాసభల ప్రారంభ సూచికంగా పార్టీ సీనియర్ నాయకులు భీమగోని చంద్రయ్య సీపీఐ(ఎం) పతాకఆవిష్కరణ చేశారు. అనంతరం జరిగిన మహాసభకు ముఖ్యఅతిథిగా సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి పాల్గొని మాట్లాడుతూ నూటికి యాభైశాతం వ్యవసాయ రంగంపై ఆధారపడి రైతులు జీవిస్తున్నారని, పంటకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని, రైతుల ఆత్మహత్యలు ఎక్కువయ్యాయని ఆరోపించారు. పండించిన పంటను కొనే దిక్కు లేదని, పురుగుల మందు ధరలు అమాంతం పెరిగి పోయాయని, మద్దతు ధర అందని దుస్థితిలో రైతన్న ఉన్నారన్నారు. దేశం, రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసే కుయుక్తులు పన్నుతున్నారని ధ్వజమెత్తారు.

దేశంలో ఆకలిచావులు పెరిగిపోతున్నాయని 12కోట్ల మంది నిరుద్యోగులుగా ఉన్నారని, ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం ఉద్రేకపూరిత ప్రసంగాలు చేస్తుందని విమర్శించారు. కులాల, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తోందన్నారు. సీపీఐ (ఎం) పార్టీగా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి, వెనుకబడిన తరగతుల సమగ్ర సమాచారాన్ని సేకరించి, వారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ప్రధాని మోడీ దేశసంపదను అంబానీ, అదానివంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ ప్రజాసమస్యలను విస్మరించారని ధ్వజమెత్తారు. బీజేపీ ఎన్నికల్లో ఇచ్చిన ఏఒక్క వాగ్దానాన్ని అమలు చేయకుండా మతంపేరుతో దుర్మార్గపుపాలన, దళితులపై దాడులు, క్రైస్తవులకు, మైనార్టీలకు, మహిళలకు రక్షణ లేదన్నారు. ఆరుగ్యారెంటీల పేరిట ప్రజల్లో భ్రమ కల్పించి, కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని అన్నారు. రైతు రుణమాఫీ ఏ షరతులు లేకుండా ఇవ్వాలన్నారు. రైతు భరోసా నిధులు విడుదల చేయాలని, ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చినహామీలుఅమలు చేయాలని డిమాండ్ చేశారు. బూర్జువా వ్యవస్థలో స్వేచ్ఛా, శక్తి ఉండదని, గ్రామాల్లో సీపీఐ(ఎం)పార్టీ, ప్రజా సంఘాల బలోపేతానికి కార్యకర్తలు కంకణబద్ధులు కావాలని రాబోయే కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ, స్థానిక సమస్యలపై ఉద్యమించాలనిపిలుపునిచ్చారు. ఈ సభలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి ఆహల్య,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల కార్యదర్శిగా మహేందర్

మహాసభల్లో రాబోయే మూడేండ్ల భవిష్యత్తు కార్యాచరణ తీర్మానాలు అందించారు. మండలంలోని శ్రీమన్నారాయణపురం గ్రామానికి చెందిన కామ్రేడ్ గంగాపురం మహేందర్ రెండోసారి సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా పొదల నాగరాజు, కాసాని పుల్లయ్య, మైలారపు వెంకటేశ్వర్లు, కడారి ఐలయ్య, మంచాల మల్లేష్, భీమగోని చంద్రయ్య, గొలనుకొండ చక్రపాణి, నామాల యాదగిరి, పొదల లవ కుమార్, శాగ యాదగిరి, ఇంజ వెంకటస్వామి, వంగ సత్తిరెడ్డి, వారాల రాజు ఎన్నికయ్యారు.

గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో వాటర్ బాటిల్స్ పంపిణీ

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా గురువారం జనగామ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆదేశాల మేరకు 250 వాటర్ బాటిల్స్ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శి పోరిక అనసూయ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనగామ, హన్మకొండ డిటిడిఓ ప్రేమకళ మాట్లాడుతూ విద్యార్థులకు వాటర్ బాటిల్స్ అందుబాటులో లేకపోవడం వల్ల నీరు సరిగా తీసుకోకపోవడం వల్ల అనేక చర్మ వ్యాధులకు గురవుతున్నారని దీంతో దాతలు ముందుకు వచ్చి రూ.10వేల విలువైనటువంటి వాటర్ బాటిల్స్ ని 250 మంది విద్యార్థులకు అందించడం శుభసూచకమన్నారు.

ఈ కార్యక్రమంలో జనగామ జైలర్ పోరిక కృష్ణకాంత్,హెచ్‌ఎం జె. లచ్చిరాం, స్టాఫ్ సెక్రటరీ బి. వాసు, ఉపాధ్యాయులు రతన్ సింగ్, బి. జయరాం,సరోజన, స్వరూప, స్వాతి, రాములు, రాజయ్య, సారయ్య, పరమేశ్వర్, ఉపేందర్, హెచ్ ఓ డబ్ల్యు హరిచంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-బచ్చన్నపేట

మండల కేంద్రంలోని వాణి హై స్కూల్ బచ్చన్నపేట లో గురువారము రోజున బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయ నాయకుల, స్వతంత్ర్య సమర యోధుల , వివిధ వేషధారణలు పలువురిని ఆకర్షించాయి.అలాగే సాంస్కతిక కార్యక్రమాలు విద్యార్థులచే ప్రదర్శించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కరుని సుమలత బహుమతులను ప్రధానము చేయడం జరిగింది. ఈ కార్యక్రమములో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శ్రీలత, శ్వేత, మౌనిక, శ్రీనివాస్, వాణి, భవానీ, స్వాతి, హైమావతి, పద్మ, కపిల్ దేవ్, తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ ఘనపూర్ : మండలంలోని తాటికొండ గ్రామం ఉన్నత పాఠశాలలో స్వయల పరిపాలన దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల దినోత్సవాన్ని పురష్కరించుకొని విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి విద్యాబోధన అందించారు. ప్రధానోపాధ్యాయులుగా భానుప్రియ, ఇతర విద్యార్థులు సబ్జెక్ట్ టీచర్లుగా వ్యవహరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు కౌడ రాజేందర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు రుద్ర, లింగమూర్తి, రంజిత్, శ్రీనివాస్, గిరెడ్డి ప్రమోద్ రెడ్డి సల్లావుద్దీన్, రవీందర్, మురళి, వీరబ్రహ్మం, కవమ్మ, రవి, తదితరులు పాల్గొన్నారు. చిల్పూర్ మండలం రాజవరం ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మారేపల్లి శ్యాం కుమార్ రెడ్డి, బత్తిని సూర్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. చిన్నారుల సాంస్కతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేపట్టాలి

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



ప్రతి రైతు పండించిన పత్తిని సిసిఐ కొనుగోలు చేయాలని, అదేవిధంగా ప్రైవేటు వ్యాపారస్తులు కూడా మద్దతు ధరకు కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ అదనపు కలెక్టర్ కలెక్టర్‌కు బిసి యువజన సంఘం, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిర్రా వీరస్వామి, బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం అధ్యక్షులు పండుగ హరీష్ ముదిరాజ్ మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పత్తిని కొనుగోలు చేయకుండా కుంటిసాకులతో, తేమపేరుతో రంగు మారిందని సిసిఐ అధికారులు చెప్తున్నారని, దీనితో దిక్కుతోచని స్థితిలో రైతులు పత్తిని ప్రైవేటు వ్యాపారస్తులకు అమ్ముతున్నారని, దానితో ప్రైవేట్ వ్యాపారస్తులు ఇదే అదునుగా చూసుకొని మార్కెట్లో 7000 దాకా ధర ఉంటే మిల్లులలో మాత్రం 6000 నుండి 6200కు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. 2శాతం కమిషన్ , అన్లోడింగ్ చార్జీల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారని, దీంతో రైతులు నిండా మునుగుతున్నారన్నారు.

కాటన్ మిల్లుల యజమానులందరూ సిండికేట్ అయ్యి రైతులను దోచుకుంటున్నారని, సీసీఐ అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రతి రైతు తెచ్చిన పత్తిని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని, రైతులు పత్తి పండించిన పంటకు కూళ్ళు కూడా రావట్లేదన్నారు. పెట్టుబడి దేవుడెరుగు, ఇప్పటికైనా సీసీఐ అధికారులు స్పందించి మార్కెట్ తెచ్చిన ప్రతి రైతు వద్ద పత్తిని కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో, మారబోయిన శ్రీనివాస్, దడిగా మహేష్, కామెడీ రమేష్, జెనేష్, నకీర్త శ్రీను, బోళ్ళ రాజు కుమార్, పిట్టల రజినీ, నిలసొంబ రాజు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జీడికల్ ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



జిల్లాలోని లింగాలఘనపురం మండలంలోని జీడికల్ గ్రామంలో గల శ్రీ వీరాచల జీడికంటి శ్రీ రామ చంద్రస్వామి దేవస్థానంలో స్వామి వారి బ్రహ్మోత్సవం నేపథ్యంలో తిరుక్కళ్యాణ మహోత్సవం ఈ నెల 14 నుంచి 27 వరకు నిర్వహిస్తున్నందున ఆలయ కార్యనిర్వహణాధికారి వంశీ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ను కలెక్టర్ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, జీడికల్ బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉప్పలమ్మ ఆలయ ఈఓ రాములు, మాజీ చైర్మన్ నర్సింహులు ఉన్నారు.

స్టెనో/ టైపిస్ట్ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జిల్లా కోర్టులో స్టెనో టైపిస్ట్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ పేర్కొంది. జిల్లా కోర్టులో జనరల్ కేటగిరీలో స్టెనోకం టైపిస్టు పోస్టు ఒకటి ఉన్నట్లు తెలిపారు. ఈ పోస్టుకు అర్హతలుగా డిగ్రీ ఆర్ట్స్ లేక సైన్స్ లేక కామర్స్ లేక లా చేసి ఉండాలన్నారు. 2024 సెప్టెంబరు ఒకటవ తేదీ నాటికి 34 సంవత్సరంల లోపు వయసు కలిగి ఉండాలని, అదేవిధంగా సాంకేతిక విద్యార్హతలుగా షార్ట్ హ్యాండ్ లో, టైపు రైటింగ్ లో ను, దాంతో పాటుగా కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా కోర్టు వెబ్సైట్ను పరిశీలించాలని, దరఖాస్తులు అందించేందుకు ఈనెల 20వ తేదీ ఆఖరి గడువుగా పేర్కొంటూ దరఖాస్తులు త్వరితగతిన పోస్ట్ ద్వారా గాని కొరియర్ ద్వారా గాని చైర్మన్, డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, న్యాయ సేవా సదన్, జిల్లా కోర్టు, జనగామ. చిరునామాతో అందించాలన్నారు.

కీచక టీచర్‌పై కేసు నమోదు చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మబిక్షం



నవతెలంగాణ-నర్మెట్ట

నర్మెట్ట మండల కేంద్రములోని మోడల్ స్కూల్ లో ఒక టీచర్ కరుణాకర్ విద్యా బుద్ధులు నేర్పించాల్సింది పోయి విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మబిక్షం మోడల్ స్కూల్‌ను సందర్శించి సంఘటన పై విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసు కున్నారు. అనంతరం ధర్మబిక్షం మాట్లాడుతూ కరుణాకర్ అనే టీచర్ ఇన్‌స్టాగ్రాం, వాట్సప్‌లో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడన్నారు. తరగతి గదిలోను విద్యార్థినులతో చెడుగా మాట్లాడుతూ ప్రవర్తన చేస్తున్నాడన్నారు. నెల రోజులుగా ఇదే విధంగా ప్రవర్తిస్తున్నా విద్యాశాఖ అధికారులు సరైన పర్యవేక్షణ చేయలేదని అన్నారు. మోడల్ స్కూల్ సిబ్బంది సమస్యను బయటకు రాకుండా కరుణాకర్‌ను వెనుకేసుకు వస్తున్నారని అన్నారు. పోలీసులు విచారణ జరిపి టీచర్ పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. అంతేకాకుండా టీచర్‌ను తన ఉద్యోగం నుండి పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. సమాజంలో ఆడపిల్లలపై వేధింపులు లేకుండా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో ఆడపిల్లలు అనేక వేధింపులకు గురవుతున్నారన్నారు.జిల్లావిద్యాశాఖ అధికారులు సంఘటన స్థలంలో విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు కృష్ణ, అఖిల, తరుణ్, వీరన్న , రిషి, దీప్తి, అక్షయ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయంలో నెహ్రూ జయంతి

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా కార్యాలయంలో డిసిసి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు చెంచరపు బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం పండిట్ జవహార్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రంగాల కళ్యాణి మల్లారెడ్డి విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ రాజమౌళి, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గాదెపాకరామచందర్, నర్మెట్ట మండల అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, తరిగొప్పుల మండల ప్రెసిడెంట్ యాద గిరి, పిఏసిఎస్ డైరెక్టర్ వంగాళ మల్లారెడ్డి, డిసిసి జాయింట్ సెక్రెటరీ గొలుసుల దుర్గేష్, ఏఎంసి డైరెక్టర్ బొట్ల నరసింహారావు, మైనారిటీ ప్రెసిడెంట్ ఇస్మాయిల్, వికలాంగుల సంఘం అధ్యక్షుడు మేకల సమ్మయ్య, పట్టణ వార్డు అధ్యక్షులు మోట జనార్దన్, సంజీవరెడ్డి, గంగుల మల్లారెడ్డి, ఉపేందర్, విజయ్ కుమార్, కడారి ప్రవీణ్, స్టాలిన్, ఆజాం, మల్లోజు గిరి, నోముల రాజు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

5

మహబూబాబాద్

శుక్రవారం నవంబర్ 15, 2024 www.navatelangana.com



విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్

నవతెలంగాణ-మహబూబాబాద్

విద్యుత్ వినియోగంలో ప్రమాదాల నివారణలో అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్ అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో (ఆర్తి గార్డెన్స్) లో టీఎస్ ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ పంపిణీ సంస్థ మహబూబాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రమాదాల నివారణ, పొదుపు పై సదస్సు కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం నిరుపేదల కోసం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ప్రతి పేద కుటుంబానికి అందిస్తుందని, అంతే కాకుండా విద్యుత్‌ని ప్రజలు తమ అవసరాలకు అనుగుణంగా వినియోగించాలని, పొదుపుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ నరేష్, జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మైనార్టీ జిల్లా నాయకులు, వార్డ్ కౌన్సిలర్లు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

ధాన్యం కొనుగోలు లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి



నవతెలంగాణ-గార్ల:

జిల్లా వ్యాప్తంగా వరి పంటల కోతలు మొదలయ్యాయని వరి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి.శ్రీనివాస్, మండల కార్యదర్శి అలువాల సత్యవతిలు డిమాండ్ చేశారు. స్థానిక మంగపతిరావు భవనంలో ఇమ్మడి గోవింద్ అధ్యక్షతన గురువారం జరిగిన మండల కమిటీ సమావేశంలో వారిలో మాట్లాడుతూ రైతుల పంటలు కొనుగోలు చేసేందుకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచాలని, గోనె సంచులు అధిక సంఖ్యలో తెప్పించి, కాంటా పెట్టిన ధాన్యాన్ని తరలించడానికి రవాణా సౌకర్యంకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మాఫి చేసిన రెండు లక్షల లోపు రుణా మాఫీ ఇంకా పూర్తి స్థాయిలో అమలు కాలేదని ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం చేపడుతున్న కులగణనపై ప్రజలలో అయోమయం నెలకొందని, ప్రజల అపోహలను తొలగించడానికి సర్వేపై ప్రభుత్వం స్పష్టతను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల16, 17 తేదీలలో డోర్నకల్ పట్టణంలో జరిగే సీపీఐ(ఎం) జిల్లా 3వ మహాసభల సందర్భంగా 16న ప్రదర్శన, బిషప్ అజరయ్య ఫంక్షన్ హాల్ లో జరిగే ప్రారంభ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈసమావేశంలో మండల నాయకులు కె.ఈశ్వర్ లింగం, వీపీవెంకటేశ్వర్లు, ఎం.నాగమణి, బి.ఉపేందర్‌రెడ్డి, సీహెచ్ ఎల్లయ్య, టి.రమా, బి.లోకేశ్వర్‌రావు, కై.బాబు తదితరులు ఉన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్



నవతెలంగాణ-మరిపెడ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సీపీఐ(ఎం) మహబూబాబాద్ జిల్లా మూడవ మహాసభలు ఈనెల 16, 17 తేదీలలో డోర్నకల్ పట్టణం యందు జరగబోతున్నాయని, ఈ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) మరిపెడ మండలం కార్యదర్శి గుండగాని మధుసూదన్ అన్నారు. గురువారం మరిపెడ మండల కేంద్రంలోని స్థానిక టీటీడీ కళ్యాణ మండపం ఆవరణంలో జరిగిన మండల సమావేశంలో మధుసూదన్ మాట్లాడారు. ఈమహాసభల ముఖ్య ఉద్దేశం గత మహాసభ నుండి ఈమహాసభ వరకు పార్టీ తీసుకున్న కర్తవ్యాల మీద చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలను నిర్మించుకోవడం కోసం మహాసభలో నిర్ణయిస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాల వల్ల దేశం రాష్ట్రం అప్పుల్లోకి వెళ్లిపోయిందని ఆయన ఆరోపించారు. ఈమహాసభల్లో ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించి ఆ సమస్యలకు పరిష్కారం పోరాట రూపాన్ని ఎంచుకొని ఈపోరాటంలోప్రజల్ని, కార్మికుల్ని పాల్గొనే విధంగా చేయడమే పార్టీ ముఖ్య ఉద్దేశమని ఆయన వివరించారు. ఈకార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు బాణాల రాజన్న, కందాల రమేష్, కొండ ఉప్పలయ్య, బోడపట్ల రాజశేఖర్, దొంతు మమత తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం)మండల కార్యదర్శిగా కోటయ్య ఎన్నిక

నవతెలంగాణ-కురవి



సీపీఐ(ఎం)కురవి మండల కార్యదర్శిగా బలపాల గ్రామానికి చెందిన మలేడి కోటయ్య రెండవసారి తిరిగి ఎన్నికయ్యారు. బుధవారం రాజోలు గ్రామంలో జరిగిన సీపీఐ(ఎం) కురవి మండల ఎనిమిదవ మహాసభలో నూతన కమిటీని 13 మందితో ఎన్నుకున్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆకుల రాజు, శెట్టి వెంకన్నల సమక్షంలో కోటయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ సభ్యులుగా నల్లపు సుధాకర్, పిట్టల వెంకన్న, నాలం వెంకన్న, రాయల మనోహర్, కడియం సత్యం, జక్కుల మల్లయ్య, పోతుగంటి మల్లయ్య, కట్ల కృష్ణయ్య, తగరం తిరుపతి, మాలోతు కిషన్, కొమ్ము మంజులను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా మలేడి కోటయ్య మాట్లాడుతూ మండలంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలను నిర్వహిస్తామని, రాబోయే కాలంలో పార్టీని మరింత పటిష్టం చేసి ముందుకు తీసుకెళ్తామని ప్రకటించారు.

రోడ్డు వెడల్పుతో ఉపాధి కోల్పోనున్న చిరు వ్యాపారులు

100 ఫీట్ల రోడ్డును 60 ఫీట్లకుతగ్గించాలి

నవతెలంగాణ-కేసముద్రంరూరల్:

కేసముద్రం అంబేద్కర్ సెంటర్ నుండి విలేజ్ దర్గా వరకు నూతనంగా సెంటర్ లైట్ నిర్మిస్తున్న సందర్భంగా విస్తరిస్తున్న 100 ఫీట్ల రోడ్డు వెడల్పుతో చిరు వ్యాపారులు ఉపాధి కోల్పోతారని సీపీఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్‌లు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని భారత కమ్యూనిస్టు పార్టీ (ధర్మన్న భవన్) కార్యాలయంలో సీపీఐ ఆర్గనైజింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా చొప్పరి శేఖర్, మంద భాస్కర్‌లు మాట్లాడుతూ కేసముద్రం మండల కేంద్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న కేంద్రం అయినప్పటికీ దశాబ్దాల కాలం నుంచి రోడ్డు పక్కన చిరు వ్యాపారులు తమ జీవనాధారం, కుటుంబాన్ని పోషించుకోవడం కోసం అనేక పాట్లు పడుతూ చిరు వ్యాపారాలు చేస్తూ కొనసాగిస్తున్నారు. అదేవిధంగా రోడ్డును ఆనుకొని ఉన్నటువంటి ఇల్లు కూడా ఈవిధానం వల్ల ధ్వంసం అయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చిరు వ్యాపారులు వాళ్ళ బతుకులు రోడ్డున పడే అవకాశం ఉందని అన్నారు. ఇది దృష్టిలో పెట్టుకొని పునరాలోచించి 100 ఫీట్ల రోడ్డు నుంచి 60 ఫీట్ల రోడ్డుకు తగ్గించాలని భారత కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో దాసరి లింగస్వామి, మడత నారాయణ, ఎస్‌కే.ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధియే ప్రభుత్వ ధ్యేయం..

మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి

నవతెలంగాణ- తొర్రూర్ రూరల్



మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి ప్రజా ప్రభుత్వ ధ్యేయమని తొర్రూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాన్ల తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని గోపలగిరి గ్రామంలో పెద్ద చెరువు కుంటలో మత్స్య కారుల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గంగర బోయిన సుధాకర్, సెక్రటరీ పులుగుజ్జ మహేష్‌ల ఆధ్వర్యంలో చేప పిల్లలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా చేప పిల్లలను పంపిణీ చేసినట్లు, చేపల ఉత్పత్తి గణనీయంగా పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షులు యాకయ్య, చర్లపాలెం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఎక్కటి నాగిరెడ్డి, గోపాలగిరి గ్రామ శాఖ అధ్యక్షుడు చింతకుంట్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విలువలను కాపాడిన నెహ్రూ

బాలల దినోత్సవం సభలో ప్రభుత్వ విప్, డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్

పాఠశాలలో కంప్యూటర్, సైన్స్‌ల్యాబ్‌లు ప్రారంభం

నవతెలంగాణ-మరిపెడ

భారత దేశంలో ప్రజాస్వామ్య లౌకిక విలువల కోసం కృషి చేసిన నాయకులు మాజీ ప్రధాని పండితు జవహార్ లాల్ నెహ్రూ అని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రామచంద్ర నాయక్ అన్నారు. గురువారం మరిపెడ మండల కేంద్రంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సైన్స్‌ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్‌లను ప్రారంభించారు. అనంతరం రామచంద్రనాయక్ మాట్లాడుతూ రాజ్యాంగ మౌళిక సూత్రాలకు అనుగుణంగా పరిపాలన కొనసాగించిన మహనీయులు స్వర్గీయ నెహ్రూ అని కొనియాడారు. నేటి విద్యార్థులు రేపటి పౌరులుగా తీర్చిదిద్ద కలగాలని, మహనీయుల ఆశయాల బాటలో మీరంతా కొనసాగాలని పిలుపునిచ్చారు. అంతేగాక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని గుర్తు చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ డీఎస్సీ ప్రకటించి 11 వేల మంది ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఒంటికొమ్ము యుగంధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు తాజోద్దీన్, పాఠశాల ప్రిన్సిపాల్ అత్తర్ పాషా, వైస్ ప్రిన్సిపాల్ జానకి రాములు, ఉపాధ్యాయులు మనిత కుమారి, నాగరాజు, కరుణాకర్, కృష్ణప్రసాద్, సంధ్యారాణి, డాక్టర్ రంజిత్ కుమార్, భానుచంద్రిక, నాగార్జున, ప్రవీణ్, నాగేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.



రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి..

తరుగు పేరుమీద రైతులను మోసం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదు మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్

నవతెలంగాణ- తొర్రూర్ రూరల్/ నెల్లికుదురు

తరుగు పేరు మీద రైతులను మోసం చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. గురువారం మండలంలోని కాచికల్ రామన్నగూడెం గ్రామాలలో ఐకెపి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతును రాజుగా చేయడమే తెలంగాణ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే రైతులు ధాన్యం కొనుగోలు చేసి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని తెలిపారు. రైతును ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, రైతుల బాగు కోసం నిరంతరం కృషి చేసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులెవరూ దళారులను నమ్మి మోసపోవద్దనిసూచించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు ఈకార్యక్రమంలో తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాన్ల తిరుపతిరెడ్డి, నెల్లికుదురు పీఏసీఎస్ చైర్మన్ కాసం లక్ష్మీచంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ కోడిచింతల రాజు, మండల వ్యవసాయ అధికారి యాస్మిన్, ఏపీఎం వరదయ్య, పీఏసీఎస్-సీఈవో బండారు యాదగిరి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపెల్లి ప్రభాకర్ గౌడ్, కాసం లక్ష్మారెడ్డి, పెరుమాండ్ల మురళి, పీర్నాక సుధాకర్, బండి శ్రీనివాస్ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.





చిన్ననాగారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ఇనుగుర్తి:

దళారులకు ధాన్యం అమ్మి నష్టపోవద్దని ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు చేయాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని చిన్ననాగారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గింజను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకున్నదని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అన్నారు. అక్టోబర్ 31న కోతకు సిద్ధం.. కొనుగోలు ఆలస్యం..! అనే వార్త 'నవ తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన వార్త కథనానికి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మా గ్రామంలో స్వయంగా ఎమ్మెల్యే ప్రారంభించారని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో బాలరాజు, ఏవో మహేందర్, ఏఈఓ భాస్కర్, ఏపీఎం వరదయ్య, పంచాయతీ కార్యదర్శి వేద రాజేశ్వర్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కూరెల్లి సతీష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు తుమ్మనపల్లి సతీష్, నాయకులు బైరు అశోక్ గౌడ్, ఒర్రె కవిత, కొయ్యండి యాకాంతం, దాసరి ప్రకాష్, రావుల మల్లేశం, వెంకన్న, ఐకెపి సిబ్బంది జిల్లా, మండల నాయకులు, వివిధ గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా మరోసారి నర్సిరెడ్డిని గెలిపించుకుందాం



టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

నవతెలంగాణ-నెల్లికుదురు

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో, విద్యారంగ అభివృద్ధిలో నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ నియోజ కవర్గ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కృషి ఎంతో ఉందని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అన్నారు. . గురువారం నెల్లికుదురు మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమాలలో భాగంగా పలు ఉన్నత పాఠశాలలో ప్రచారకార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మునిగలవీడులో ఏర్పాటుచేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ అలుగు బెల్లి నర్సిరెడ్డి చట్ట సభల్లో ఉపాధ్యాయ ప్రతి నిధిగా ఉంటూ ఉపాధ్యాయుల బదిలీలు , పదో న్నతులు కావడంలో ముఖ్యపాత్ర వహించారని, అదేవిధంగా కేజీబీవీ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, గురుకుల పాఠశాలలో నెలకొన్న పలు సమస్యల పట్ల స్పందించి ప్రశ్నించే గొంతుక గా ఉంటూ వాటి పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి ఎమ్మెల్సీ గా అలుగుబెల్లి నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు . నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఎమ్మెల్సీ స్థానా నికిగాను ఎమ్మెల్సీ ఓటర్ నమోదు పూర్తి అయ్యిం దని, ఒకవేళ చేసుకొని వారికి కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ నవంబర్ 23 నుండి డిసెంబర్ 6 వరకు ఉంటుందని వారు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా నర్సిరెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో జరగ బోయే పోరాటాలకు మన ఎమ్మెల్సీ స్థానం కీలకం కాబోతుందన్నారు. ఈసమా వేశంలో ప్రధా నోపా ధ్యాయులు స్వప్న, రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్, జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ, మండల అధ్యక్షులు రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏల బిల్లులు వెంటనే చెల్లించాలి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య

నవతెలంగాణ- దంతాలపల్లి

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలని తెలంగాణ టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డి శాసన మండలి లో విద్యారంగ అంశాల పట్ల వారు మాట్లాడిన తీరు పుస్తక రూపంలో ముద్రించిన పుస్తకాలను గురువారం మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు మిగతా నాలుగు విడుతల డీఏలను వెంటనే చెల్లించాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన జీపీఎఫ్, టీజీఎల్ఈ మెడికల్‌రీయింబర్స్‌మెంట్ సరండర్ లీవ్, సప్లిమెంటరీ బిల్లులో చేసిన సాలరీలు వంటి బిల్లులు నెలల తరబడి ఈ-కుబేర్ల లో పెండింగ్ లో ఉన్నవాటిని వెంటనే చెల్లించాలన్నారు. కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలలో పనిచేయుచున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు 'మినిమమ్ బేసిక్' వర్తింపజేయాలని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ప్రతి సంవత్సరం 10 శాతం చొప్పున పెంచాలని, మేనిఫెస్టోలో పెట్టిన సీపీఎస్‌ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్, జిల్లా అధ్యక్షులు మురళీ కృష్ణ, జిల్లా కోశాధికారి కొండ నాగమల్లయ్య దంతాలపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండ యాకయ్య, కొమ్మనబోయిన వంశీకృష్ణ నరసింహుల పేట అధ్యక్షులు ఊడుగుల వెంకటేశ్వర్, మండల ఉపాధ్యక్షులు పార్వతి రాథోడ్, యూటీఎఫ్ సభ్యులు ఈదురు రమేష్, లింగరాజు, వెంకన్న, చిరంజీవి, రమేష్, బాబు, మనోహర్, సోమయ్య, మధుకర్, లింగయ్య, నరేష్, సోమేశ్వర్, విజయభాస్కర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి డైట్ చార్జీలు పెంచాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-మహబూబాబాద్



పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన డైట్ చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మహబూబాబాద్ ఎంఈఓ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి పాఠశాల విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ గంధసిరి జ్యోతి బసు, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రవీణ్ మహేష్, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

అదన కలెక్టర్‌గా వీరబ్రహ్మాచారి బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-మహబూబాబాద్



మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా కె.వీరా బ్రహ్మాచారి బాధ్యతలు స్వీకరించారు. మహబూబాబాద్ జిల్లా నూతన అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. గతంలో ఆయన జయశంకర్ భూపాలపల్లి, మెదక్, సూర్యాపేట, రెవెన్యూ డివిజనల్ అధికారిగా, నల్లగొండ జడ్పీ సీఈవోగా పనిచేశారు.

తాను చదివిన పాఠశాలను సందర్శించిన ఎస్టీ జాతీయ కమీషన్ సభ్యులు హుస్సేన్ నాయక్

నవతెలంగాణ-గూడూరు



మండల కేంద్రంలోని జడ్పీ పీఎస్ బాలుర పాఠశాలను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్‌నాయక్ గురువారం సందర్శించారు పాఠశాలలోని పలు వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. తను పదవ తరగతి చదువుకున్న పాఠశాలలో మౌళిక వసతుల పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు. లక్ష్యంతో చదవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తమ తమ ప్రతిభను కనబరుస్తూ చదువుల్లో రాణించాలని, ఉన్నత స్థాయికి ఎదిగి తన తల్లిదండ్రులు కన్న కలలను నెరవేర్చాలని సూచించారు. తదుపరి ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పాఠశాలలో మౌళిక వసతులు కల్పించేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు తదుపరి పాఠశాల ఆవరణంలో బాలల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈకార్యక్రమంలోతహసీల్దార్‌శ్వేత, ఎంపీడీవో వీరస్వామి, ఎంపీఓ సత్యనారాయణ, ఐటీడీఏ టీడీవో భాస్కర్, మాజీ ఎంపీపీ చెల్పూర్ వెంకన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు

నియంత్రణ లేని నిఘా నేత్రాలు..!

నవతెలంగాణ-చిన్నగూడూరు:



మండలంలోని వివిధ గ్రామాల్లో ఉత్సవ విగ్రహాల్లాగా సీసీపుటేజీ నిఘా నేత్రాలు దర్శనమిస్తాయి. చిన్న గూడూరు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో నిఘా నేత్రాలు ముసుకోపోయాయా అనేది స్థానిక ప్రజల నుంచి స్పందన వస్తుంది. గత నెల రోజుల క్రితం మండల కేంద్రంలోని ఓ వృద్దుడిని రాత్రి పూట బెదిరించి దుండగులు సొమ్మును దొంగిలించారు. ఠాణాలో కేసు కూడా నమోదు అయింది. కాని దొంగలను పట్టుకోలేకపోయారనేది మండల వ్యాప్తంగా చర్చ. బాధితుడు మాత్రం లబోదిబోమంటూ పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నాడు. సీసీకెమెరాలు పని చేస్తే బాగుండునని ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఒక వేళ చెడిపోయిన కుడా రిపేరింగ్ చేయించకుండా పోలిస్‌లు తీవ్ర నిర్లక్ష్యంతో వరుస దోపిడీలు జరుగుతున్నాయని ప్రజలు భావిస్తున్నారు.

తక్షణమే సీసీ కెమెరాలు పునరుద్ధరణ చేయాలి

చెడిపోయిన సీసీ కెమెరాలను వెంటనే పునరుద్ధరణ చేసి దోపిడీ దారులకు, అక్రమ ఇసుక రవాణాను, వివిధ వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న బెల్లం, పీడీఎస్ బియ్యం, ఆధారాలు లేని వాహనాలను గుర్తించి చర్యలు చేపట్టితే నేరాలు తగ్గుముఖం పడతాయనేది స్థానికులు నుంచి అభిప్రాయాలు వెలిబుచ్చుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

నవతెలంగాణ-కేసముద్రంరూరల్:



కేసముద్రం మండలం మహమూద్ పట్నం, కేసముద్రం గ్రామ పరిధిలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేసముద్రం ఇన్‌ఛార్జ్ తహసిల్దార్ రాగం ఎర్రయ్య గురువారం పరిశీలించారు. ధాన్యం విక్రయానికి తెచ్చిన తర్వాత రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

రూ.కోటి 28 లక్షల 93వేల విలువగల గంజాయి దగ్ధం



నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా సీజ్ చేయబడిన ఒక కోటి ఇరవై ఎనిమిది లక్షల తొంబై మూడు వేల రూపాయలు (1,28,93000/-) విలువైన గంజాయిని గురువారం పోలీసులు దగ్ధం చేశారు. కాకతీయ మెడిక్లీన్ ఏజెన్సీ, ఊర్సుగుట్ట, హన్మకొండలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ డ్రగ్ డిస్పోసల్ కమిటీ అధికారి ఆదేశాల మేరకు డ్రగ్ డిస్పోసల్ కమిటీ సభ్యులు అడిషనల్ ఎస్పీ జోగులచెన్నయ్య, డీఎస్పీ తిరుపతిరావుల సమక్షంలో 515 కేజీ 720 గ్రాముల గంజాయి దహనం చేశారు. మహబూబాబాద్ జిల్లా పోలీసులు జిల్లా వ్యాప్తంగా గత కొంతకాలంగా నిర్వహించిన వివిధ దాడుల్లో పట్టుబడిన భారీ మొత్తంలో ధ్వంసం చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్‌లో నమోదు అయినా 24 కేసులలో మొత్తం 515 కిలోల 730 గ్రామ్స్ గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి, ఇతర డ్రగ్స్‌ను రవాణా చేసిన వారిపై కఠిన చర్యల తీసుకుంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీ తిరుపతిరావు, సీఐ డీసీఆర్‌బీ సత్యనారాయణ, సీఐ టౌన్ దేవేందర్, సీఐ డోర్నకల్ రాజేష్, సీఐ గూడూరు బాబురావు, బయ్యారం సీఐ రవిలు పాల్గొన్నారు.

వికాస్ హైస్కూల్‌లో.. ఘనంగా సెల్ఫ్ గవర్నమెంట్ డే

నవతెలంగాణ-తొర్రూరు

మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణ కేంద్రంలో వికాస్ పాఠశాలలో బాలల దినోత్సవం పురస్కరించుకొని గురువారం విద్యార్థులకి సెల్ఫ్ గవర్నమెంట్ డే ను నిర్వహించారు. ఇందులో విద్యార్థులు డీఈవో, ఎంఈఓ, ప్రిన్సిపాల్, పీఈటీలు ఇన్‌ఛార్జ్‌లు, ఉపాధ్యాయులుగా అనేక రకాల రోల్స్ పోషించి చాలా ఆనందానికి గురయ్యారు. అలాగే పాఠశాల నుంచి యశ్వంత్ ఎనిమిదో తరగతి విద్యార్థి వరల్డ్ కరాటే చాంపియన్‌షిప్ సిల్వర్ మెడల్ సాధించి ఉన్నతంగా నిలిచినందుకు పాఠశాల కరస్పాండెంట్ విద్యార్థిని సన్మానించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు ఆహ్లాదకరమైన, ఆనందదాయకమైన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వేణుమాధవ్, సాయిలు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులు లక్ష్యంతో చదవాలి : ఎస్ఐ రేఖ అశోక్



నవతెలంగాణ-గణపురం

విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖ రాలకు ఎదగాలని ఎస్సై రేఖ అశోక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల, కళాశాలలో డ్రగ్స్ మత్తు పదార్థాలపై ప్రిన్సిపాల్ తిరుపతి ఆధ్వర్యంలో అవగాహన స దస్సు నిర్వహించి ఎస్సై మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు కష్టపడి పిల్లలను చదివిస్తే కొందరు విద్యార్థులు జల్సాల కోసం గంజాయి డ్రగ్స్ అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. విద్యా ర్థులు డ్రగ్స్‌కు అల వాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎవరైనా డ్రగ్స్ అమ్మినా, వాడినా తమకు సమాచారం అందించాలని సూచించారు.

జ్వాలా యూత్‌కు భారతీయ సేవా స్ఫూర్తి అవార్డు



నవతెలంగాణ-మంగపేట

ఈనెల 15వ తేదీన హైదరాబాద్‌లోని సిటీ కల్చర్ సెంటర్ ఆడిటోరియంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో జ్వాలా యూత్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు భారతీయ సేవా స్ఫూర్తి డాక్టరేట్ ను ప్రదానం చేస్తున్నట్లు జ్వాల అధ్యక్షుడు కోడెల నరేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాము నిర్వహిస్తున్న జ్వాలా యూత్ ట్రస్ట్‌కి గౌరవ డాక్టరేట్ రావడం సంతోషంగా ఉందన్నారు. దశాబ్ద కాలంగా జిల్లా వ్యాప్తంగా పేద ప్రజలకు జ్వాల యూత్ ద్వారా చేసిన సేవలను, కరోనా విపత్తు కాలంలో అందించిన సేవలను గుర్తించిన వేదిక్ ఇంటర్నేషనల్ సంస్థ జ్వాలా యూత్‌కు డాక్టరేట్ ప్రదానం చేస్తున్నట్లు వెల్లడించారు. జ్వాల యూత్ ప్రధాన కార్యదర్శి మునిగాల రాకేష్ తో కలిసి అవార్డును అందుకోబోతున్నట్లు నరేష్ వెల్లడించారు. దాతల సహకారంతో తాము చేసిన సేవలకు ఈ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని, ప్రజల సహకారం మరువలేనిదని అన్నారు.

సహకారం... అభివృద్ధికి మార్గం...

ఏటా ఉత్తమ పనితీరు కనబరుస్తున్న సంఘాలు
రైతులకు ఎన్నో రకాల సేవలు
ప్రారంభమైన 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు



ఒక్కరు అందరి కోసం.. అందరు ఒక్కరి కోసం అనేది సహకార సంఘాల నినాదం. పరస్పర సహకారం అనే అంశానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ఇదే ఉద్దేశంతో సహకార వ్యవస్థను ప్రారంభించారు. రైతులు, ప్రభుత్వం కార్మికులు అందరూ సంఘాలుగా ఏర్పడి, పరస్పర సహకారంతో అభివ ద్ధి దిశగా ముందుకు సాగుతున్నారు. గురువారం నుంచి సహకార వారోత్సవాలు ప్రారంభమైయ్యాయి. ఈ నెల 20 వరకు నిర్వహించనున్నాయి. ఏటా జరిగే అఖిల భారత సహకార వారోత వాలను ఏదో ఒక అంశం నేపథ్యంగా నిర్వహిస్తున్నారు. ఈసారి 71వ ఉత్సవాలను వికసిత్ భారత్ నిర్మించడంలో సహకార రంగం పాత్ర పేరిట జరుపుతున్నారు.

నవతెలంగాణ-మల్హర్‌రావు

రైతులకు తోడ్పాటునందించడానికి ఏర్పాటు చేసిన సహకార సం ఘాలు అభివృద్ధి సాధిస్తే రైతులు ఆర్థికంగా ముందుకు వెళ్లడా నికి మరిన్ని అవకాశాలు లభిస్తాయి. అలా ఇంతింతై వటుడింతై అన్నట్లుగా ఏటా గ్రేడ్లు సాధిస్తున్న సంఘాలకు కొదువలేదు. కే డీసీసీబీ ఇప్పటికే రాష్ట్ర, దేశ స్థాయిలో, దక్షిణ దేశాల్లో ఉత్తమ బ్యాంకుగా గుర్తింపు పొందింది. సంఘాల ద్వారా వ్యవసాయ రు ణాలతోపాటు దీర్ఘకాల వ్యవధి(ఎల్) రుణాలివ్వడం, రైతులు వడ్డీ వ్యాపారుల చేతిలో మోసపోకుండా ప్యాక్స్ ద్వారా ధాన్యం కొను గోలు చేస్తూ వారికి అండగా నిలుస్తున్నారు. ఏటా లక్షల క్వింటా ళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రూ.లక్షల్లో కమీషన్ పొందు తున్నారు. అలాగే, గ్రామాల్లో అన్నదాతలతో పరస్పర సహకార సంఘాలను ఏర్పాటు చేసి, ఎరువులు, పురుగు మందులను రైతులకు నేరుగా అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇక, పె ట్రోల్ బంకులు, గోదాంలు, మీసేవ కేంద్రాలు, దుకాణ సముదా యాలు, రైస్ మిల్లులు నిర్వహిస్తూ లాభాలు గడిస్తున్నారు.

కార్యక్రమాల షెడ్యూల్ ఇదే....

వారం రోజులపాటు సహకార వారోత్సవాలు జరగనుం డగా చేపట్టాల్సిన కార్యక్రమాలను ప్రభుత్వం సూచించింది. ఈ నెల 14న సహకార ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో సహ కార మంత్రిత్వశాఖ చొరవ, పాత్ర. 15న సహకార సంస్థల్లో ఆ విష్కరణ, సాంకేతికత, సుపరిపాలన, 16న వ్యవస్థాపకత, ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్స హించడంలో సహకార సంఘాల పాత్ర, 17న సహకార సంస్థల రూపాంతరం, 18న సహ కార సంస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం. 19న మ హిళలు, యువత, బలహీనవర్గాల కోసం సహకార సంఘాలు, 20న స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, మెరుగైన ప్రపంచం కోసం సహకార సంఘాల పాత్రపై కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రైతులే ఎజెండా...



రైతులే ఎజెండాగా సహకార సంఘాలు రూపు దిద్దుకొన్నాయి. ఒకప్పుడు పదుల సంఖ్యలో ఉండగా నేడు 128కి చేరాయి. కాలక్రమేణా ఎన్నో మార్పులు వచ్చాయి. సేవలు అఫ్ లైన్ నుంచి ఆన్ లైన్ కు చేరాయి. తాడిచెర్ల సొసైటీలో ఇప్పటికే 3 వేలకు పైగా సభ్యులు ఉన్నారు.

-ఇప్ప మొండయ్య, తాడిచెర్ల పీఏసీఎస్ చైర్మన్

దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు



తొలుత సహకార సంఘాలు, తర్వాత సహకార బ్యాంకులు ఏర్పడ్డాయి. రైతు కుటుంబాల్లోని పిల్లల ఉన్నత విద్యకు రుణాలు, స్కాలర్షిప్ లు, రైతులకు దీరకాలిక, స్వల్పకాలిక రుణాలు, ధాన్యం కొనుగోలు చేయడం వంటి ఎన్నో రకాల సేవలు అందుతున్నాయి.

-వొన్న తిరుపతిరావు, పీఏసీఎస్ డైరెక్టర్



కొండపై కొలువుదీరిన 'వెంకన్న'

ప్రారంభమైన బుగులోని జాతర

నవతెలంగాణ-రేగొండ

రేగొండ మండలంలోని తిరుమలగిరి శివారులో ప్రతి ఏటా కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని బుగులోని వెంకటేశ్వర స్వామి జాతర అంగరంగ వైభవంగా జరుగుతుంది. బుగులోని వెంకటేశ్వర స్వామి గురువారం ప్రత్యేక పల్లకి సేవలో కొండపై కొలువు తీరారు. గుట్ట కింద ఉన్న ఇప్ప చెట్టు చుట్టూ తిరిగి గుట్టకు చేరడంతో జాతర ప్రారంభమైంది. వంశీ అర్చకుడు కుర్మాచలం వెంకటేశ్వర్లు ఇంట్లో కొలువైన స్వామివారిని ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక రథంలో మేళ తాళాలు, డప్పు చప్పులతో, కోలాటాల నడుమ ఊరేగింపుగా జాతర ప్రాంగణానికి తరలించారు. సాయంత్రం గుట్ట కింద ఉన్న శివాలయం ప్రాంగణంలో అలివేలు మంగ పద్మావతితో స్వామివారి వివాహ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని చూడడానికి మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం సతీసమేతంగా స్వామివారిని కొండ సోరికలో వెలసిన ప్రాంతానికి చేర్చారు. స్వామివారి రాకతో గుట్ట పైన ఉన్న గండ దీపాన్ని వెలిగించారు. జాతరలో ప్రజల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జాతర ఈవో శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ రొంటాల వెంకటస్వామి తెలిపారు. ఈ కార్యక్రమాలలో సుంకు జితేందర్, సుంకరి అనిత, కాంగ్రెస్ నాయకులు కట్ల చిన్ని, నిమ్మల విజేందర్, పల్నాటి శ్రీనివాస్, ఆకుతోట తిరుపతి, మండల తిరుపతి, చల్లగురుగుల సుదర్శన్, గంట గోపాల్, పలదుగుల మల్లయ్య, రొంటల రఘుపతి, గడ్డం మహేష్, రంజిత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కోటగుళ్ళు అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్ కుమార్



నవతెలంగాణ-గణపురం

కోటగుళ్ళు అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని భూ పాలపల్లి జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కోడూరు నవీన్ అన్నారు. కార్తిక మాస ఉత్సవాలలో భాగంగా ఆయన గురువారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోటగుళ్ల పరిరక్షణ కమి టీ ఆధ్వర్యంలో ఆలయం పేరుతో ముద్రించిన బ్యాగులను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ శిల్ప సంపదను భావితరాలకు అందించాలన్నారు. రాబోయే రోజుల్లో ఆలయం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఆవిష్కరణ అనంతరం కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సన్మానించారు. కోటగుళ్ల పరిరక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అధిక నిధులు కేటాయించాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-మహదేవపూర్

పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకానికి అధిక నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజుకుమార్ కోరారు. గురువారం ఎస్ఎఫ్ఐ స్కూల్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓకు వినతి పత్రం అందజేసి ఆయన మాట్లాడారు. మండలంలోని గర్ల్స్ హై స్కూల్, బాయ్స్ హై స్కూల్, సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేదంటే ఆందోళనలతో పాటు ఎంఈఓ, తహసీల్దార్ కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల గర్ల్స్ హై స్కూల్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు రామ్‌చరణ్, బాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

నవతెలంగాణ-మహదేవపూర్

మండల కేంద్రంలోని గ్రీన్ వుడ్ పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. పాఠశాల కరస్పాండెంట్ చీర్ల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బాలల దినోత్సవానికి భారతదేశంలో ఓ ప్రత్యేకత ఉందని, పిల్లల హక్కులను గుర్తించి వారికి విద్య ఆరోగ్యం భవిష్యత్తు తోపాటు మంచి ప్రగతిని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఒక వ్యవస్థ యొక్క మార్గదర్శకాలు విధివిధానాలు పనితీరు అర్థం చేసుకుని భవిష్యత్తులో ఒక వ్యవస్థను నడిపించే విధానాన్ని అవగతం చేసుకోవడానికి స్వయం పరిపాలన దినోత్సవం ఉపయోగపడుతుందని అన్నారు. జిల్లా వైద్యాధికారిగా వైదిక్ సాయి, పాఠశాల కరస్పాండెంట్‌గా శివ స్వరన్, ప్రధానోపాధ్యాయులుగా అక్షయ అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ ఆకుతోట రాజ్కుమార్, వైస్ ప్రిన్సిపాల్ జే రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సహకార సంఘాలతో రైతులకు మేలు

ఎమ్మెల్యే జీఎస్సార్



నవతెలంగాణ-రేగొండ

రైతుల ఆర్థికాభివృద్ధికి సహకార సంఘాలు దోహదపడతాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. 71వ భారత వ్యవసాయ సహకార సంఘాల వారోత్సవాలను గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ సహకారం సంఘం కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి విజ్జన్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పీఏసీఎస్ ద్వారా ఎంతో మంది రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నారని అన్నారు. భారతదేశ చరిత్రలో కనువిని ఎరుగని రీతిలో 28 రాష్ట్రాలలో 2లక్షల రుణమాఫీ చేసిన రాష్ట్రం తెలంగాణ అన్నారు. గత ప్రభుత్వాలు 7 లక్షల కోట్లు అప్పుల కుప్ప చేసిన ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు ఏక కాలంలో జమ చేసిందని గుర్తు చేశారు. రుణ మాఫీ కాని రైతులకు మార్చి 31 లోపు రుణమాఫీ జరుగుతుందని భరోసానిచ్చారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని అన్నారు. నియోజకవర్గంలో ప్రతి రైతు ఇంట్లో ఆనందం విరజిల్లేలా ప్రభుత్వ పథకాలను అందిస్తామని తెలిపారు. డీసీఓ బాల్యా నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, ఎస్ఎస్ఆర్ సంస్థల చైర్మన్ నాయినేని సంపత్ రావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు మోడెం ఉమేష్ గౌడ్, మాజీ జెడ్పిటిసిలు సాయిని విజయ, పులి తిరుపతిరెడ్డి, పత్తి ప్రభాకర్, ఎంపీపీ పున్నం లక్ష్మీ రవి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఇప్పకాయల నరసయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామల పాపిరెడ్డి, డైరెక్టర్లు చల్లగురుగుల సుదర్శన్, ఓం ప్రకాష్, సుర సంపత్, బొట్ల మధుసూదన్, అవుల మహేందర్, దాసరి లింగయ్య, నాయకులు సాంబయ్య పట్టేమ్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మహాదేవపూర్ పీఏసీఎస్‌లో సహకార వారోత్సవాలు

సహకార జెండాను ఎగురవేసిన చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి



నవతెలంగాణ-మహాదేవపూర్

71వ అఖిలభారత సహకార వారోత్సవాల సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కేంద్రంలో చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి సహకార జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. అందరం కలిసి కృషి చేస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని సహకార సంఘం నిరూపించిందన్నారు. కరీంనగర్ జిల్లాలో నాలుగైదు సహకార సొసైటీలు అంతర్జాతీయస్థాయిలో పేరుపొందాయన్నారు. మన సొసైటీకి గత సంవత్సరం 2023కుగాను ఎక్సలెంట్ అవార్డు తీసుకోవడం జరిగిందన్నారు. ఇందుకు సహకరించిన రైతుకు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వారం రోజులపాటు సహకార సంఘం సంస్థ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట రాజబాపు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎనమండ్ర వామన్‌రావు, పీఏసీఎస్ డైరెక్టర్లు తోట ఎండి ఇబ్రహీం, చీర్ల తిరుపతిరెడ్డి, చిటికేసి సవిత శ్రీనివాస్, పీఏసీఎస్ సీఈఓ రాజబాబు, కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా చిల్డ్రన్స్ డే వేడుకలు











నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్ కాలనీలోని ఆక్స్‌ఫర్డ్ క్రియేటివిటీ పాఠశాలలో చిల్డ్రన్స్ డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా వేడుకలను నిర్వహించారు. చిన్నారుల నృత్యాలు ఆహుతులను అలరించాయి. పాఠశాల నిర్వాహకులు కరణ్, సంగీత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేగొండ : భారతదేశ మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని రేగొండ మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల విద్యాలయంలో గురువారం బాలల దినోత్సవం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆలబోజు వెంకటేశ్వర్లు నెహ్రూ చిత్రపటానికిపూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. గురుకుల విద్యాలయాలలో సకల సదుపాయాలతో విద్యాబోధన జరుగుతుందని, ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్, శ్రీనివాస్, సాగర్ సందీప్ రాజేందర్, వెంకటప్రసాద్, అక్బర్ పాల్గొన్నారు.

రైజింగ్ స్టార్ పాఠశాలలో

మహదేవపూర్ :మండల కేంద్రంలోని రైజింగ్ స్టార్ ప్రైవేటు విద్యాలయంలో గురువారం బాలల దినోత్సవ వేడుకలు విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి. జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థుల ఫ్యాషన్ పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ మంజులారెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో

మహాదేవపూర్ జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జవహర్లాల్ నెహ్రూ జయంతి వేడుకలతో పాటు పేరెంట్స్ టీచర్స్ సమావేశం గురువారం నిర్వహించారు. పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు మడక మధు పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు హెలీ పాషా, వీరేశం, సమ్మయ్య లీలారాణి, వసుదా, ప్రియా, రజిత, పూర్ణిమ, దేవిక ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మహదేవపూర్ : మహాదేవపూర్ జెడ్పిహెచ్ఎస్(బాలురు), అంబటిపల్లి జెడ్పిఎస్ఎస్‌లో బాలల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. జవహర్లాల్ నెహ్రూ జయంతి వేడుకల్లో భాగంగా స్వయంపరిపాలనా దినోత్సవం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి రాజిరెడ్డి వెంకట రజం, చల్ల మొండయ్య మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అన్నారు. నెహ్రూ స్ఫూర్తితో ఉన్నత స్థానాలను అధిరోహించాలని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్కేశ్వరం ప్రాథమిక పాఠశాలలో

మహాదేవపూర్ మండలంలోని ఎల్కేశ్వరం ప్రాథమిక పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం సందరేగా విద్యార్థిని విద్యార్థులచే ఆట పాటలు మరియు న త్య ప్రదర్శన వేడుకల్నినిర్వహించారు ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు స్పందన, స్వప్న ,విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ యువకులు రవీందర్ రెడ్డి అరవింద్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు

టేకుమట్ల : టేకుమట్ల మండలంలోని నవ చైతన్య పబ్లిక్ స్కూల్లో జవహర్లాల్ నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రామ్ మధునయ్య మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో జవహర్‌లాల్ నెహ్రూ కీలక పాత్ర పోషించారని అన్నారు. మండలంలోని సోమనపల్లి అంగన్వాడి కేంద్రంలో బాలల దినోత్సవం వేడుకలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్, స్కూల్ టీచర్ ఆయా, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో.. గోదావరి నదీ హారతి



నవతెలంగాణ-మహాదేవపూర్

కార్తీక మాసం సందర్భంగా మూడవ రోజు గురువారం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన రాజ గోపురం నుండి మంగళ వాయిద్యాలతో గోదావరి నది వద్దకు బయలుదేరి ప్రధాన అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తి గోదావరి నది హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, కాళేశ్వరం గ్రామస్తులు, కరీంనగర్ వెంకట అన్నమాచార్య సేవా సమితి సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయంలో ఆకాశ దీపం వెలిగించి అభిషేక మండపం వద్ద దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు దేవస్థానం నుండి పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులు దేవస్థానం సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, అర్చక స్వాములు అందజేశారు.

గ్రూప్-3 పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర

నవతెలంగాణ - ములుగు

గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చీఫ్ సూపరింటెండెంట్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, రూట్ ఆఫీసర్స్, డిపార్ట్మెంటల్ అధికారులతో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) సంపత్‌రావుతో కలసి సమావేశమై ఆయన మాట్లాడారు. జిల్లాలో 9 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, 2173 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరువుతున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన అధికారులను, సిబ్బంది నియమించామన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకోసం పరీక్ష కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని అన్నారు. 17.11.2024 న ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం12.30గంటల వరకు పేపర్1 (జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్) పరీక్ష, సాయంత్రం 3గంటల నుండి 5.30 గంటల వరకు పేపర్ -2 హిస్టరీ, పోలిటి అండ్ సొసైటీ పరీక్ష ఉంటుందన్నారు. మొదటి పరీక్షకు పరీక్షా కేంద్రం గేట్లు ఉదయం 9.30 గంటలకు మూసివేస్తారని, పేపర్ 2 పరీక్షకు మధ్యాహ్నం 2.30 గంటలకు గేట్లు మూసివేస్తారని అన్నారు. 18న ఉదయం 10. 00 గంటలనుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-3 పరీక్ష ఉంటుందని, పరీక్షా కేంద్రం గేట్లు ఉదయం 9.30 గంటలకు మూసివేస్తారని తెలిపారు. పరీక్షలు సజావుగా,ప్రశాంతంగా జరిగేలా పగడ్బందీగా చర్యలు చేపట్టాలని సూచించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 8:30 గంటల వరకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అభ్యర్థులు టీజీపీఎస్సీ సూచనలు పాటించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ఈ సమావేశం లో ప్రభుత్వ డిగ్రి కళాశాల ప్రిన్సిపాల్ మల్లేశం,కలెక్టరేట్ సూపర్ ఇండెంట్ శివ కుమార్, చీఫ్ సూపరింటెండెంట్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, రూట్ ఆఫీసర్స్, తదితరులు పాల్గొన్నారు.



బాలలే సమాజానికి అమూల్యమైన సంపద

జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర్

నవతెలంగాణ-ములుగు

బాలల ఈ సమాజానికి అమూల్యమైన సంపదనీవారంతా తమ హక్కుల పై అవగాహన కలిగి ఉండాలనీజిల్లా కలెక్టర్ దివాకర అన్నారు. జిల్లా కలెక్టరేట్ లోని ఆడిటోరియంలో జిల్లా సంక్షేమ అధికారి శిరీష అధ్యక్షతన గురువారం జాతీయ బాలల హక్కుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హాజరైన మాట్లాడారు. బాల బాలికలు ఎలాంటి వివక్షకు గురి కాకుండా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. అనంతరం ఆర్డిడి ఝాన్సీ లక్ష్మీ మాట్లాడుతూ బాల బాలికలు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారి కె శిరీష మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మ వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని ధైర్యంతో సమాజంలో ఎదగాలని అన్నారు. అనంతరం జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె ఓంకార్ మాట్లాడుతూ బాలల పరిరక్షణ విభాగం జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ ఆధ్వర్యంలో అందిస్తున్న బాలల రక్షణ సేవలను గురించి వివరించారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ అంశాల్లో ప్రతిభ కనబర్చిన చిన్నారులను సన్మానించి జ్ఞాపికను అందించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన బాలల హక్కుల పరిరక్షణ చట్టాలపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిడిపివోలు జి మల్లీశ్వరి, ఈపి ప్రేమలత, ధనలక్ష్మి, బాల సదనం సూపరింటెండెంట్ సుమతి, సూపర్వైజర్ రమాదేవి, డిసిపియ, సిహెచ్ఎల్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో చదువు, క్రీడలు కీలకం

జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్

నవతెలంగాణ - ములుగు

విద్యార్థి దశలో చదువు, క్రీడలు కీలకమని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ తెలిపారు. జాకారం సోషల్ వెల్ఫేర్ కళాశాలలో జరిగిన10వ జోనల్ స్పోర్ట్స్, గేమ్స్ ముగింపు మీట్‌కు జిల్లా ఎస్పీ హాజరయ్యారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందించారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ స్కూల్స్ జోన్ 1 నుండి 5 జిల్లాల క్రీడాకారులు 1000 మందికి పైగా హాజరు కాగా తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ స్కూల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ సందర్భంగా కాలేశ్వరం జోన్‌కు సంబంధించి 10వ జోనల్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ ఈనెల 11 నుంచి 14 వరకు ములుగు జిల్లా జాకారంలోని సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో నిర్వహించారు. ఆసిఫాబాద్, మంచిర్యాల్ పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు క్రీడాకారులు పాల్గొన్నారు. వాలీబాల్ కబడ్డీ కొక్కో సెపక్ తక్రా బాల్ బ్యాడ్మింటన్ అథ్లెటిక్స్ వంటి క్రీడలను నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికే కాకుండా కెరియర్‌గా కూడా ఎంచుకోవచ్చునని ఎస్పీ అన్నారు. విద్యార్థి దశలో చెడు విషయాలకు లొంగకుండా సన్మార్గంలో పయనించాలని సూచించారు. ఈ క్రీడలలో ఆల్ రౌండ్ పర్ఫామెన్స్ ట్రోఫీని జాకారం స్కూల్ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ అధికారి అరుణకుమారి, డిసిఓ శ్రీనివాసరావు, బిక్షపతి, జోనల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, 11 పాఠశాలల స్కూల్ ప్రిన్సిపల్స్, యాదగిరి నర్మదా బాయి, పిఈటీలు, ఉపాధ్యాయులు ఆర్ వెంకటేశ్వర్లు, సురేష్ బాబు, రామ్ రెడ్డి, సదయ్య పిచ్చిరెడ్డి, మమత, రజిని పాల్గొన్నారు.



కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి ధరలు

నవతెలంగాణ-మంగపేట



కొనబోతే కొరివి అమ్మబోతే అడవి అన్న చందంగా త యారయింది ఉల్లి ధర. రెండు నెలల క్రితం వరకు 35 రూ పాయలకు కిలో లభించిన ఉల్లి... గత రెండు నెలలుగా 45 నుండి 55 రూపాయలకు కిలో లభించింది. ఇప్పుడు ఏకంగా కిలో ఉల్లిగడ్డ 90 రూపాయలకు పెరిగి కొనేవారికంట కన్నీరు పెట్టి స్తుంది. ప్రస్తుతం మార్కెట్లో పాత ఉల్లి కిలో 90 రూపాయలకు కొత్త ఉల్లి కిలో 55 రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు. ధరలు పెరగడంతో ఉల్లిని కొనడానికి ప్రజలు జంకుతున్నారు.

గడువు పొడిగింపు

మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజేంద్రప్రసాద్

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

తెలంగాణ రాష్ట్ర పారామెడికల్ బోర్డు ఉత్తర్వుల ప్రకారం డీఎంఎల్‌టి, డిఈసిజి పారామెడికల్ కోర్సులకు అడ్మిషన్ పొందడానికి దరఖాస్తుల గడువు నవంబర్ 20 వరకు పొడి గించడం జరిగిందని ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 20వ తేదీ సాయంత్రం 5గంటల లోపు తగిన ధ్రువ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు www.tgpmb.telangana.gov.inవెబ్సైట్ ను సంప్రదించాలని ఆయన సూచించారు.

కొన....సాగుతున్న సర్వే

గ్రామాల్లో వెరీ స్లో..

మండలంలో సర్వే వివరాలు (బుధవారం వరకు)

గ్రామీణ కుటుంబాలు 9,753

ఎన్యుమరేషన్ బ్లాక్‌లు 63

సర్వే పూర్తయిన కుటుంబాల సంఖ్య 3,680

ఇంకా చేయాల్సినవి 6,073

నవతెలంగాణ-మల్హర్‌రావు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మండలంలో కొనసాగుతుంది. కాగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ సర్వే మాత్రం స్లోగా నడుస్తుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ముందుగా విడుదల చేసిన షె డ్యూల్ ప్రకారం ఈ సర్వే ఈనెల 18 వరకు కొనసాగాలి. ఈలెక్కన మరో నాలుగు రోజులు మాత్రమే గడువు మిగిలి ఉంది. ఆతర్వాత సర్వే ద్వారా సేకరించిన వివరాలను కంప్యూటర్ లో నమోదు చేయాల్సి ఉంటుంది. 30వ తేదీలోపు రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లాకు సంబంధించి రిపోర్టును సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.మండలంలో 63 బ్లాక్ ల్లో మొత్తం 9,753 ఇండ్లు ఉండగా ఇప్పటికి 3,680 మాత్రమే పూర్తియి,ఇంకా 6,073 ఇండ్లు సర్వే చేయాల్సి ఉంది. బుధవారం వరకు 37.5 శాతం పూర్తియింది. ఈనెల 6న సర్వేను క్షేత్రస్థాయిలో మొదలు పెట్టాల్సి ఉండగా, ఎన్యుమరేటర్ల మార్పులు చేర్పుల కారణంగా కొంత ఆలస్యంగా ప్రారంభమైంది. ప్రాథమిక పాఠశాల టీచర్లను, పంచాయతీ కార్యదర్శులను, రెవెన్యూ సిబ్బంది, స్వశక్తి మహిళ సంఘాల సిసిలను ఎన్యుమరేటర్లుగా నియమించి 6వ తేదీ నుంచి ఇళ్ల గుర్తింపు ప్రక్రియ షురూ చేశారు. షెడ్యూల్ ప్రకారం ఈ ప్రక్రియ ముందే జరగాల్సి ఉండగా, ఎన్యుమరేటర్ల మార్పులు చేర్పుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఆలస్యమైంది. క్షేత్రస్థాయిలో సర్వేను 9నుంచి చేపట్టారు. అప్పటి నుంచి ఎన్యుమెటర్లకు తమకు కేటాయించిన బ్లాక్ లను చేరుకొని సర్వే చేపడుతున్నారు.అయితే గడువులోపు పూర్తి అవుతుందో లేదో వేచి చూడాల్సిందే.



ఒక్కో ఎన్యుమరేటర్‌కు...

ప్రభుత్వం ముందుగా ఎన్యుమరేషన్ బ్లాక్స్ (ఈబీ)లను రూపొందించింది. ప్రధానంగా వార్డుల ఆధారంగా వాటిలో ఈబీలను గుర్తించింది. ఒక్కో ఈబీకి ఒక్కో ఎన్యు మరేటర్ను కేటాయించింది. ఆ ఈబీ పరిధిలో 175 ఇళ్లు ఉన్నాయి. ఒక్క ఎన్యుమరేటర్ ఆ ఈబీలోని కుటుంబ సభ్యులను కలిసి సర్వే చేయాల్సి ఉంటుంది. ఇలా నిర్దేశిత సర్వే కాలంలో ఆ ఎన్యుమరేటర్ ఆ ఈబీ బ్లాక్ లోని కుటుంబ సభ్యులను కలిసి సర్వే పూర్తి చేయాల్సి ఉంటుంది. వారిపైన సూపర్వైజర్లు ప్రతిరోజు సర్వే తీరును పరిశీలించాలి. కాగా, కాటారం సాన్ కలెక్టర్ మయాంక్ సింగ్ పర్యవేక్షణలో సర్వే పకడ్బందీగా సాగు తుంది. ఇటీవల సబ్ కలెక్టర్ ఈ ప్రక్రియపై తహశీల్దార్, ఎం పీడీఓ, సూపర్‌వైజర్లు ఎన్యుమరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.



సామూహిక సత్యనారాయణ వ్రతాలు

నవతెలంగాణ-గణపురం

మండలంలోని చెల్పూర్ గ్రామంలోని శ్రీ సాంబమూర్తి శివాలయంలో గురువారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 108 మంది దంపతులు హాజరై సామూహిక సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్నారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాందాస్ ప్రభాకర్, వైస్ చేర్మెన్ జెట్టి కనకరాజు, ధర్మకర్త లు.రసమడుగు, శాంత, పొగాకు గోపి, పొనగంటి, మొగిలి. అర్చకులు హరి రఘుశర్మ, సాయి శర్మ, పాల్గొన్నారు

నేడు రక్తదానం శిబిరం

కాంగ్రెస్ మండల అధ్యక్షులు సతీష్ గౌడ్

నవతెలంగాణ-టేకుమట్ల

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు జన్మదినం సందర్భంగా నేడు టేకుమట్ల మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పీఆర్ఎంఆర్ గార్డెన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు కాంగ్రెస్ మండల అధ్యక్షులు సతీష్‌గౌడ్ తెలిపారు. అన్ని అనుబంధ సంఘాల అధ్యక్షులు కమిటీ నాయకులు, యువజన కాంగ్రెస్ మిత్రులు గండ్ర సత్తన్న గారి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

లెంకల గడ్డ అమరవీరుల ఆశయాలు కొనసాగిస్తాం

ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న



నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

లెంకల గడ్డ అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తాం అని ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న అన్నారు. గురువారం భూపాలపల్లి లో అంబేద్కర్ సెంటర్ సమీపంలోని సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సిపియుఎస్ఐ పార్టీ ములుగు భూపాలపల్లి జిల్లా కమిటీ సమక్షంలో లంకలగడ్డ అమరవీరుల సంస్మరణ సభ పార్టీ ములుగు భూపాలపల్లి జిల్లా కార్యదర్శి వావిలాల లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. దైద వెంకన్న హాజరై మాట్లాడుతూ..లెంకల గడ్డ అమరవీరులు సూర్య మన్న తో పాటు మాలతి, తిరుమల, జంపన్న, చాంద్ పాషా, వీరస్వామి రవి, భూమి, భుక్తి విముక్తి కోసం మారోజు వీరన్న స్ఫూర్తితో పోరాడారన్నారు. 2002 నవంబర్ 11న లెంకల గడ్డ ప్రాంతంలో సూర్యం అన్న దళం సమావేశం కాగా ఏకపక్ష కాల్పులు జరపగా విప్లవ వీరులు హతమయ్యారని అన్నారు. సూర్యమన్న మృతిచెంది నేటికి 22 సంవత్సరాలు అయిందని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరం కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపియుఎస్ఐ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి రమేష్ గడ్డం శరత్ వరంగల్ జిల్లా కార్యదర్శి పిట్టల రాజమౌళి, దళిత బహుజన కూలి రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ నరేందర్, సి పి యు ఎస్ఐ భూపాలపల్లి జిల్లా నాయకులు ముంజల బిక్షపతి, ములుగు జిల్లా సాధన సమితి కర్ణాటక సమ్మన్న, శనిగారపు బిక్షపతి, రాజేందర్, వరికోల్ సమ్మన్న, తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై దాడిని ఉపేక్షించొద్దు

ములుగు జేఏసీ చైర్మన్ నాగేశ్వర్‌రావు

నవతెలంగాణ - ములుగు

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో అధికారులపై జరిగిన దాడి ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ ఘటన వెనుక ఎవరున్నా ఉపేక్షించొద్దని లో ములుగు జేఏసీ చైర్మన్ నాగేశ్వర్‌రావు అన్నారు. లగచర్ల ఘటనకు నిరసనగా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ముందు ధర్నాలు చేపట్టారు. ఇందులో భాగంగా ములుగు కలెక్టర్ ఆఫీసులో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కొందరు అధికారులపై జరిగిన దాడిని సైతం పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. అనంతరం ములుగు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఉద్యోగుల జేఏసీ నాయకులు జేఏసీ కన్వీనర్ మాడుగురి నాగేశ్వరరావు సంఘం నాయకులు వీరస్వామి, తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సంజీవ పాల్గొన్నారు

ఉద్యోగుల ధర్నా

విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, అడిషనల్ కలెక్టర్ లింగయ్య నాయక్, ఇతర అధికారులపై జరిగిన దాడిని ఖండిస్తూ ములుగు జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో భోజన విరామ సమయంలో ఉద్యోగులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా కార్యక్రమం చేట్టారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉద్యోగులకు భద్రత కల్పిస్తూ నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ధర్నా అనంతరం ఉద్యోగులంతా కలిసి జిల్లాలో పనిచే స్తున్న ఉద్యోగులందరికీ భద్రత కల్పించాల్సిందిగా జిల్లా కలెక్టర్, దివాకర టిఎస్‌కి వినతిపత్రాన్ని అందజేశారు. టీఎన్జీవోస్ యూనియన్ ములుగు జిల్లా అధ్యక్షులు పోలురాజు, టీజీవో ములుగు జిల్లా అధ్యక్షులు ఎమ్ సంపత్‌రావు, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు వేం యాకుబ్ రెడ్డి, సిపిఎస్ అసోసియేషన్ అధ్యక్షులు రవికాంత్, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి మేడి చైతన్య, టిజి ఓ అసోసియేషన్ కార్యదర్శి కె.జీవన్ కుమార్, టీజీవో అసోసియేట్ ప్రెసిడెంట్ ఆర్ రామకృష్ణ, బి అప్పలనాయుడు , పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షులు పిట్టల రవి, ఇరిగేషన్ ఫోరమ్ అధ్యక్షులు టీ ప్రదీప్, నాలుగవ తరగతి ఉద్యోగుల ఫోరం అధ్యక్షులు రమేష్, తదితరులు పాల్గొన్నారు.





ప్రభుత్వ అధికారులపై దాడి కుట్ర పూరిత చర్య

భూపాలపల్లి టౌన్ : ప్రభుత్వ అధికారులపై దాడి కుట్ర పూరిత చర్య బాధ్యులను కఠినంగా శిక్షించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ ఇనిగల కృష్ణమూర్తి అన్నారు. వికారాబాద్ జిల్లా లగచర్ల గ్రామంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రదీప్ జైన్, అధికారులపై జరిగిన దాడిని ఖండిస్తూ జిల్లాల కలెక్టరేట్ ఎదుట గురువారం భోజన విరామం లో జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. ఇనిగాల కృష్ణమూర్తి మాట్లాడుతూ... ఇలాంటివి భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాలన్నారు. దాడిలో పాల్గొన్న వారినందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు మెమోరాండం సమర్పించారు. తహసిల్దార్ నాగరాజు, డిప్యూటీ తహసిల్దార్ రామ్మోహన్, జేఏసీ కో - కన్వీనర్ బండి శ్రీనివాస్, శ్రీనివాస్, చంద్రమోహన్, లక్ష్మీనారాయణ, మొగిలి, సురేష్, ఆనందం, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

మహాదేవపూర్ : వికారాబాద్ జిల్లా లగచర్ల గ్రామంలో జిల్లా కలెక్టర్, రెవెన్యూ సిబ్బంది పై దాడిని నిరసిస్తూ మహదేవ్‌పూర్ స్కూల్ సముదాయంలోని ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో గురువారం నల్ల బ్యాడ్జిల తో నిరసన ప్రదర్శన చేశారు. జేఏసీ నాయకులు బొమ్మన తిరుపతి రెడ్డి మాట్లాడారు. నిందితులకు శిక్షపడే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు.



పుట్ట ఆశీర్వచనాలు

నవతెలంగాణ-మహదేవపూర్

మహాముత్తారం మండలం మినాజీపేట గ్రామంలో తాటికొండ రమ- సుధాకర్ చారి పుత్రుడు దేవేందర్ చారి - నందిత వివాహ వేడుక గురువారం జరిగింది. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట స్థానిక నాయకులు, తదితరులు ఉన్నారు.



అంతర్జాతీయ కరటే పోటీల్లో .. విన్ శ్రీత లౌక్యశ్రీలకు బంగారు వెండి పతకాలు

విన్‌శ్రీత, లౌక్యశ్రీలకు అభినందనల వెల్లువ

నవతెలంగాణ-వరంగల్:

అంతర్జాతీయ కరాటే పోటీల్లో రంగశాయిపేట టీచర్స్‌కాలనీకి చెందిన ప్రవీణ్ కుమార్-శ్రీకల కూతురు తండ విన్ శ్రీత కు బంగారు పతకం, లౌక్యశ్రీ కి వెండి పతకాలు సాధించారు. విన్ శ్రీత, లౌక్య శ్రీలు అత్యంత ప్రతిభ కనబరిచి కుమ్మితే విభాగంలో బంగారు వెండి పతకాలు సాధించారు. ఇటీవల గోవాలో జరిగిన అంతర్జాతీయ స్థాయి జూనియర్ కరాటే పోటీల్లో అండర్-9 సంవత్సరాల విభాగంలో పరాయి దేశం క్రీడాకారులతో తలపడి బంగారు, వెండి పథకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ తూముల పరమేష్ తెలిపారు. వీరు గత ఐదు సంవత్సరముల నుండి శిక్షణ పొందుతున్నారని మాస్టర్ తెలిపారు. ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు ఈ పోటీలు గోవాలోని పెండెం స్టేడియంలో నిర్వహించినట్లు పరమేష్ మాస్టర్ తెలిపారు. విన్ శ్రీత, లౌక్య శ్రీలు గతంలో రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి కరాటే పోటీల్లో వివిధ విభాగాల్లో బంగారు పతకాలు సాధించినట్లు పరమేష్ కరాటే అకాడమీ చైర్మన్ మాస్టర్ తూముల పరమేష్ తెలిఆరు. విన్ శ్రీత, లౌక్యశ్రీ లకు బంగారు, వెండి పథకాలు సాధించినందుకు తెలంగాణ రాష్ట్ర షోటోకాన్ అధ్యక్షులు ఊరుగొండ చంద్రశేఖర్, సీనియర్ మాస్టర్లు తెలంగాణ పోలీస్ కరాటే కోచ్ పాయం సురేష్, గణపాక రవి, బైరి మహేందర్, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ చీకటి సమ్మయ్య, జాతీయ ఫోటోగ్రఫీ అవార్డు గ్రహీత వనం శరత్‌బాబు, కరాటే మాస్టర్ బైరి మహేందర్‌లు విద్యార్థిని విన్ శ్రీత, లౌక్యశ్రీలను అభినందించారు.

వరల్డ్ కప్ కరాటే పోటీల్లో.. సంజయ్ సచిన్‌కు గోల్డ్ మెడల్ ప్రధానం



నవతెలంగాణ-వరంగల్:

వరల్డ్ కప్ కరాటే పోటీల్లో వరంగల్ పట్టణానికి చెందిన తాటికొండ సంజయ్ సచిన్ అత్యంత ప్రతిభ కనబరిచి కుమ్మితే విభాగంలో బంగారు పతకం సాధించాడు. ఇటీవల గోవాలో జరిగిన అంతర్జాతీయ స్థాయి జూనియర్ కరాటే పోటీల్లో అండర్-10 సంవత్సరాల విభాగంలో విదేశీ క్రీడాకారుడుతో తలపడి గోల్డ్ మెడల్ సాధించినట్లు కరాటే కోచ్ తూముల పరమేష్ తెలిపారు. ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు ఈ పోటీలు గోవాలోని పెండెం స్టేడియంలో నిర్వహించినట్లు పరమేష్ మాస్టర్ తెలిపారు. సంజయ్ సచిన్ గతంలో రాష్ట్రస్థాయి జాతీయస్థాయి కరాటే పోటీల్లో వివిధ విభాగాల్లో బంగారు పతకాలు సాధించినట్లు పరమేష్ కరాటే అకాడమీ మాస్టర్ తూముల పరమేష్ తెలిపారు. సంజయ్ సచిన్ బంగారు పతకం సాధించినందుకు తెలంగాణ రాష్ట్ర షోటోకాన్ అధ్యక్షులు ఊరుగొండ చంద్రశేఖర్, స్థానిక కార్పొరేటర్ గుండు చందనాపూర్ణచందర్, గంగపుత్ర సంఘం ఉపాధ్యక్షుడు బైరి మహేందర్, సీనియర్ మాస్టర్లు గణపాక రవి, రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ చీకటి సమ్మయ్య, జాతీయ ఫోటోగ్రఫీ అవార్డు గ్రహీత వనం శరత్‌బాబులు సంజయ్ సచిన్‌ను అభినందించారు.

న్యుమోనియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ- చెన్నారావుపేట

పిల్లలు న్యుమోనియా వ్యాధి పట్ల అప్రమత్తంగా వుండాలని డాక్టర్ సరోజ అన్నారు. ఆయుష్మాన్ ఆరోగ్య శివిర్, సాన్స్ కార్యక్రమంలో భాగంగా గురువారం సూరిపల్లి గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడారు చంటి బిడ్డలకు చల్లని ఆహార పదార్థాలు, చల్లని పానీయాలు ఇవ్వకుండా ఉండాలని సూచించారు. పిల్లలు దగ్గు, జ్వరం, ఆయాసంతో బాధ పడితే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స అందించాలన్నారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కీర్య, రెండవ ఏఎన్‌ఎం సుధారాణి, అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, నిర్మల, సాంబలక్ష్మి పులమ్మ ఆశా కార్యకర్తలు కరుణ, హైమ, అరుణ, శ్రీలత పాల్గొన్నారు.

మౌళిక సదుపాయాల కల్పన కోసం కృషి

నవతెలంగాణ-పర్వతగిరి



గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్ అన్నారు. మండలంలోని ఎబీ తాండాలో రోడ్డు మరమ్మత్తులను ఆయన పరిశీలించారు. ఎబీ తండా నుండి ఉట్టి తండా, బోటిగాడి తండా, పోయే దారిలో ముళ్ళ పొదలు, చెట్ల తుప్పలను, గత వారం రోజుల క్రితం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి సొంత ఖర్చుతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌళిక సదుపాయాల గురించి స్థానిక ఎమ్మెల్యే కేఆర్‌నాగరాజు తో మాట్లాడి ఎబీ తండా గ్రామంలో ఉన్న పలు తండాలకు సీసీరోడ్లు, తార్ రోడ్లు అనేక సంక్షేమ పథకాలు అందే విధంగా చేస్తామని శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు రవి, సీనియర్ నాయకులు శ్రీనివాస్, రమేష్, వడ్లకొండ మాజీ ఎంపీటీసీ అత్తి రేవతి, కిషన్ నాయక్, న్యాయవాది మాలోత్ వెంకన్నజాదవ్ నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అందరూ పాటించాలి

నవతెలంగాణ-కాశిబుగ్గ

ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకష్ణ అన్నారు. గురువారం కాశిబుగ్గ లోని శ్రీచైతన్య పాఠశాల ఆధ్వర్యంలో జరిగిన స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం సేఫ్ ఆన్ రోడ్ కార్యక్రమానికి సీఐ రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థులతో కలిసి సీఐ రామకృష్ణ వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీధర్, ప్రిన్సిపాల్ బండారి కిరణ్‌కుమార్, డైరెక్టర్ శ్రీవిద్య, రాజేశ్వర్‌రెడ్డి, తిరుమల్ రెడ్డి, వెంకటేష్, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని కొంకపాక స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాతలు సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అల్లందాసు భిక్షపతి అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొంకపాకకు చెందిన ప్రవాస భారతీయురాలు డాక్టర్ పేరాల పద్మావతి-సుధాకర్‌రావు ప్రతీ సంవత్సరం అంద చేసినట్లు గానే ఈ సంవత్సరం కూడా విద్యార్థినీ విద్యార్థులకు రూ.70 వేల విలువ గల ఉపకార వేతనాలు, తరగతి గది టేబుళ్ళు, వంటగది, ముందు రేకుల షెడ్డు ఏర్పాటు, లైబ్రెరీ పుస్తకాలుఅందజేశారు. అందజేశారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడారు. పాఠశాల అభివృద్ధి కోసం దాతలచే అందించినటువంటి సహకారాన్ని సద్వినియోగపరుచుకొని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈకార్యక్రమానికి వెనిశెట్టి కృష్ణమూర్తి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ వర్కాల రమేష్, మాజీ ఎంపీటీసీ మోహన్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు లింగమూర్తి, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, రఘు ప్రసాద్, పాషా, లలిత తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారాల తోనే ఆర్థిక ప్రగతి

నవతెలంగాణ-పర్వతగిరి



చిరు వ్యాపారాల తోనే ఆర్థిక ప్రగతి సాధించవచ్చని తురుకల సోమారం మాజీ ఎంపీటీసీ మహ్మద్ అలీ అన్నారు. గ్రామంలో ఎస్‌కే. అక్బర్‌పాషా కు చెందిన హెచ్ కేజీఎస్ చికెన్ సెంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చౌటపల్లి సొసైటీ డైరెక్టర్ మట్టపెల్లి అమృతరావు, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు బానోత్ భాస్కర్ నాయక్, మాజీ ఎంపీటీసీ సరోజన లచ్చు నాయక్, మాజీ సర్పంచ్‌లు ఏర్పుల శ్రీనివాస్, బానోత్ వెంకన్ననాయక్, రాపాక రేణుక నాగయ్య, పిడుగు రేణుక సాయిలు, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్‌కే. యాకుబ్ పాషా, వడ్లకొండ శ్రీనివాస్, వేమూనూరి సదానందం, ఎస్సీ సెల్ మండల నాయకులు చల్ల వెంకన్న, చల్ల శేఖర్, మజీద్ అధ్యక్షులు ఎస్‌కే.సర్దార్, మురారిశెట్టి మహేష్, డీలర్ల సంఘం మండల అధ్యక్షులు గడ్డం బాబు, మైనార్టీ నాయకులు సయ్యద్ అర్షద్ బాబా, సోని అహ్మద్, ఎక్బాల్, అహ్మద్ దుద్దు రాజు, జమాల్ పురం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జున్ను కనకయ్య, కారింగుల అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా.. బాలల దినోత్సవ వేడుకలు..













నవతెలంగాణ-వరంగల్

వరంగల్ అండర్ రైల్వే గేట్ కరీమాబాదు న్యూ కౌటిల్య ఉన్నత పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా విధులను నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా పాఠాలను విద్యార్థులకు బోధించారు. ఈకార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు కోడం శ్రీధర్, ప్రిన్సిపాల్ సబితా, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి:

మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో చాచా నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకొని నెహ్రూజీ చిత్రపటానికి పూలమాలవేసి ఎంతో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. మండలంలోని ప్రతి పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పిల్లలకు ఆటలు, పాటలు, వ్యాసరచన, డ్రాయింగ్, వకృత్వపోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా పిల్లలు ఆడి పాడి ఉత్సాహంగా బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. మండల కేంద్రంలోని కారుణ్య జ్యోతి పాఠశాల, ఆదర్శవాణి పాఠశాల, రుద్రగూడెం కాకతీయ బ్రిలియంట్ స్కూల్‌లో చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నెహ్రూ దేశానికి చేసిన సేవను పిల్లలకు తెలియజేశారు. పిల్లలంటే నెహ్రూజీకి ఎంత ఇష్టమో వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావు పేట:

మండల కేంద్రంలోని సిద్ధార్థ గురుకుల పాఠశాలలో బాలల దినోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. గురువారం పాఠశాల ఆవరణలో చాచా నెహ్రూ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అండెం కరుణాకర్‌రెడ్డి నెహ్రూ అందించిన సేవల గురించి విద్యార్థులకు తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు జక్కుల జగదీశ్వర్, వల్ల వేణు, గణేష్, కొండపర్తి కృష్ణమోహన్, రమేష్, చేరాలు, వెంకటేశ్వర్లు, బద్రు, వీరాచారి, నవీన్, బాలరాజు, కళ్యాణ్, విష్ణు, కవిత, స్వప్న, రమాదేవి, దివ్య జ్యోతి, రోజారాణి, పద్మ, శైలజ, సునీత, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాశిబుగ్గ:

లేబర్ కాలనీలోని శ్రీసాయి విజ్ఞాన భారతి హైస్కూల్‌లో గురువారం జాతీయ బాలల దినోత్సవ, నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సామల శశిధర్ రెడ్డి విద్యార్థులతో కలిసి నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా విద్యార్థినీ విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి వారికి స్వీట్స్, ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెక్కొండ:

మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జవహర్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నెక్కొండలోని సెయింట్ థెరీసా, గౌతమి విద్యానికేతన్, విద్యోదయా పాఠశాలల్లో, రెడ్లవాడలోని ఆర్డీఎఫ్ పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు ప్రధానో పాధ్యాయులుగా, ఎంఈఓగా, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులుగా వివిధ పాత్రలు పోషించి అలరించారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమాల్లో చిన్నారుల ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమాల్లో పాఠశాల కరస్పాండెంట్లు యాకుబ్ రెడ్డి, మురళీధర్, నాగార్జునరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాడు సీహెచ్.చేరాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. గత ఏడాది బాలల దినోత్సవం సందర్భంగా పలు ప్రాంతాల్లో, పాఠశాలల్లో మొక్కను నాటిన మన ప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య ఈ ఏడాది బాలల దినోత్సవం సందర్భంగా వాటి సంరక్షణ, పెంపకం బాధ్యతలు చేపట్టినట్లు చెప్పారు.

గురిజాల పాఠశాలలో..

నర్సంపేట:

మండలంలోని గురిజాల జెడ్పీ హైస్కూల్‌లో బాలల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం పెద్దిరెడ్డి అర్పిత అధ్యక్షతన ఉత్సవాలు జరిగాయి. దేశానికి బాలలు సృజన సంపదలన్నారు. బాలల్లో దాగి ఉన్న నిగూడ శక్తులను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రహరీ క్లబ్ విద్యార్థులు పలు రకాల ప్రదర్శనలతో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వాటి వల్ల నష్టాలను తెలియజెప్పారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు ఎం.చంద్రశేఖర్, ఎంఏ.సాదత్, ఏ.చంద్రకళ, ఎం.నాగమణి, ఎండీ.రాయబోస్, వి.రవికుమార్, రవీందర్, బీ.రమేష్, ఎం.రాజేశ్, సీహెచ్.సంతోష్, ఎం.రమేష్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయాలి

నర్సంపేట:

విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను ఉపాధ్యాయులు వెలికితీసి వారి భవిష్యత్‌కు పునాదులు వేయాలని ఎంఈవో కొర్ర సారయ్య అన్నారు. గురువారం పట్టణంలోని విజ్‌డమ్ హైస్కూల్‌లో నిర్వహించిన స్వయంపాలన దినోత్సవంలో ముఖ్య అతిథిగా ఎంఈవో మాట్లాడుతూ స్వయం పాలన దినోత్సవం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించవచ్చన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి రాబోయే పరీక్షలకు సంసిద్ధులు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభను కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల డైరెక్టర్ ఎస్‌డీ జావెద్, కరస్పాండెంట్ ఎస్‌డీ.జహంగీర్, అడ్మినిస్ట్రేటివ్ ఇన్‌చార్జి నాజియా ఇక్బాల్, వైఎస్ ప్రిన్సిపాల్ ప్రకాష్, ప్రీస్కూల్ ప్రిన్సిపాల్ ఫహీం సుల్తానా తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాత్‌ఫైండర్ స్కూల్‌లో..

పాత్‌ఫైండర్ స్కూల్‌లో స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యహరించి ప్రతిభను చాటారు. ఉత్తమ పాత్ర పోషించిన పలువురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ గోనెల రజిత, భిక్షపతి, వైస్ ప్రిన్సిపాల్ దొమ్మటి అనూష, ఉపాధ్యాయులు బ్రహ్మయ్య, జగదీశ్వర్, రవీందర్, సతీష్, సాయికుమార్, జీవన్, రేణుక, రజిత, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సర్వే లో ప్రజలు పూర్తి సమాచారం అందించాలి

నవతెలంగాణ-నెక్కొండ



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణనకు ప్రజలు సహకరించి పూర్తి సమాచారాన్ని ఎన్యూమరేటర్లకు అందించాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ కోరారు. మండలంలోని సూరిపల్లి గ్రామంలో ఇంటింటి సర్వేను గురువారం ఎన్యూమరేటర్లతో కలిసి ఎంపీడీవో పరిశీలించారు. ప్రజల కోసం ప్రభుత్వం చేపట్టిన సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా పూర్తి సమాచారాన్ని నమోదు చేయించుకునే బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. నమోదు చేయడానికి వచ్చిన అధికారులకు ప్రజలు అందుబాటులో ఉండి సరైన సమాచారం ఇచ్చి సహకరించాలన్నారు. సర్వే జరుగుతున్న తీరు పరిశీలించి ఎన్యూమరేటర్లకు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమం లో ఎన్యూమరేటర్లు కర్ర యాకుబ్ రెడ్డి, ఎఎస్ఓ హనుమంతు పాల్గొన్నారు.

80 కిలోల బెల్లం పట్టిక స్వాధీనం

ముగ్గురిపై కేసు నమోదు

నవతెలంగాణ- నెక్కొండ



అక్రమంగా బెల్లం, పట్టిక నిల్వచేసి విక్రయిస్తున్నారని సమాచారం మేరకు దాడులు చేయగా 80 కిలోల బెల్లం, రెండు కిలోల పటికను పట్టుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. మండలంలోని రేలవాడకు చెందిన కొడితల్ కిరణ్ కుమార్ అక్రమంగా నిల్వ చేసిన బెల్లం, పటికను స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనపరచుకున్న బెల్లం, పట్టిక విలువ రూ.32 వేలు ఉంటుందన్నారు.

రేషన్ బియ్యం ద్విచక్ర వాహనం స్వాధీనం

అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉన్న సమాచారం మేరకు తనిఖీలు చేయగా అప్పలరావుపేటలో గోనె ఆనందం రైస్ మిల్లుకి ఓవ్యక్తి ద్విచక్ర వాహనంపై పీడీఎస్ బియ్యం తీసుకువచ్చాడు. మండలంలోని మడిపల్లికి చెందినబాలోతు హరి సింగ్ ఎక్సెల్ బండిపై రెండు గంటల బియ్యాన్ని మిల్లుకు తీసుకురాగా పట్టుకున్నట్లు చెప్పారు. గోనె ఆనందం, బానోతు హరిసింగ్ వద్ద రెండు క్వింటాళ్ల బియ్యం, ఒక టీవీఎస్ ఎక్సెలల్‌ను స్వాధీన పరుచుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండాలి

ఎంపీడీవో నల్ల శ్రీవాణి

నవతెలంగాణ-చెన్నారావుపేట



విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో ముందంజలో ఉండాలని చెన్నారావుపేట ఎంపీడీవో నల్ల శ్రీవాణి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ప్రపంచ బాలల దినోత్సవాన్ని నేషనల్ హ్యూమన్ రైట్స్, చిల్డ్రన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల స్పెషల్ ఆఫీసర్ మెట్టుపల్లి జ్యోతి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిడిఓ శ్రీవాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో ముందంజలో ఉండాలని సూచించారు. అంతేకాక విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు తీవ్రంగా కృషి చేయాలన్నారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజే శారు. ఈకార్యక్రమంలో కలాం ఫౌండేషన్ చైర్మన్ భాషుమియా, హ్యూమన్ రైట్స్, చిల్డ్రన్ ఆర్గనైజేషన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి నర్మెట యాదగిరి, ఉపాధ్యక్షులు అశోక్, ఉపాధ్యాయిలు పల్లవి, రాజ్యలక్ష్మి,యశోద, తేజస్విని, రజిని, సుజాత, కవిత, పీఈటీలు నరసింహస్వామి, మంజుల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ 108 వాహన తనిఖీ

నవతెలంగాణ-నెక్కొండ



నెక్కొండ మండల కేంద్రంలోని అత్యవసర అంబులెన్స్ 108 వాహనాల్లోని పరికరాలు, మందులు, రికార్డులను వరంగల్ జిల్లా ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ రాజ్ కుమార్ తనిఖీ చేసి రికార్డులు పరిశీంచారు. వైద్య సేవల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచిస్తు సిబ్బంది అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అత్యవసర సమయాల్లో ప్రజలు 108 సేవలను ఉపయోగించుకోవాలన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

నవతెలంగాణ-నర్సంపేట

బాలల దినోత్సవంలో బాలల హక్కుల వారోత్సవాల కార్యక్రమంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. గురువారం పట్టణంలోని సంజీవిని ఆశ్రమంలో 'బాలల హక్కుల పరిరక్షణ' అనే అంశంపై, పర్యావరణ పరిరక్షణ' అనే అంశంపై చిత్ర లేఖనం పోటీలలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మాతృ భూమి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ ఏ.మోహన్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ పాటవాలు వెలికితీసేందుకు ఈపోటీలు దోహదపడుతాయన్నారు. ఈపోటీల్లో గెలిచిన విద్యార్థుకు ఈ నెల19న ఆశ్రమంలో నిర్వహించనున్న చైల్డ్ రైట్ అడ్వకేసీ నెట్ వర్క్ ఎన్‌జీవోల సమక్షంలో బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఈపోటీలలో తొమ్మిది పాఠశాలలకు చెందిన 156 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ట్రస్టు నిర్వాహకులు అర్షనపెల్లి విమల మోహన్‌రావు, రిటైర్డ్ టీచర్ కుసుమ భద్రయ్య, స్వయంకృషి సంస్థ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మధుమేహం వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు తీసుకోవాలి

నవతెలంగాణ-నర్సంపేట

మధుమేహంతో బాధపడుతున్న వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ లెక్కల విద్యాసాగర్ రెడ్డి అన్నారు. గురువారం ప్రపంచ మధుమేహం దినోత్సవం సందర్భంగా పవన్ నర్సింగ్ హోంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి సూచనలను ఇచ్చి మందులను అందజేశారు. ఈసందర్భంగా 20 సంత్సవరాలుగా పవన్ నర్సింగ్ హెూమ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తూ మందులను పంపిణీ చేస్తుందని తెలిపారు.



అధికారులపై దాడి..హేయమైన చర్య

కలెక్టరేట్ లో ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గజ్జల రామ్ కిషన్



నవతెలంగాణ-వరంగల్

ప్రభుత్వ అధికారులపై దాడికి దిగడం హేయమైన చర్య అని జేఏసీ చైర్మన్ గజ్జల రామ్ కిషన్ అన్నారు. వికారాబాద్ జిల్లాలో లాగచెర్ల గ్రామంలో నిర్వహించిన గ్రామసభ కార్యక్రమంలో ఫార్మా విలేజ్ కి సంబంధించిన ల్యాండ్ విషయంలో అక్కడి ప్రజలు జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకుపై చేసిన దాడికి నిరసనగా వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయం లో నిరసన కార్యక్రమాన్ని తెలంగాణ (ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయన,పెన్షనర్ల, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్, ఉద్యోగుల, జాయింట్ యాక్షన్ కమిటీ) ఉద్యోగులు జేఏసీ వరంగల్ జిల్లా పక్షాన నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మానికి జిల్లా జేఏసీ చైర్మన్ గజ్జల రామ్ కిషన్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన అధికారుల పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రభుత్వం ఏది ఆదేశిస్తే దానికి అనుగుణంగా పనిచేయడం ప్రభుత్వ ఉద్యోగుల పని అని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలలో తీసుకెళ్తున్న బాధ్యత కూడా ప్రభుత్వ ఉద్యోగులదేనని అటువంటి వారిపై దాడి చేయడం సరైందికాదన్నారు. అన్నారు. దాడి చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలలన్నారు. ఇకముం దు ఉద్యోగులపై ఎటువంటి దాడులు జరిగిన జేఏసీ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ట్రెసా జిల్లా అధ్యక్షులు రాజ్ కుమార్, సీపీఎస్ ఉద్యోగుల రాష్ట్ర కో కన్వీనర్ వెంకటస్వామి టీఎన్జీవో జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, ట్రెస్సా రాష్ట్ర అధ్యక్షులు రియాజుద్దీన్,నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు సాంబయ్య, టీఎన్జీవో జిల్లా కోశాధికారి పాలకుర్తి సదానందం, జిల్లా ఉపాధ్యక్షులు రామానుజన్ జగదీశ్వర్, గద్దల రాజు, దుర్గారావు, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెనమాల నర్సయ్యకు మాతృవియోగం..

నాయకుల పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి

మండల కేంద్రం లో కాంగ్రెస్ పార్టీ టౌన్ ఉపాధ్యక్షులు చెనమాల నర్సయ్య తల్లి చెనమాల ఎల్లమ్మ గురువారం మృతి చెందగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జాటోతు శ్రీనివాస్ నాయక్, ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు, గ్రామ పార్టీ అధ్యక్షులు కూసం రాంచందర్, సొసైటీ డైరెక్టర్ గంగాధర్ రావు, నాయకులు సునీల్ రావు, మాజీ బొట్ల మహేంద్ర, వంగ సాయికృష్ణ, రావుల రాజు, బొట్ల వెంకన్న, కనకరాజు చెనమాల నర్సయ్యను పరామర్శించారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ - పర్వతగిరి

మండల కేంద్రంలో జిల్లా ధర్మయ్య అధ్యక్షతన గురువారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసమావేశానికి ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు, ఎంఎస్‌పీ అండ్ ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జ్ బిర్రు మహేందర్, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ అండ్ ఎంఎస్‌పీ నూతన మండల కమిటీలను నియమించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులుగా బర్ల యాకయ్య, అధికార ప్రతినిధి జిల్లా ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి మచ్చ రవి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంఎస్‌పీ మండల అధ్యక్షులుగా జిల్లా రవి, మాదిగ యువసేన మండల అధ్యక్షులుగా సంకినేని అనిల్‌లు ఎన్నికయ్యారు. ఈకార్యక్రమంలో నాయకులు జంగిలి బాబు, చినపాక శ్రీనివాస్, చిన్నపాక వెంకటయ్య, డాక్టర్ జిల్లా శ్రీనివాస్, గిద్ద సారయ్య, బొట్ల కనకరాజు, బొట్ల భాస్కర్, ఆర్షం దగ్గ స్వామి, ఉప్పస్వామి, ఉప్పలయ్య, శ్రీకాంత్ దితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ పై దాడికి రెవెన్యూ ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-సంగెం



వికారాబాద్ జిల్లాలో జిల్లా కలెక్టర్, ఉద్యోగులపై జరిగిన దాడికి నిరసనగా, రెవెన్యూ ఉద్యోగులకు సంఘీభావంగా తెలంగాణా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ అధ్వర్యంలో గురువారం సంగెం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జి.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో లతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ జి.రాజ్ కుమార్, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, గిర్దావర్‌లు శారద, బాలాజీ, జూనియర్ అసిస్టెంట్లు జి.నరేందర్, డి.రాజేశ్వరి, రికార్డ్ అసిస్టెంట్లు ఎల్.సుధాకర్, మేదరి యాకయ్య, కార్యాలయ సిబ్బంది నిర్మల, రాణి, శాంత, సుదీర్, నవీన్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

నవతెలంగాణ-సంగెం



బాలల దినోత్సవం (జవహర్ లాల్ నెహ్రూ జయంతి) సందర్భంగా 42వ డివిజన్ రంగశాయిపేటలో గల అరవింద పబ్లిక్ స్కూల్ లో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గా ఇత్రత్ ఆనమ్ ఫాతిమా, ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ గా ఎస్ సుధీర్, పీఈటీగా బి.లోకేష్, 17 మంది విద్యార్థులు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ప్రిన్సిపాల్ పంచకం రమాదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారి అనుభవాలను అందరితో పంచుకున్నారు. ఈకార్యక్రమంలో కరస్పాండెంట్ పంచకం నర్సయ్య ఉపాధ్యాయురాళ్లు కె అశ్విని, ఎ.నర్మద, కె దివ్యశ్రీ, యాస్మిన్, జె.స్వప్న, కె.రజిత, అఫ్రీన్, సిమ్రాన్, ఎ.సుష్మిత, హెచ్.స్పందన, విద్యార్థిని విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏకశిలా హైస్కూల్లో బాలల దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

ఏకశిల హైస్కూల్లో బాలల దినోత్సవం స్వయం పరిపాలక దినోత్సవ వేడుకలు ప్రతి ఏడాది నవంబర్ 14 చాచాజీ పుట్టినరోజు పిల్లలకు ప్రత్యేకమైన రోజు పిల్లలకు పండుగ రోజు ఆయన బాలల దినోత్సవ వేడుకలను కేయూసీ రోడ్ హన్మకొండ నందుగల ఏకశిల హైస్కూల్లో ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఏకశిల ప్రిన్సిపాల్ శైలజ రెడ్డి చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చిన్నారులు చాచా నెహ్రూ వేషాధారంతో ముస్తాబయి వచ్చి ప్రదర్శనలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరీ తిరుపతి రెడ్డి పిల్లలు నుద్దేశించి మాట్లాడుతూ నేటి బాలురే రేపటి భావి భారత పౌరులని కావున పిల్లలందరూ విద్యాబుద్ధులతో పాటు విలువలను కూడా నేర్చుకోవాలని ఆకాంక్షించారు. నెహ్రూ సూచించిన విధంగా బాలలందరూ భావిభారత భవిష్యత్తుకు మూలాధారం కావాలన్నారు. పిల్లలు అంటే ఇష్టపడే మన చాచా నెహ్రూ చిత్రపటానికి చిన్నారులు గులాబీ పూలతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని విద్యార్థినీ విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం గా జరుపుకోవడం జరిగింది. పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం జరిగింది. చివరగా స్వయం పరిపాలక దినోత్సవంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏకశిల డైరెక్టర్ బేతి కొండల్ రెడ్డి , ప్రిన్సిపాల్ బేతి శైలజ రెడ్డి , ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడికి ఫిర్యాదు

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



డాక్టర్ వినీతనాయిని (రిటైర్డ్) డాక్టర్ అంజన్‌రావు అనే ఒప్పంద అధ్యాపకులు తమకు సంబంధం లేని విషయాలలో జోక్యం చేసుకొని కేసులువేస్తూ తమని మానసికంగా ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని నేషనల్ ఎస్టి కమిషన్ కు 2010 బ్యాచ్ ఎస్టి అధ్యాపకులు ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కు పలుమార్లు వీరిపై చర్యలు తీసుకోవాలని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన అడ్మినిస్ట్రేషన్ ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు నేషనల్ ఎస్టి కమిషన్ కు విన్నవించారు. 2010 సంవత్సరంలో న్యాయబద్ధంగా రిక్రూట్మెంట్ అయిన మమ్మల్ని మా డిపార్ట్మెంట్ లతో సంబంధంలేని వినితారెడ్డి అంజన్ రావులు మమ్మల్ని మానసికంగా హింసిస్తూ తప్పుడు కేసులు వేస్తూ మాపై కోర్టుల చుట్టూ మమ్మల్ని తిప్పుతూ మా యొక్క విధులకు ఆటంకం కలిగిస్తూ అనవసరమైన విషయంపై చర్చలు లేవనెత్తి మమ్మల్ని చిత్రహింసలకు గురి చేస్తున్నారు. దీనిపై యూనివర్సిటీ పర్యటనకు వచ్చేసిన నేషనల్ ఎస్టీ కమిషన్ నెంబర్ జాటోత్ హుస్సేన్ నాయక్ ఫిర్యాదు చేయడం జరిగింది. మా విషయంలో మరొకసారి ఇతరులు జోక్యం చేసుకోకుండా వారిపై , వారికి సహకరిస్తూ మమ్మల్ని మానసిక వేదనకు గురి చేస్తున్న ఇతరులపై చర్యలు తీసుకునే విధంగా మీ నిర్ణయం ఉండాలని విన్నవించాము.

అంబేద్కర్ అభయస్తం రుణాలు మంజూరు చేయాలి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన తరువాత నాగరిగారి ప్రీతమ్ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ హోదాలో మొదటిసారిగా హన్మకొండ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఇల్లందులరాజేష్ ఖన్నా మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి మాదిగ జాతి బిడ్డకు ఆత్మ గౌరవం ఐన డప్పు ని బహుకరించారు. ఈ సందర్భంగా ఇల్లందుల రాజేష్ ఖన్నా మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎస్సీ కార్పొరేషన్ నిధులను విడుదల చేయకుండా పేపర్ లకు మాత్రమే పరిమితం చేశారని ఇప్పుడు అలాకాకుండా మాదిగ, మాదిగ ఉపకులాల అందరికీ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అంబేద్కర్ అభయస్తం ద్వారా రుణాలు మంజూరు చేయాలని వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మేడ స్వామి, పోగుల రాకేష్,జన్ను సంజీవ్, శ్రీకాంత్, విజయ్‌కాంత్, జోషఫ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్యకు స్వాగతం

నవతెలంగాణ-సుబేదారి



నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించి హనుమ కొండ కలెక్టరేట్‌ను సందర్శించిన సందర్భంగా డిఎంహెచ్ఓ డాక్టర్ అల్లం అప్పయ్యకు ఉమ్మడి వరంగల్ జిల్లాల 108 ప్రోగ్రాం మేనేజర్ పాటి శివకుమార్ స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అల్లం అప్పయ్య అత్యవసర సేవల 108 వాహనాల గురించి వాటి సర్వీసు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో 108 జిల్లా కోఆర్డినేటర్ మరిజ లక్ష్మణ్, తెలంగాణ రాష్ట్ర 108 ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లకావత్ బాలాజీనాయక్ ,ఏనుగు రాజు డాక్టర్లు, వైద్య సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు : సీఐ

నవతెలంగాణ-ఎల్కతుర్తి



మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ఎస్సై గోదరి రాజ్ కుమార్ సూచించారు. చిల్డ్రన్స్ డేను పురస్కరించుకొని కార్మెల్ పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలతో వచ్చే అనర్థాలపై విద్యార్థులు ఆలోచింపజేసేలా వేషధారణతో ప్రదర్శన ఇచ్చారు. జాతీయ నాయకుల వేషధారణతో ఆకట్టుకున్నారు. పలువురు నల్ల రంగు దుస్తులతో 'సే నో టు డ్రగ్స్' ప్లకార్డులు ప్రదర్శించారు. డ్రగ్స్ తో కలిగే నష్టాలపై విద్యార్థుల నాటకం ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా చిన్నారులకు సీఐ బహుమతులు అందించారు. అనంతరం సీఐ పులి రమేష్ మాట్లాడుతూ, డ్రగ్స్ సమాజానికి పట్టిన చీడపురుగు అని, దానిని ఆదిలోనే నిర్మూలించాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. మత్తుకు బానిసై ఎంతోమంది యువత, విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ మత్తులో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ, తమ జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారని తెలిపారు. విద్యార్థులు మత్తు, మద్యం తదితర వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగించినట్లు, విక్రయించినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం మనమందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు విద్యార్థులను ఎల్లప్పుడూ గమనిస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చారణ గురువులు ఫాదర్ జాన్ పాల్ రెడ్డి, కార్మెల్ స్కూల్ ప్రిన్సిపాల్ లెస్సెల్, సిస్టర్ వినీత, సిస్టర్ గ్రేస్ మరియా, అర్చన, జైరాజ్, ఉపాధ్యాయులు, హెడ్ కానిస్టేబుల్ విఠల్, బక్కయ్య, కానిస్టేబుల్ సారంగపాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

శాయంపేటలో డ్రగ్స్ నిర్మూలనపై ర్యాలీ

శాయంపేట : మండల కేంద్రంలోని నవోదయ పాఠశాల విద్యార్థులు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం డ్రగ్స్ నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మామిడి అనురాధ, ప్రిన్సిపాల్ మామిడి పద్మ మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు మత్తు పదార్థాలకు బానిసై తమ ఉజ్వల భవిష్యత్తును సర్వనాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువకులు చెడు వ్యసనాల బారిన పడకుండా సన్మార్గంలో పయనిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకొని కన్న తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు, పుట్టిన గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

డ్రగ్స్ వల్ల వచ్చే అనర్థాలను తెలియజేస్తూ నినాదాలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివకుమార్, రాజేందర్, వెంకట్, సందీప్, స్వాతి, మౌనిక, సౌమ్య, నాగలత, ప్రసన్న, మాధవి, జయ, జ్యోష్న, విద్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

నవతెలంగాణ-సుబేదారి



అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా గురువారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి హనుమకొండ 49వ డివిజన్ మైత్రి వనం కాలానిలో రూ. 33లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అభివద్ధి పనులను కేటగిరిగా విభజించి ప్రాధాన్యత పరంగా తెలికపాటి వర్షాలకు సైతం నీట మునిగే కాలనీలను, డ్రైన్ల నిర్మాణాలు చేపడుతున్నమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దశల వారిగా ప్రతి కాలనీలను అభివీద్ధి చేసే బాధ్యత నాది అని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం లో 49 డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్ , కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు ఏనుగుల దయాప్రసాద్, అభిమానులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆత్మకూరు

మండలంలోని పెద్దపూర్‌లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రారంభించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, గత ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని అన్నారు. ఏ గ్రేడ్‌కు రూ. 2320, కామన్ రకానికి రూ.2300 ధర చెల్లిస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం 17శాతం మాయుచర్ ఉండాలి అని అన్నారు. నిబంధనల మేరకు తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని, లారీలలో మిల్లుల కు తరలించిన ధాన్యాన్ని అన్లోడ్ చేసే దగ్గర జాప్యం జరగకుండా చూడాలనీ సూచించారు.

కేవలం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో మాత్రమే సన్నధాన్యానికి బోనస్ లభిస్తుందన్నారు. రైస్ మిల్లులో విక్రయాలకు బోనస్ వర్తించదని ప్రతి ఒక్క రైతుకు ఈ విషయంపై అవగాహన కల్పించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రవాణ, హమాలీల, గోనె సంచుల కొరత రాకుండా చూడాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రమేష్, పిఎ సిఎస్ పెద్దాపూర్ చైర్మన్ బొల్ల రాజు రెడ్డి, వైస్ చైర్మన్ అంబటి రాజస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు పరికరాల వాసు, బరిపట్ల కిరీటి, మాజీ వైస్ఎంపీపీ ముద్దం సాంబయ్య, జిల్లా నాయకులు మర్కా రజనీకర్, కక్కెర్ల రాజు, ఏరుకొండ రవీందర్, బోరింగ్ స్వామి, ముద్దం కష్ణరాజు, మాజీ సర్పంచ్లు పర్వతగిరి రాజు, కంచ రవికుమార్, ఎంకతాల హంసలు, సురేష్, డిసిఓ సునీత, తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏఈఓ ప్రవళిక, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ నెల 30న పౌర హక్కుల రోజు జరపాలి : కేవీపీఎస్

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

ప్రతి నెల 30 న పౌరహక్కుల రోజుని జరపాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సంపత్ ప్రభుత్వాన్ని కోరారు.గురువారం రోజున కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం హనుమకొండ సౌత్ మండల కార్యదర్శి దూడపాక రాజేందర్ ఆధ్వర్యంలో తాసిల్దార్ కు వినతి పత్రం ఇచ్చే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మంద సంపత్ మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో ప్రభుత్వా ఏర్పడ్డ నాటినుండి ఎస్సీ ఎస్టీలపై అనేక రకాల వివక్షత రూపాలు కొనసాగుతూనే ఉన్నాయి అని ప్రభుత్వాలు అధికారులు జరుగుతున్న సమస్యల పరిష్కారం కోసం కషి చేస్తున్న భారత రాజ్యాంగం పట్ల పౌరుని యొక్క హక్కుల పట్ల అవగాహన లేకపోవడం వల్ల కులాల పేరుతో, మతాల పేరుతో ఒక మనిషిని ఒక మనిషి విమర్శించే పరిస్థితులు కులం పేరుతో దాడులు కులం పేరుతో గ్రామ బహిష్కరణలు ప్రేమ వివాహాలు చేసుకుంటే కులం తక్కువ వాడని హత్యలు దళిత మహిళలపై అత్యాచారాలు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయి కావున భారత రాజ్యాంగంలోని 14వ అధికరణ ప్రకారం అందరు సమానులే అన్న ఆలోచనలు తీసుకురావాలి ప్రతినెల సివిల్ రైట్ రోజును, పౌరహక్కుల దినాన్ని రెవెన్యూ అధికారుల సమక్షంలో జరగకపోవడం గ్రామాలలో ఉన్న ప్రజలు అందరు సమాన మే అనే భావన లేకపోవడం వల్ల ఎక్కువ తక్కువ అనే అవమానపరచుకునే పరిస్థితిలు ఎదురవుతున్నాయని మండలంలోని గ్రామాల్లో, మున్సిపాలిటీ పరిధిలో ప్రతినెల 30న అధికారికంగా జరపక లేకపోవడం వల్ల ఇలాంటి పరిస్థితులు జరుగుతున్నాయన్నారు.



ఇప్పటికైనా 75ఏళ్ల స్వతంత్ర చరిత్రలో ఇలాంటివి జరుగుతున్న అధికారులు మనిషి మనిషిని సమానంగా చూసే పరిస్థితులను ముందుకు తీసుకుపోవాలని ఆయన కోరారు ఈ యొక్క కార్యక్రమంలో కేవీపీస్ జిల్లా నాయకులు రేణిగుంట్ల చందర్, చెడిపల్లి యాకయ్య మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ ధర్నా



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

తెలంగాణ రాష్ట్రంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన చార్జీలను పెంచాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ అన్నారు. గురువారం ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం హనుమకొండ ఎంఈఓ విజయ్ కుమార్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెరిగిన ధరలకు అనుకూలంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన మీడ్డే మిల్స్ చార్జీల ను పెంచాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు లేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులకు గదులలో ఫ్యాన్సు లేవన్నారు లైట్స్‌కూడా సరిగాలేవన్నారు. అంతేకాకుండా మధ్యాహ్నం పూట భోజనం చేశక తాగుదామంటే కనీసం త్రాగునీరు కూడా లేని పరిస్థితి మన తెలంగాణ రాష్ట్రంలో ఉంది అన్నారు అంతేకాకుండా వాష్రుమ్స్ మరుగుదొడ్లు కూడా సరిగా లేవు అన్నారు రాష్ట్రంలో కొన్ని ప్రభుత్వ పాఠశాలల భవనాలు శిథిల వ్యవస్థకు చేరాయి అన్నారు విద్యార్థులు భయభ్రాంతులతో ఎప్పుడు కులుతాయో అని భయపడుతూ చదువుకుంటున్నారన్నారు రాష్ట్రంలో విద్యారంగా సమస్యలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు పట్టించుకోవడం లేదన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి తెలంగాణ రాష్ట్రంలో సంవత్సరం దగ్గరికి వస్తున్న కూడా తెలంగాణ రాష్ట్రానికి విద్యశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్నటువంటి విద్యారంగ సమస్యల పైన స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రమైన ఆందోళనలు ఉంటాయని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని అధికారులను హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అరుణ్, అజయ్, సాయి, రాకేష్‌రెడ్డి, అభిషేక్, లెనిన్ , ఉదయ్, రాహుల్, వంశీ, సురాజ్, మధు, పవన్, మల్లేష్,అజయ్, దయాకర్, సాయి కుమార్‌పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ దామెర

బాలల దినోత్సవం పురస్కరించుకొని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో దామెర, సింగరాజుపల్లి, పులుకుర్తి, కో గీలవాయి, వెంకటాపూర్ మొదలైన గ్రామాల అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులతో పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పుట్టినరోజు బాలల దినోత్సవ సంబరాలు నిర్వహించడం జరిగినది. దామెర అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకలకు మండల విద్యాశాఖ అధికారి రాజేష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు అని అన్నారు. చిన్ననాటి నుండే మహనీయులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రాణి అంగన్వాడీ టీచర్స్ వనజ, కోమల, గౌరీ పుష్ప, రామ,వాణి, సరళ తల్లులు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవంను జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చిల్డ్రన్స్ డే ను పురస్కరించుకొని గురువారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులు భారతమాత, మహాత్మా గాంధీ, అంబేద్కర్ వేషధారణలతో ఆలరించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హెచ్ఎం శ్రీలత, ఉపాధ్యాయులు బహుమతులను అందజేశారు.

ఆర్బిట్ పాఠశాలలో...

హసన్‌పర్తి :మండలంలో ఎల్లాపూర్ గ్రామ శివారులో గల ఆర్బిట్ ఈ టెక్నో స్కూల్లో గురువారం రోజున ఘనంగా బాలల దినోత్సవం వేడుకలు, స్వయం పరిపాలన దినోత్సవంను జరుపుకున్నట్టు పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ చిట్టి రెడ్డి భగవాన్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమమును పురస్కరించుకొని పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ దేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూకు ఈ పసిపిల్లలంటే ఎంతో మక్కువని,అతని జన్మదినం రోజున మన దేశవ్యాప్తంగా ఈ బాలల దినోత్సవంను జరుపుకుంటున్నామని తెలిపారు . ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సిహెచ్ హారిక రెడ్డి అకాడమిక్ ఇంచార్జ్ వాసుదేవ రెడ్డి,మధుకర్, కళ్యాణి, సారంగపాణి, వహీదా బేగం, జావిద్ ఖాన్, షర్మిల, షఫీ, వెంకటేష్, రంజిత్, వినయ్ కుమార్, ఇంద్రాణి, అశోక్, రాహుల్ రాజ్, రాజ్ కుమార్, రూపా దేవి, శ్రీకాంత్, కష్ణవేణి, శ్వేతా రెడ్డి, ప్రశాంత్, శ్వేత, ప్రవళిక, సాయికళ్యాణ్, శ్రీనివాస్, రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

కడిపికొండ పాఠశాలలో ...

ఎస్సీవోస్ కాలనీ : విద్యాశాఖ ఆదేశానుసారం గురువారం నెహ్రూ పుట్టినరోజు పురస్కరించుకొని కడిపికొండ ప్రాథమిక పాఠశాల నందు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ,బాలల దినోత్సవాన్ని మరియు పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ను నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చుంచుకాల లింగారావు, ఉర్దూ మీడియం హెచ్ఎం జమీల బేగం, ఉపాధ్యాయిని సిరాజ్ బేగం , వంటనిర్వాహకులు లలిత,నైమ ,తల్లిదండ్రులు శ్రీనివాస్ నాగేశ్వరి కష్ణవేణి స్వరూప మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల సౌజన్యంతో విద్యార్థులకు టీ షర్ట పంపిణీ బాలల దినోత్సవం సందర్భంగా ప్రాథమిక పాఠశాల రాంపూర్ నందు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వి రామచంద్ర రెడ్డి, బి లీల రాణి,జి లక్ష్మీ, బి బ్రహ్మచారి, జె అరుణ మరియు ఆర్ స్వర్ణలత సౌజన్యంతో తమ పాఠశాలలో చదువుతున్న 80 మంది విద్యార్థులకు టీ షర్ట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుర ప్రముఖులు రాంగోపాల్ రావు ఉపాధ్యాయులను అభినందించడంతోపాటు ఇకముందు ప్రతి సంవత్సరం తరగతిలో ప్రథమ ద్వితీయ స్థానాలు వచ్చేవారికి క్యాష్ ప్రైజ్ ఇస్తానని హామీ ఇచ్చారు. దానికి ఉపాధ్యాయ బందం వారికి కతజ్ఞతలు తెలిపారు.

ఎస్ వీబీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో

ఆత్మకూరు : మండలం అగ్రంపహాడ్ గ్రామంలోని ఎస్ వి బీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ జీ రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలంటే పండిట్ జవహర్ లాల్ నెహ్రూ కు ఎంతో ప్రేమ. అందుకే పిల్లలంతా ఆయన్ను చాచా నెహ్రూ అని పిలిచేవారు. ఆయన జన్మ దినోత్సవం సందర్భంగా ప్రతి ఏడాది నవంబర్ 14 న బాలల దినోత్సవం నిర్వహించుకుంటున్నాం. బాలలకు ప్రేమను, సంరక్షణను, నాణ్యమైన విద్యను ఇవ్వడమే ఈ బాలల దినోత్సవ ముఖ్య ఉద్దేశం. ఈ బాలల దినోత్సవం సందర్భంగా స్కూళ్లల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, పోటీలు నిర్వహించి నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత

- **వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



నవతెలంగాణ-నయీంనగర్

నేటి బాలలే రేపటి పౌరులు, వారి హక్కులను కాపాడటం అందరి బాధ్యత అని శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ చైర్మన్ , కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి అధ్యక్షతన బాలల దినోత్సవం , బాలల హక్కుల వారోత్సవాలను హన్మకొండ సర్క్యూట్ గెస్ట్ హౌస్ దగ్గర లోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమం లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, పిల్లలకు నాణ్యతతో కూడిన విద్యా సౌకర్యాలు, ఆరోగ్య సౌకర్యాలు అందించడానికి తను ఎప్పుడు ముందుంటానని తెలిపారు, పిల్లల హక్కులను కాపాడటంలో తనువంతు కృషి చేస్తా అని తెలిపారు, పిల్లలకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిత , సుచరిత, వసుధ, హరిత, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి కుటుంబ సర్వే వేగం పెంచాలి

ఎంపిడిఓ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-హసన్‌పర్తి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని సర్వే చేస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వేగం పెంచాలని హసన్ పర్తి ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఆదేశించారు.కొంతమంది ఎన్యూమరేటర్ లు ఇంటింటా వెళ్లకుండా,గ్రామ కూడళ్ల వద్ద నిర్వహిస్తున్నట్లు తమ దష్టికి వచ్చిందని అన్నారు. గురువారం హసన్‌పర్తి మండలంలో పెంబర్తి సూదన్ పెల్లి,నాగారంలో ఇంటింటా సర్వేను పరిశీలించి తగు సూచనలు అందజేశారు.ప్రతి ఎన్యూమరేటర్ ప్రభుత్వ ఆదేశాల మేరకు తప్పనిసరిగా ఇంటికి వెళ్లి వివరాలు సేకరించి సభ్యుని సంతకం తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లు చిత్తశుద్ధితో సమగ్ర ఇంటింటి సర్వే లక్ష్యాన్ని నెరవేర్చాలని, గడువులోపు తమకు ఇచ్చిన కుటుంబాల వివరాలను నమోదు చేసి అందజేయాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పెంబర్తి పంచాయ కార్యదర్శి పరకాల హేమలత, ఎన్యూమరేటర్ చాతల్ల సదానందంతో పాటు ఆయా గ్రామాల కార్యదర్శులు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-నడికూడ

వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోని, మద్దతు ధర పొందాలని పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం నడికూడ మండల కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ మే కొనుగోలు చేస్తుందని, గత ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. ఏ గ్రేడ్ కు రూ.2320, కామన్ రకానికి రూ.2300 ధర చెల్లిస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం 17శాతం మాచ్చర్ ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లారెడ్డి, డిఆర్డిఏ ఏపీవో సుధీర్, డిపిఎం డిఆర్డిఏ ప్రకాష్, పరకాల ఆర్డిఓ నారాయణ, నడికూడ తహసిల్దార్ నాగరాజు, ఏపియం రమాదేవి, సీసీ కుమారస్వామి, ఐకెపి మహిళా సంఘం సభ్యులు తాళ్లపల్లి స్రవంతి,కామిద్రి లక్ష్మిపవిత్ర, శైలు, కావ్య, నార్లాపూర్ మహిళా సంఘ సభ్యులు శనిగరం స్వరూప, ఈర్ల చిన్ని, ఈర్ల సౌందర్య, శోభ, చంద్రకళ, సిసి రేణుక, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారభించిన నాయిని

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం రోజు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. హనుమకొండలోని జిల్లా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గారు జ్యోతి ప్రజ్వాలన్ చేసి కార్యక్రమాన్ని ప్రారభించారు దాదాపు వారం రోజుల పాటు సాగె వారోత్సవల్లో గ్రంథాలయ పటాకులు పాల్గొనలని, యాజమాన్యం నిర్వహించే వివిధ క్రీడా పోటీలలో పాలు పంచుకోవాలని ఎమ్మెల్యే నాయిని పిలుపునిచ్చారు. గతంలో రాజకీయ ప్రస్థానంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా పదవి చేపట్టానని నాటి ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక చొరవతో 20రూపాయలు ఉన్న ఇంటర్నెట్ సేవాలను కేవలం 5 రూపాయలకే ప్రవేశపెట్టిన విషయాన్ని గుర్తు చేశారు.

హనుమకొండ జిల్లా గ్రంథాలయాల్లో చదువుకొని ఉన్నత స్థాయిలో నిలిచినా పూర్వ విద్యార్థులు గ్రంథాలయ అభివద్ధికి ముందుకు రావాలని ఎమ్మెల్యే నాయిని పిలుపునిచ్చారు.వారం రోజుల్లో నూతన చైర్మన్ నియామకం జరగనున్నదని, అన్నివిధాలుగా గ్రంథాలయాన్ని అభివద్ధి చేస్తానని తెలిపారు. గ్రంథాలయం సిబ్బందికి వేతనాల జాప్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వ దష్టికి తీసుకువెళ్లానని త్వరలో శాశ్వత పరిష్కరం కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారని అన్నారు.

ధర్మ యుద్ధ మహాసభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కమలాపూర్

డిసెంబర్ 21 నా మాదిగల ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జన్ను దినేష్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంకిళ్ల రాజు మాదిగ అధ్యక్షతన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జన్ను దినేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఏకు శంకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ ముఖ్య అతిథులుగా హాజరై అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం నిండు అసెంబ్లీ సభలో ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఏబిసిడి వర్గీకరణ దానికి చట్టబద్ధత కల్పించే విషయమై ఈ ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని, దానిని అమలు చేస్తుందని, అవసరమైతే ప్రత్యేకమైన ఆర్డినెన్స్ తీసుకొచ్చి వర్గీకరణ చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారని, కానీ ఇప్పటివరకు నాలుగు నెలలు గడిచిపోయిందని అయినా కూడా ఇంతవరకు ఎస్సీ వర్గీకరణ విషయమై నోరు మెదపడం లేదన్నారు.

డిసెంబర్ నెలలో నిర్వహించబోయే ధర్మ యుద్ధ మహాసభను విజయవంతం చేయాలని అన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి కమలాపూర్ మండల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులుగా ముత్యాల రమేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా ఇనుముల చంద్రమౌళి మాదిగ, ఉపాధ్యక్షులుగా చెరిపెల్లి ఉపేందర్ మాదిగ, ఇసంపెల్లి రమేష్ మాదిగ, ఎం ఎస్ పి మండల అధ్యక్షులుగా కుమ్మరి రమేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శి అంకిళ్ల రాజమల్లు మాదిగ, అధికార ప్రతినిధి అంబటి భూమయ్య మాదిగ లను ఎన్నికైనట్లు తెలిపారు.

నవతెలంగాణ
మహబూబాబాద్
శుక్రవారం నవంబర్ 15, 2024
www.navatelangana.com

లగచర్ల ఘటనలో అరెస్టుల పర్వం ఆపాలి

నవతెలంగాణ-గార్ల:

నవంబర్ 11న లగచర్ల పోలేపల్లి గ్రామాల్లో ప్రజల భూములలో వారికి తెలియకుండా అనుమతులు లేకుండా ఫార్మా కంపెనీ, విషపూరితమైన కంపెనీలు ఏర్పాటు చేయడానికి వెళ్తున్న కలెక్టర్ తో పాటు సిబ్బందిని అడ్డుకున్న ప్రజలను అరెస్టు చేయడం ఆపాలని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి జడ సత్యనారాయణ కోరారు. స్థానిక గౌని వీరయ్య భవనంలో గోని భద్రయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ ఘటనలో స్వయంగా కలెక్టర్ నా పై ఎలాంటి దాడి జరగలేదని చెప్తున్నా దాడి జరిగిందని పాలకులు ప్రచారం చేస్తున్నారని, భూములు కావలసినవారు, ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలనుకునేవారు వెళ్లాలని కాని ప్రభుత్వ అధికారులు పరిశీలించడానికి వెళ్లడం ఏంటని ప్రశ్నించారు. లగచర్ల, పులిచర్ల కుంట, రోటి బండ తండా, హకీంపేట, పోలేపల్లి రైతులు భూములు ఇచ్చేది లేదని మా భూములు పోతే మా బతుకు ఆగమైపోతుందని అందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. అరెస్ట్‌ల పర్వాన్ని ఆపాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుసిని బాబురావు, నాయకులు నాదెండ్ల శ్రీనివాస్, వెంకన్న, శంకర్, గౌని మల్లేష్, మైబెల్లి, బజారయ్య, జీవీ, నరసయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నెహ్రూ జయంతి వేడుకలు

నవతెలంగాణ-గార్ల:

భారత దేశ తోలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో స్థానిక నెహ్రూ కూడలి లో గురువారం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు నెహ్రూ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మండ రాము గౌడ్, నాయకులు భూక్య అశోక్, షేక్ యాకుబ్ పాషా, చిలకబాబు, జె. శ్రీనివాస్, రామ్‌కుమార్, శారద, వెంకన్న, బాలాజీ, అశోక్, నరసింహారావు, కుమార్, మేడేపల్లి దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

వారోత్సవాల జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-గార్ల:

సహకార సంఘాల ద్వారా రైతులకు వ్యవసాయ పెట్టుబడులకు రుణాలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందిస్తూ రైతులు పండిచిన పంటలను ప్రభుత్వ మద్దతు ధరకు కోనుగోలు చేస్తూ వ్యవసాయ రంగంలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గా ప్రసాద్ అన్నారు. 71 వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా పీఏసీఎస్ అధ్వర్యంలో గురువారం సంఘం జెండాను దుర్గా ప్రసాద్ ఎగుర వేసి మాట్లాడారు. ఈకార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు గంగావత్ లక్ష్మణ్ నాయక్, డైరెక్టర్లు వై.వెంకటేశ్వరరావు, పి.వెంకటేశ్వర్లు, ఆదేపు వెంకటేశ్వర్లు, డేవిడ్, వెంకన్న, సంఘం సీఈవో సింగు వెంకటేశ్వర్లు, సిబ్బంది భీముడు, రాజేష్, రవి, చంద్ర శేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి చేయూత

నవతెలంగాణ-తొర్రూర్



లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూర్ ఆధ్వర్యంలో మండల పరిధి లోని అరిపిరాల గ్రామానికి చెందిన పేద మహిళ కుటుంబానికి స్థానిక రామచంద్ర నర్సింగ్ హోంలో గురువారం పీడీ జి.లయన్ డాక్టర్ రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా 25 కేజీల నాణ్యమైన బియ్యము, బెడ్ షీట్లు, చీరలు అందజేశారు. అలాగే కోతుల బెడద వలన ఇంటి పై భాగం పాడైపోవడంతో ఇంటి పై భాగాన్ని రక్షించుటకు ఒక టార్పాలిన్ ను అందజేశారు. ఈసందర్భంగా లయన్ రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు వారు చేస్తున్నటువంటి సేవలు అమోఘమని, ఎప్పుడు ప్రజలతో మమేకమై, వారి కనీస అవసరాలను తీరుస్తున్నందుకు అధ్యక్ష, కార్యదర్శులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నవీన్ కుమార్, తమ్మెర విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీపీఎస్ ఎర్రవరంలో.. బాలల దినోత్సవం

నవతెలంగాణ-కొత్తగూడ



మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాల పండిత జవహర్‌లాల్ నెహ్రూ జన్మదిన సందర్భంగా బాలల దినోత్సవం నిర్వహించారు. ప్రధానో పాధ్యాయులు కొడెం రామచందర్ మాట్లాడుతూ భారతదేశ తొలి ప్రధాని అయిన జవహర్‌లాల్ నెహ్రూ ను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-కొత్తగూడ

మండలం లోని దోరవారి వేంపల్లి పాఠశాలలో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని సోమవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు క్రీడాపోటీలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించి బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు పాఠశాల అభివృద్ధికై చర్చించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సువర్ణ పాక క్రిష్ణ, ఉపాధ్యాయులు అండేం క్రిష్ణారెడ్డి, అంగన్‌వాడీటీచర్ భారతి , అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పెనక చంద్రకళ, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ యువకులు పాల్గొన్నారు..

ఘనంగా నెహ్రూ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కొత్తగూడ

మండల కేంద్రం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మన భారతదేశ తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీ కేక్ ను కట్ చేసి చిన్నారులకు కార్యకర్తలకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అధికార ప్రతినిధి వజ్జ సారయ్య, బిట్ల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, గుమ్మడి సమ్మయ్య ఆదర్శ రైతు మండల అధ్యక్షులు, కష్ణ, మౌలానా, సాయి, భిక్షపతి, శ్రీను, ఈరియా యాకన్న వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముందుండాలి
డీఎస్పీ కృష్ణకిషోర్
విద్యార్థులకు బహుమతుల పంపిణీ

నవతెలంగాణ-మరిపెడ



ఆటపాటలతో పాటు విద్యార్థులు సామాజిక సేవలో ముందుండాలని, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని డీఎస్పీ కృష్ణ కిషోర్ అన్నారు. గురువారం పట్టణ శివారులో జరుగుతున్న సోషల్ వెల్ఫేర్ భద్రాద్రి కొత్తగూడెం జోనల్ 10వ క్రీడలు విజయవంతంగా ముగిశాయి. ఈ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు డీఎస్పీ చేతుల మీదుగా బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పోలీసులు సామాజిక స్పృహతో స్పందిస్తున్నారని గుర్తు చేశారు. విద్యార్థులుగా భవిష్యత్తులో మంచి ఆఫీసర్ గా రాణించాలంటే సేవ ధృక్పథంతో విద్యార్థులు మెలగాలని సూచించారు. ఈ జోనల్ క్రీడలకు 10 గురుకులాల నుండి తరలివచ్చిన విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్వో స్వరూప రాణి, ప్రిన్సిపాల్ దయాకర్, ఆమెడ అరుణశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, గురుకులాలకు చెందిన అధ్యాపకులు పి.శ్రీనివాసులు, నరేందర్, కోచ్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలుర పాఠశాలలో.. బాలల దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-బయ్యారం:

భారత దేశ మొదటి ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నవంబర్ 14 న పుట్టిన రోజును పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా తమ స్వీయ అనుభవాలను పంచుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో పీజీహెచ్‌ఎం దేవేంద్రచారి ఉపాధ్యాయులు సరోజ, ధనుంజయ్, లక్ష్మీనారాయణ, రామేశ్వరరావు, దస్తగిరి, రవీందర్, సుధాకర్, వి.శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, బి.లక్ష్మయ్య, అరుణ, శోభ కుమారి, నసీమా, విజయ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన ర్యాలీ..

నవతెలంగాణ-తొర్రూరు:

బాలల దినోత్సవం సందర్భంగా శ్రీవాణి ఎడ్యుకేషనల్ సోషల్ సర్వీస్ సొసైటీ పినాకపాణి, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వారోత్సవాలలో భాగంగా గురువారం తొర్రూరులోని స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ నుండి గాంధీ బొమ్మ వరకు బాలల హక్కులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ డాక్టర్ సుంకరనేని నాగవాణి, స్థానిక ఎస్సై రాంజీ నాయక్ అతిథులుగా పాల్గొని జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా నాగవాణి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని బాల కార్మిక వ్యవస్థను, బాల్య వివాహాల వ్యవస్థను సమూలంగా కూకటివేళ్లతో నిర్మూలించాలని, బాలల హక్కులను కాపాడి వారిని విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతూ రేపటి నవ సమాజ నిర్మాణానికి పిల్లలే ముఖ్యులు అని అన్నారు. వారి హక్కుల పరిరక్షణను కాపాడాల్సిన బాధ్యత మన అందరికీ ఉంటుందని తెలియజేశారు. ఈకార్యక్రమంలో తొర్రూర్ టీచర్స్ లయన్స్ క్లబ్ ప్రసిడెంట్ లు సురేష్, నవీన్, సెక్రటరీ సురేష్, రమేష్, ట్రెజరర్ లు వెంకన్న, వార్డెన్ మధురిమ, టీచర్ జనార్దన్, యాకయ్య, రమేష్, కరాటే మాస్టర్ రాజ్ కుమార్, విద్యార్థినిలు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ.. ఘనంగా.. బాలల దినోత్సవ వేడుకలు..









కేసముద్రంరూరల్:

కేసముద్రం మండలంలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో గురువారం బాలల దినోత్సవం సందర్భంగా స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతిరోజు స్కూల్ యూనిఫామ్ ధరించి, పుస్తకాలు చేతబట్టి పాఠశాలకు వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయుల వేషాధారణతో పాఠశాలకు వచ్చి విద్యార్థులకు విద్యాబోధన చేయడం ఎంతో ఆకట్టుకుంది. బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో గడ్డమీద నవీన్ కుమార్, ప్రిన్సిపాల్ చిర్ర నరేష్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహబూబాబాద్:

హెూలీ వర్డ్స్ హైస్కూల్ లో బాలల దినోత్సవం ఎంతో ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి ప్రధానమంత్రి డాక్టర్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా చిన్నారులు మహనీయుల వస్త్రాలంకరణలో సందడి చేశారు. చిన్నారులు నృత్యాలతో, ఉపన్యాసాతో అలరించారు. వ్యాసరచన పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎస్తేరు జయశ్రీ ఇమ్మానుయేల్, డైరెక్టర్ అనుదీప్, ప్రిన్సిపాల్ ఉదయశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ సాహితి, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మరిపెడ:

జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల సీతారాంపురంలో గురువారం నెహ్రూ జయంతి బాలల దినోత్సవం పురస్కరించుకొని పిల్లలతో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఇందులో అనేకమంది బాలబాలికలు ఆయా ఉపాధ్యాయ పాత్రను పోషించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన "చిల్డ్రన్స్ డే" సెలబ్రేషన్ లో ప్రధానోపాధ్యాయులు ఎం.రామచంద్ర విద్యార్థులను అభినందించారు. ఈకార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం సునీల్, మురళీకృష్ణ, సీహెచ్.ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయ బృందంతో పాల్గొన్నారు.

తొర్రూరు:

భారతదేశ మొట్టమొదటి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ పుట్టిన రోజు, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణ కేంద్రంలోని సిద్దార్థ హై స్కూల్ లో స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా రోజువారికి భిన్నంగా పాఠశాలకు చెందిన దాదాపు 33 మంది విద్యార్థులు వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులై తరగతులలో బోధించారు. డీఈవోగా సౌజన్య, ప్రిన్సిపాల్‌గా లోకేష్‌లు వ్యవహరించారు. బోధనా వృత్తి అన్ని వృత్తుల కంటె ఎంతో కఠినమైనదని, ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని అందుకు ఉపాధ్యాయులు ప్రతి రోజూ ఎంత సాధన చేయవలసివస్తున్నదో ఈ ఒక్క రోజు అనుభవం మాకు తెలియజేసినదని ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ముత్తినేని జయప్రకాశ్ మాట్లాడుతూ విద్యార్థులు తోటి విద్యార్థులకు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించడం గర్వకారణమన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన యాక్టింగ్ టీచర్స్ కు బహుమతులతో పాటుగా ప్రశంసా పత్రాలను అందజేశామన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ముత్తినేని సోమేశ్వరరావు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరు:

బాలల దినోత్సవం పురస్కరించుకొని పలు పాఠశాలల్లో ఘనంగా బాలల దినోత్సవాన్ని జరుపుకున్నారు మండలంలోని బేతంచెర్ల పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. పాఠశాలలో బాలల దినోత్సవం నవంబర్ 14 జవహర్ లాల్ నెహ్రూ జయంతిని, బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ముయ్యబోయిన వెంకన్న, రేగ సాంబయ్య అంగన్ వాడీ ఆయా కొట్టెం పూలమ్మ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు

అప్పరాజుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో..

మండలంలోని అప్పరాజుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సక్రు ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణంలో ఘనంగా బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. అదేవిదంగా నెహ్రూ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో మాధవ పెద్ది అమరేందర్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కవిత, ఉపాధ్యాయులు మహేందర్, దస్రులు పాల్గొన్నారు.

మారింది ప్రభుత్వమే.. విధానాలు కాదు..

టీపీటీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రవీందర్

నవతెలంగాణ-మహబూబాబాద్



పదేండ్ల ప్రజా వ్యతిరేక, నిరంకుశ బీఆర్ఎస్ పాలనకు వ్యతిరేకంగా నిర్వహించిన ప్రజా ఉద్యమాల ఫలితంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అవే విధానాలను అవలంభిస్తుందని టీపీటీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ అన్నారు. స్థానిక జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బలాష్టి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన పది జిల్లాల బాధ్యుల ఆత్మీయ కలయిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి, ఉపాధ్యాయులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను మర్చిపోయారని, విలువలను, ఆచరణను పరిగణనలోకి తీసుకోకుండా గెలుపే లక్ష్యంగా భ్రమల్లో ముంచెత్తారన్నారు. అధికార, ప్రతిపక్షాలు ఒకరినొకరు దూషించుకోవడం మినహా ప్రజలకు చేసేదేమీ ఉండడం లేదని ఆరోపించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు డి. శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్థిక శాఖ అనుమతి లేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్, సరెండర్, జీపీఎఫ్ బిల్లులను చెల్లిస్తామన్న హామీ ఎటు పోయిందని, సీపీఎస్ విధానం రద్దుకు ఇంకెన్నాళ్లు ఉద్యమించాలని ప్రశ్నించారు. బాధ్యతగా పూర్తి చేయాల్సిన ప్రతీ పనిని లోటు బడ్జెట్, అప్పుల తెలంగాణ అని చెప్పి తప్పించుకోవడం సరి కాదన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయకుండా వాటిని ఖాళీ చేసేందుకు వసతులు లేని మరిన్ని గురుకులాలను నిర్మిస్తున్నారని దుయ్యబట్టారు. ఈసమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు కవిత, భోగేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింత విష్ణువర్ధన్‌రెడ్డి, పూర్వ రాష్ట్ర బాధ్యులు ఎ.నర్సింహారెడ్డి, కె.వేణుగోపాల్, బి.కొండల్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు చుంచు శ్రీశైలం, సోమారపు ఐలయ్య జిల్లా నాయకులు బొల్లం శ్రీనివాస్, మల్లెల సాంబయ్య, తండా ప్రభాకర్, రాచకొండ ఉపేందర్, సంగ శ్రీనివాస్, కొండం జనార్దన్, పెండ్లి రవీందర్‌రెడ్డి ఖమ్మం, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, మెదక్, నిజామాబాద్, వనపర్తి, నాగర్ కర్నూల్, హైదరాబాద్, నిర్మల్ జిల్లాల బాధ్యులు నాయకులు పాల్గొన్నారు.



కలెక్టర్ అధికారులపై దాడి హేయమైన చర్య
జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్, వడ్డేబోయిన శ్రీనివాస్

నవతెలంగాణ-మహబూబాబాద్

వికారాబాద్ కలెక్టర్ శ్రీ ప్రత్ జైన్, ఇతర అధికారులపై దాడులు హేయమైన చర్య అని జిల్లా ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వడ్డెబోయిన శ్రీనివాస్ అన్నారు. గురువారం మహబూ బాబాద్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్, ట్రెస్సా, టీఎన్జీవోస్, పంచాయతీరాజ్ సెక్రటరీల సంఘం అన్ని ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ వడ్డబోయిన శ్రీనివాస్, జేఏసీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు భగవాన్ రెడ్డి, టీజీవో ఉపాధ్యక్షులు వేముల సురేష్, తహసీల్దార్‌లు పవన్‌కుమార్, రాజు, విజయ, నారాయణమూర్తి, భద్రకాళి, టీజీవో ప్రధాన కార్యదర్శి కొప్పు ప్రసాద్, టీజీవో సోమ్లా, రాజేంద్రప్రసాద్, నరసింహస్వామి, నాగ బ్రహ్మాచారి, పంచాయతీ సెక్రెటరీ అసోసియేషన్ రంజిత్, ట్రెజరీ వెంకన్న అన్ని విభాగాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి
చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి

నవతెలంగాణ-మహబూబాబాద్

మహిళలు ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి అన్నారు. గురువారం మహబూబాబాద్ మున్సిపాలిటీ 23వ వార్డులో వార్డు కౌన్సిలర్ మార్నేని శ్రీదేవి రఘు ఆధ్వర్యంలో దైవ కృప స్వచ్ఛంద సేవా సంస్థ వారు గత రెండు నెలలుగా నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన సుమారు 100 మంది మహిళలకు శిక్షణ, సర్టిఫికెట్లను మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అతిథులుగా మున్సిపల్ వైస్ చైర్మన్ మారినేని వెంకన్న , మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్ధన్, వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు లోకేష్, వీరన్నలు పాల్గొని ప్రసంగించారు. ఈకార్యక్రమంలో 23 వ వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు పోలిశెట్టి సంపత్, జరుపుల బాలు, టిఆర్ఎస్ నాయకులు మార్నేని కిరణ్ మహిళలు వేల్పుల నాగలక్ష్మి, మేక వాణి, మన్నెమ్మ, రోజా, స్రవంతి, బిందు, దివ్య లత, స్వాతి, సుజాత, అశ్విని, మాధవి, పద్మ, భారతి, ధనలక్ష్మి, శ్రీలత, జ్యోతి, రశ్మిత, జవేరియా, కళ్యాణి, స్నేహ, మౌనిక, అనూష, దివ్య, మానస, నవ్య దేవిభారతిలు పాల్గొన్నారు.



గర్భకోశ వ్యాధులను అరికట్టాలి
మండల పశు వైద్యాధికారి రాజశేఖర్

నవతెలంగాణ-పెద్దవంగర:



పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధులు, సీజనల్ లో వచ్చే వ్యాధులను గుర్తించి అరికట్టాలని మండల పశు వైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. ఉప్పెరగూడెం గ్రామంలో పశుసంవర్ధక శాఖ, నోవార్టీస్ అగ్రో ఫెడరేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువుల గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. అనంతరం రాజశేఖర్ మాట్లాడుతూ పశువుల్లో సీజనల్ వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు, నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హేమలత, తొర్రూరు ఏరియా గోపాలమిత్ర సూపర్‌వైజర్ అనిల్, ఎల్ఎస్‌ఏ రాము, వీఎల్‌ఓ ప్రభాకర్, గోపాల్ మిత్రులు వెంకన్న, యాకుబ్ పాషా, ఓఎస్ హాసన్, ఉప్పలయ్య, పాడి రైతులు గ్యార సోమయ్య, పెద్ది మల్లేష్, ఓరుగంటి యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సులలో అడ్మిషన్ల తేదీ పొడిగింపు

నవతెలంగాణ-మహబూబాబాద్

తెలంగాణ రాష్ట్ర పారామెడికల్ బోర్డు హైదరాబాద్ వారి ఉత్తర్వుల ప్రకారం డీఎంఎస్‌టీ, డీఈసీజీ పారామెడికల్ కోర్సులకు గాను అడ్మిషన్ పొందడానికి దరఖాస్తులకు ఈనెల 11వ తేదీ నుండి నుండి 20వ తేదీ వరకు పొడిగించడమైనదని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ లకావత్ వెంకన్న తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తుతో పాటు అన్ని సర్టిఫికెట్స్ యొక్క జిరాక్స్ కాపీలు స్వీయ ధ్రువీకరణ పత్రాలతో జతపరచాలని ప్రిన్సిపల్ తెలిపారు. అప్లికేషన్ లో తప్పుడు సమాచారం, సంబంధిత సర్టిఫికెట్లు సమర్పించని ఎడల అట్టి దరఖాస్తు తిరస్కరించబడుతుందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్/ నెల్లికుదురు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ముఖ్య సమావేశం నిర్వహించారు నిర్వహించారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మత్స్య సోమయ్య మాట్లాడుతూ ప్రతినెల విద్యార్థుల ప్రోగ్రెస్ పరిశీలన చేసి ఉపాధ్యాయులతో పిల్లల వ్యక్తిగత విషయాలు వారి చదువుల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు వెనుకబడిన పిల్లల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పిల్లల ప్రగతిలో భాగం అయి పని చేస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు అదే విధంగా నవంబర్ 14 ను పురస్కరించుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూ.1500 రసొంత ఖర్చుతో ఆటలో గెలిచిన పిల్లలకి గెలవని పిల్లలు అందరికీ, మెరిట్ విద్యార్థులకు, రెగ్యులర్‌గా పాఠశాలకు వచ్చే పిల్లలకు వారి తల్లితండ్రులు చేతులమీదగా బహుమతి ప్రధానం చేశారు. ఈసమావేశంలో ఉపాధ్యాయులు బాతుక బుచ్చిరామయ్య, పరిధుల వెంకటేశ్వర్లు, దాసరి యాదగిరి, బొమ్మనబోయిన రమేష్, ముత్యాల సునీల్, తల్లితండ్రులు స్వాతి, శైలజ, బాబురావు, రేణుక, లావణ్య, మమత తది తరులు పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-కేసముద్రంరూరల్

కేసంద్రం రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఆ వ్యక్తిని హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తమవుతోంది. కేసముద్రం రైల్వే స్టేషన్‌లో మొదటి ప్లాట్‌ఫారం వైపు రైల్వేస్టేషన్ ఆవరణలో పూల మొక్కల తొట్టి వైపు తల పలిగి రక్తం మడుగులో మృతి చెంది ఉన్నాడు. గుర్తు తెలియని వ్యక్తి అతనిని హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తమవుతుంది. రైల్వే స్టేషన్ ఆవరణలో చంపి శవాన్ని పడేసి ఉంటారని అనుమానం. స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

పట్టుపడ్డ వాహనాల వేలం
రూ.పదకొండు లక్షల ఆదాయం

నవతెలంగాణ-గూడూరు

ఎక్సైజ్ శాఖలో ఆధ్వర్యంలో తనిఖీలలో పట్టుపడ్డ పలు వాహనాలను గురువారం మండల కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో వేలం పాటలో విక్రయించారు. మహబూబాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.కిరణ్ ఆధ్వర్యంలో వాహనాలకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వాహనాల బహిరంగ వేలంలో ప్రభుత్వానికి అమ్మకం ద్వారా రూ.9,63,300 ఆదాయం దీనికిగాను జీఎస్టీ రూపంలో రూ. 1,69,746లు మొత్తంగా రూ.11,33,046 ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ బహిరంగ వేలం కార్యక్రమంలో గూడూరు, చెన్నారావుపేట, నర్సంపేట, వర్ధన్నపేట, భూపాలపల్లి, మహబూబాబాద్ కి చెందిన సుమారు 120 మంది వ్యక్తులు బహిరంగ వేలంలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో గూడూరు సీఐ బిక్షపతి, ఎస్సై రాజేశ్వరి స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

హామీల అమలులో రేవంత్ సర్కార్ వైఫల్యం
రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామ్మోహన్ రెడ్డి

నవతెలంగాణ-తొర్రూరు

రాష్ట్రంలో అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి అనేక హామీలు, గ్యారంటీలు ఇచ్చి ఏడాది కావస్తున్నా ఈనాటికీ హామీల అమలులో రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా వైఫల్యం చెందిందని, అతి కొద్ది కాలంలోనే తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకొని అబాసుపాలవుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ సభాధ్యక్షతన ఏర్పాటు చేసిన బీజేపీ సంస్థాగత పర్వం-వర్కషాప్ లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రామ్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా పూర్తి కావస్తున్నదని, బూత్ కమిటీల నియామకం త్వరగా పూర్తి చేసి అనంతరం మండల, జిల్లా అధ్యక్షుల నియామకం ఈనెలాఖరులో జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలోగట్టు రాంబాబు, కాగు నవీన్, మంగళపల్లి యాకయ్య, గడల శేఖర్, రాయపురం రాజకుమార్, విష్ణువర్ధన్‌చారి, విజయ్ కుమార్, చలపతి రాజ్, సంతోష్, శ్రీనాథ్, రవితేజ, భషీర్, శివ, సురేష్, భాస్కర్, శ్రీనివాస్ చారి, కడెం యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-బయ్యారం:

మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారత దేశం తొలి ప్రధాని నెహ్రూ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మహబూబాబాద్ పార్లమెంట్ లీగల్ సెల్ ఇన్‌ఛార్జ్ గుగులోత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం, 14 నవంబర్‌ను బాలల దినోత్సవంగా జరుపుకుంటారని, దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు పిల్లలంటే చాలా ఇష్టమని, దాంతో ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈ రోజును జరుపుకుంటారన్నారు. పిల్లల బాల్యం వారి జీవితంలో అత్యంత విలువైన వారసత్వమని మనం అర్థం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంబాల ముసలయ్య, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోగినేని సీతారామయ్య, కిసాన్ మండల అధ్యక్షులు తెలబోయిన లింగయ్య, బాబా, నాగరాజు, మాజీ సర్పంచ్ బోడ రమేష్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు భూక్యా రవినాయక్, గౌరరం గ్రామ శాఖ అధ్యక్షులు వట్టం సంబశివరావ్, తాటి జనార్ధన్, అలెం భిక్షమ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు దాసరి శ్రీధర్, బండి యాదగిరి, ఆకునూరి సూర్యనారాయణ, రామగిరి వెంకటేశ్వర్లు, చల్ల గోవర్ధన్, మెస్సు క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ- ఇనుగుర్తి

దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ పుట్టినరోజు పురస్కరించుకొని మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో 'బాలల దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ యాజమాన్యులు కొట్టం రాధా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు ఆంగ్ల భాష వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు కొట్టం రాధ బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు (ఎంఈఓ) జే.రూపారాణి, అన్నం యాకయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రణయ్, నారాయణ, ప్రవీణ్, యాదగిరి, సమ్మిరెడ్డి, కౌసరి ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.